నవశక్తి

Vol. 2, no. 16

(Apr. 5, 1939)

బెజవాడ, 1939

Record no. 682

Navaśakti

Vol. 2, no. 16

(Apr. 5, 1939)

Bejavāḍa, 1939


అధ్యక్షుని కర్తవ్యం

Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపుటం 2 | బుధవారం | 5-4-39 | బెజవాడ | సంచిక 16



నాగేశ్వరరావుగార్లు నిర్యాణమంది మొన్న శనివారం నాటికి సంవత్సరం!
ఆనాడు ఆంధ్రులందరూ ఆయన్ని సంస్మరించారు.

నవశక్తి

ఏజెంట్లు గమనించాలి

1. అమ్మిన ప్రతి కాపీకి 25% కమిషను ఇవ్వబడును.
2. ఏజెంట్లుకు పంపిన కాపీలలో 10% (నూటికి పది) కన్న ఎక్కువ కాపీలు తిరిగి తీసుకోబడవు.
3. ప్రతి నెల బిల్లులు, మరుసటి నెల 15 వ తారీఖు లోపల చెల్లించవలయును.

ఉదా :—మార్చి నెల బిల్లు ఏప్రిల్ 15 వ తారీఖులోపల చెల్లించవలయును.

4. అట్లు చెల్లించని వారికి పత్రిక ఆ పైన పంపబడదు.
5. ఏ ఏజెంటుకైనను 10 కాపీలకు తక్కువ పంపించబడవు.

—మేనేజరు.

* * *

చందా వివరాలు

సంవత్సర చందా	రూ 3—0—0
అర్థ సంవత్సర చందా	1—10—0
విడిప్రతి	0—1—0

బర్మా రేట్లు

సంవత్సర చందా	రు 5—0—0
విడి ప్రతి	0—1—6

ప్రకటన రేట్లు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు)

20 అం॥ లోపల ప్రతి అంగుళానికి	రూ.	0—6—0
20" అం॥ పైన	,,	0—4—0
100" అం॥ పైన	,,	0—3—0
పేజీ	రు 10—0—0 లు	
½ పేజీ	6—0—0 లు	
¼ పేజీ	3—0—0 లు	

షరా:—ఈ రేట్లుపైన కమిషన్లు. డిస్కౌంటులు ఇవ్వబడవు. రు 0—8—0 లకు తక్కువ ప్రకటనలు తీసుకొనబడవు. సెంకగు డబ్బు ముందుగా ఇవ్వవలెను.

ప్రత్యేక నోటునకు, ప్రత్యేక రేట్లు.

* * *

	ఏప్రిల్ నెల కోటా	మార్చి నెలలో చేర్పించినది.
విశాఖపట్టణం	5	2
తూ. గోదావరి	30	7
ప. గోదావరి	50	16
కృష్ణా జిల్లా	50	34
గుంటూరు	30	16
నెల్లూరు	20	9
రాయలసీమ	10	4
ఇతర స్థలాలు	5	7
	200	95

విదేశాలలో మా ఏజెంట్లు

జి. కాశిదాసు, 209 పేయర్ స్ట్రీట్
రంగూన్.

వర్కర్సు బుక్ షాప్, 14 కింగ్సు స్ట్రీట్,
లండన్. W. C. 2.

లీగ్ ఆఫ్ ఇండియాన్ ఫ్రీడం, 112 ఈస్టు 19 వ స్ట్రీట్,
న్యూయార్కు సిటీ.

సంపుటం 2 | నవశక్తి | బుధవారం

సంచిక 16 | 5-4-39

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

అధ్యక్షుని కర్తవ్యం

"గండం గడిచింట-బ్రతికి బయట పడ్డాం" అని తలచాం త్రిపురీ సమావేశానంతరం. కాని సంక్షోభ ఇంకా సన్నగిలలేదు. కాంగ్రెసు బలహీనమయే సూచనలు, కాంగ్రెస్ విధ్వంసమయే లక్షణాలు గోచరిస్తున్నాయి. భవిషత్ అంధకారమయంగా ఉంది.

ఈ అంధకారాన్నుండి బయటపడే మార్గం—ఈ విధ్వంసాన్నుండి కాంగ్రెసును కాపాడే విధానములేదా? ఉన్నది. అధ్యక్షుని హస్తాలలో ఉంది.

అధ్యక్షుని ఎన్నికతోనే అంతకు పూర్వపు గడబిడ అంతమొందుతుందని తలచాం. కాలేదు. 12 గురు రాజీనామా నిచ్చారు. ఒక రకపు భావాలు గలవారే వర్కింగు కమిటీలోకి కావాలన్నారు. అదివరకు అధ్యక్షుని త్రోవ కడ్డురామని చెప్పిన గాంధీయులు, త్రిపురీలో అధ్యక్షుని బోటుకు చిల్లులు కనిపెట్ట సాగినారు, అయితే ఒక విషయం వారు తెలుసుకోగల్గినారు. "కాంగ్రెసులో తీవ్రవాదులకు పలుకుబడి హెచ్చుతున్నది. కాంగ్రెసు అనుచరులంతా పోరాటాన్ని కోరుతున్నారు." అని. అందుచేతనే త్రోవకడ్డంరాని గాంధీవాదులు త్రోవకడ్డం పడ్డారు. పోయిన ప్రతిష్ట కాపాడుకోదలచినారు. మహాత్ముని పేరు నుపయోగించుకుని. ఎలాగయితేనేం తమ "స్టేటస్‌కో" నిలబెట్టుకోగలిగారు. అదే పంతు తీర్మాన ఫలితము. పంతు తీర్మానము అధ్యక్షునిపై అవిశ్వాసమా? కాదని పంతు చెప్పనే చెప్పాడు. కాని మితవాదులలోని మితవాదులకీ పద్ధతి నచ్చలేదు. పంతు ఉపన్యాసం పనికిరాలేదు. వారికి కావలసినది "స్ట్రైట్ (తిన్నని) ఓటు". చూచుకోవలసింది "బలాబలాలు."

అందుచేతనే త్రిపురీ కాంగ్రెసు సమావేశానంతరము బొంబాయి రాష్ట్ర కాంగ్రెసు కమిటీ అతివాదులను "పర్జు" (నెట్టివేయడం) చేసే విధానాన్ని గురించి ఆలోచించింది.

ఆంధ్రదేశంలోని ఒక మితవాద వృద్ధ పత్రిక పంతు తీర్మానం అధ్యక్షునిపై అవిశ్వాస తీర్మానమని సంతృప్తిపడి గుటకలు వైచింది.

అధ్యక్షుని అనారోగ్య పరిస్థితులవలన గాంధిగారితో సంప్రదించి, వర్కింగు కమిటీని ఏర్పరచుటకు అవకాశము గల్గినది కాదు. ఈ ఆలస్యాన్నుపయోగించుకొని కొందరు సుభాసుమీది కురుకుచున్నారు. సత్యమూర్తివంటి "నిష్కళంక, అకుంఠిత త్యాగమూర్తికి" దేశ మల్లకల్లోలముగ నున్నట్లు కనపడినది. మహాత్మునియందు అపార ప్రేమ లభించినది. కాంగ్రెసు అధ్యక్షుడు పంతు తీర్మానమును అవిశ్వాసముగ తీసుకొని రాజీనామా నీయవలెనని ఆయన వాంఛ. ఇంతేగాదు. సుభాసునితో సంప్రదించకుండగనే పంతు తీర్మానము ననుసరించి మహాత్ముడు వర్కింగుకమిటీని ఎన్నుకొనుటకు తన అధికారాన్ని ఉపయోగించాలట! ఈవిధంగా ఒక భాగాన్ని—అధ్యక్షునితో సహా—బయటకు నెట్టాలని కొందరి కోరిక. ఇది వినాశానికి కారణం! విధ్వంసానికి త్రోవ!!

ఇక తీవ్రవాదుల వైఖరి చూద్దాం. కొందరు పంతు తీర్మానాన్ని చట్టరీత్యా అశాస్త్రీయమని వాదించుచున్నారు. సుభాసుబాబు కూడా ఈమధ్య గావించిన ప్రకటనలో "చట్ట విరుద్ధము-అశాస్త్రీయము" అనీ, తెల్పాడు. పంతు తీర్మానానికి వ్యతిరేకంగా రాష్ట్రీతత్వాన్ని ప్రేరేపించే "ఆల్ బెంగాల్ డే" కొందరు లేవదీస్తున్నారు. ఇది కూడా వినాశానికి కారణం! ఇది కూడా విధ్వంసానికి త్రోవ!!

పంతు తీర్మానము చట్ట విరుద్ధమయితే కావచ్చును. అశాస్త్రీయమయితే కావచ్చును. కాని నేటి జాతీయ క్లిష్ట పరిస్థితుల ననుసరించి. "ఇది చట్ట విరుద్ధమా—కాదా?" అని చిన్న పేచీలతో కాలం బుచ్చే సమయము కాదిది. కాంగ్రెసు ఒక విప్లవ సంస్థ. మహాసంస్థలో ఏవిధముగానైతేనేం పంతు తీర్మానము ప్యాసయింది. మహాత్మునియందు మూఢ విశ్వాసమే గావచ్చు; కాంగ్రెసు కమిటీలలోని పెద్దల అధికార బలమే గావచ్చు; ఎనిమిది రాష్ట్రాల మంత్రుల ప్రచారమె కావచ్చు ఎలాగయినా పంతు తీర్మానము ప్యాసయింది. తీర్మానాన్ని అమలుపరచడము అధ్యక్షుని విధి. ప్రజాస్వామ్య పద్ధతి అది. చిన్న చిన్న పేచీలతో మరల కయ్యానికి దిగడానికి ఒక సోదర పత్రిక చెప్పినటుల కాంగ్రెస్ లిమిటెడ్ కంపెనీ కాదు. వెన్వెంటనే, పరిస్థితులు విషమించక ముందే, మహాత్మునితో ఆలోచించి సుభాసుబాబు వర్కింగు కమిటీని నియమించుట మంచిది. కలకత్తా సమావేశమువరకు వాయిదా వేయవలసిన పనిలేదు. కలకత్తాలో విచారించవలసిన విషమ సమస్య లెన్నో ఉన్నవి. వాటికి దానిని వదలివేయాలి. త్రిపురీలోనే అసలు సమస్యలను విడిచి, అప్రధాన సమస్యల వైపుకు మన శక్తిని మరల్చి వృధా చేశారు. కలకత్తా మరొక త్రిపురి కారాదు. ఇదే నేడు దేశము వాంఛించుచున్నది! కాంగ్రెసు అనుచరులు కోరుచున్నది!!

అంతర్జాతీయ పరిస్థితులు రోజు రోజుకూ విషమించుతున్నాయి. నేడో, రేపో యుద్ధం అన్నట్లున్నది. దేశములోకూడ అనేక సమస్య లెదుర్కొనుచున్నాయి. ఇట్టి సమయములో భారత జాతినంతా ప్రబోధించడానికి. నడపడానికి, వర్కింగు కమిటీ అవసరం. గత సంవత్సరము వర్కింగుకమిటీ తగిన నాయకత్వం వహించలేదుగదా అని అధ్యక్షుడనవచ్చును. కాని ప్రాత వర్కింగు కమిటీ చేసిన తప్పులనే అధ్యక్షుడు మరల ఎందుకు చేయాలి?

అధ్యక్షుని అనారోగ్యపరిస్థితులు మాకు తెలుసు. అధ్యక్షుని మానసికావేదనకల్గించే కృత్యాలను మితవాదులు చేసినదీ మేమెరుగుదుము. అయినా, నేటి విపత్తునుండి కాంగ్రెసును రక్షింపవలసిన భారం, కాంగ్రెసు సామ్రాజ్య వాదానికి లొంగిపోకుండా తగిన పోరాటాన్ని ఈయవలసిన భారం, అతివాదుల చేతులలోనే ఉన్నది. అందుకనే, ఏదో వంకతో అధ్యక్షునిచే రాజీనామా పెట్టించి, ఒకే రకపు వర్కింగు కమిటీ వేసుకోవాలని చూసే వారికి, ఆశాభంగము కల్గించేటట్లు కలకత్తా సమావేశానికి ముందే వర్కింగు కమిటీని సుభాసుబాబు నియమించాలి.

పంతు తీర్మానము ద్వారా, తమకు 'మొనాపలీ' కల్గిందనీ, ఒక్క మితవాదులే కాంగ్రెసు వర్కింగు కమిటీలో ఉండాలనీ మితవాదులు తలిస్తే ఇంతకంటె భ్రమ ఇంకొక్కటి ఉండదు. తమ మితవాద పద్ధతులకు స్వస్తి చెప్పమనే, సుభాషుని ప్రెసిడెంటుగా ఎన్నుకొన్నారు. మహాత్ముని నాయకత్వము అంగీకరించిదికూడా పోరాటాన్ని సాగించడానికేగాని, ప్రాత పద్ధతుల ననుసరించమనికాదు. విషయ నిర్ణయ సభలో 135 ఓట్లు రావడముఅంటే నూటికి 40 నుంది ప్రాత నాయకత్వానికి విరుద్ధంగా ఉండటము అన్నమాట. ఇదిచూచైనా మితవాదులు పాఠము నేర్చుకోవాలి. నేడు దేశానికి కావలసింది 'సంయుక్త నాయకత్వము' గాని, ఒకే పక్ష నాయకత్వము గాదని తెలుసుకోవాలి.

అఖిల భారత సోషలిస్టు పార్టీ నిర్ణయం గాకపోయినా, నరేంద్రదేవ్, జయప్రకాశ్‌వంటి సోషలిస్టు ప్రముఖులు వ్యక్తిగతాభిప్రాయాన్ని తెలుపుతూ, తాము వర్కింగు కమిటీలో నుండజాలమని తెల్పారు. దీనితో మేమేకీభవించజాలం. ఇట్టి పరిస్థితులకు వారిని ఏ యే ఘటన లీడ్చుకొని వచ్చినది కూడా మాకు తెలుసు. సోషలిస్టులు వర్కింగు కమిటీ సభ్యత్వాని కాశపడి తటస్థంగా ఉన్నారని కొందరు ప్రచారంగావించిన మాట నిజమే. కాని ఇందులకు భయపడి, మనం ఇట్టి తీవ్రపరిస్థితులలో కార్యభార భాగాన్ని వహించక పోవడం మంచిదికాదు. సోషలిస్టులు వర్కింగు కమిటీలో నుండి, జవహర్ సుభాషులకు ప్రోత్సాహమిస్తే, కాంగ్రెస్ సంకుచితపంథా విడిచి, పోరాటమార్గాన నడవక తప్పదు. లేనిచో సుభాసుబాబు తనకోసమే అధ్యక్ష పదవిని పట్టుక ఊగులాడు చున్నాడను నిందకు పాల్పడవలసి వస్తుంది.

ఈ విషమ పరిస్థితుల నన్నింటినుండి తప్పించుట కొకే మార్గము. కాంగ్రెసు అధ్యక్షుడు కలకత్తా సమావేశానికి పూర్వమే, మహాత్ముని అభీష్టము ననుసరించి వర్కింగు కమిటీని నియమించాలి. కలకత్తా సమావేశంలో, జాతీయ వాంఛా తీర్మానాన్ని అమలు పరచేటందుకు మార్గాలు చూపాలి. దేశాన్ని సత్వర స్వరాజ్య సంస్థాపనకై మరొక మహోద్యమానికి సన్నిద్ధం చేయాలి. ఇదే. కాంగ్రెసు అధ్యక్షుని నేటి కర్తవ్యం.

వారం రాజకీయాలు

ఇండో బ్రిటిషు వర్తకపు ఒడంబడిక

ఇండో బ్రిటిషు వర్తకపు ఒడంబడికకు భారత శాసన సభ్యులు కూడ తమ ఆమోదాన్ని తెలియజేయవలసిందంటూ కేంద్ర శాసన సభలో జఫరుల్లాఖాన్ (ప్రభుత్వ వ్యాపార సభ్యుడు) తీర్మానాన్ని ప్రతిపాదిస్తే. దానిపై రెండు రోజులు చర్చ జరిగిన తరువాత 47 గురు అనుకూలంగాను, 59 గురు ప్రతి కూలంగాను వోటు చేశారు. ముస్లింలీగ్ సభ్యులందరూ తటస్థంగా ఉన్నారు.

ఒడంబడిక యెడల ప్రజాభిప్రాయమేమో యీ వోటింగువల్ల స్పష్టంగా తెలిసిపోయింది. బ్రిటన్ మన దేశపు పత్తిని స్వల్పంగా కొనుక్కున్నప్పటికీ బ్రిటిషు బట్టను మాత్రం మనము విస్తారంగా, తక్కువ దిగుమతి పన్నులతో, కొనుక్కొనే గ్యారంటీ యివ్వడానికి ఇండియా ఏ మాత్రమూ అంగీకరించదని శాసన సభ్యులు స్పష్టంగా తెలియజేశారు. బ్రిటిషు పెట్టుబడిదార్ల దాహానికి ఇండియాను ఆహుతి చేయడానికి వీరు యిష్టపడలేదు. ముస్లింలీగ్ సభ్యులు మాత్రం సైనిక బిల్లు మాదిరి ప్రభుత్వానికి అనుకూలంగా వోటు చేయలేదు. తటస్థంగా ఉండి, గుడ్డిలో మెల్ల అనిపించుకున్నారు. ఆ విధంగానైనా కాంగ్రెసు పార్టీకి సహాయ పడ్డారు.

కాని, పై శాసనసభలో ప్రభుత్వానికే జయము కలిగింది. త్వరలోనే ఒడంబడిక షరతుల్ని అమలుపరచడానికి ఇండియా ప్రభుత్వం చిత్తు చట్టాలను ప్రవేశపెట్టింది కూడా. ఇట్టిపరిస్థితులలో భారతీయుల కర్తవ్యం ఏమిటి? సీమగుడ్డలు కొనకుండా బహిష్కరించడానికి బ్రహ్మాండమయిన ప్రజా ఉద్యమాన్ని లేవదీయవచ్చు. కాంగ్రెసు. లంకషైర్ పెట్టుబడిదార్లు దీన్ని 1930 — 32 లో ఎంతో చక్కగా రుచి చూచారు!

ప్రభుత్వం— మన పంచదార పరిశ్రమ

ఏడు సంవత్సరాల క్రితము ప్యాసైన ఆచరణలోకి వచ్చిన పంచదార రక్షణ చట్టానికి ఫలితముగా మన పంచదారపరిశ్రమ నేటివరకు చక్కని అభివృద్ధి పొందుతోంది. 1932 లో దేశం మొత్తము మీద ఉన్న పంచదార ఫ్యాక్టరీలు 32 మాత్రమే. 1938 నాటికి యీ సంఖ్య 136 కి పెరిగింది. 1932 లో పంచదార ఉత్పత్తి 1,58,581 టన్నులు మాత్రమే అయివుండగా, 1938 లో 9,30 700 టన్నులకు పెరిగింది. ఇదే విధంగా 15 సంవత్సరాల వరకు పంచదార పరిశ్రమకు రక్షణ యివ్వాలనీ; మొదటి 7సంవత్సరాలు హండ్రడ్‌వెయిట్ 1 కి రు. 7—4—0 లు చొప్పున, తరువాత 8 సంవత్సరాలు రు. 6—4—0 లు చొప్పున విదేశీ పంచదారమీద దిగుమతి సుంకం విధించాలనీ—మొదట టారిఫ్ బోర్డు సిఫార్సు చేస్తే, ప్రభుత్వానికి యిది యిష్టం లేక మొదటి 7 సంవత్సరాలకు రక్షణ యిచ్చి, తరువాత 1937 లో మరొక టారిఫ్ బోర్డును నియమించింది. కాని, యీ టారిఫ్ బోర్డు కూడా మొదటిబోర్డు చేసిన సిఫార్సులనే బలపరిచింది. దీన్ని కూడా తోసిరాజని, ప్రభుత్వం నేడు కేంద్రశాసన సభలో ఒక బిల్లునే ప్రతిపాదించింది. ఇక రెండుసంవత్సరాలవరకు మాత్రమే దిగుమతి సుంకాలు విధించబడతాయనీ; హండ్రడ్‌వెయిట్ 1 కి 6-4-0 లకు బదులు 5-12-0 లు చొప్పున మాత్రమే విదేశీ పంచదార మీద సుంకం విధించబడుతుందనీ—ఆబిల్లులో ఉంది. అంతే కాదు. చట్టంద్వారా యివ్వబడిన రక్షణను చాలావరకు తగ్గించివేయడానికి ప్రభుత్వం 1937 లో దేశీయ పరిశ్రమ మీద హండ్రడ్‌వెయిట్ 1 కి 2-0-0 చొప్పున విధించబడ్డ ఉత్పత్తి పన్ను యికముందుకూడా అలాగే ఉంచడానికి యీ బిల్లు పూనుకొంటూంది.

ఈవిధంగా. ప్రభుత్వంచేత నియమించబడ్డ టారిఫ్ బోర్డులు ఆ ప్రభుత్వంచేతనే ఎంత నిర్లక్ష్యంగా చూడబడుతున్నాయో ఈ ఒక్క ఉదాహరణ చాలు.

మద్రాసు ప్రభుత్వపు కార్మిక విధానము

గత మాసం 29 వ తేదీని పరిశ్రమల గ్రాంటును గురించి మద్రాసు శాసన సభలో జరిగిన చర్చ సందర్భంలో ప్రభుత్వంయొక్క కార్మిక విధానాన్ని తెలియజేస్తూ గిరిగారు, ప్రధాని రాజాజీ కొన్ని విచిత్రమైన అభిప్రాయాలను వెల్లడి చేశారు. మద్రాసులో ప్రకటించబడే ఆంగ్ల-ఆంధ్ర దిన పత్రికలన్నీ ఈ అభిప్రాయాలకు తాళం వేశాయి. కార్మిక శాసనం ప్రవేశ పెట్టే విషయంలో, ప్రభుత్వం కొంతఅనుభవం సంపాదించి, యజమానులయొక్క కార్మికులయొక్క కష్ట సుఖాలు సొంతంగా తెలుసుకున్న తరువాతనే అది సాధ్యమవుతుందని చెప్పారు. కాని యీ "తెలుసుకోవడము" ఎప్పటికి పూర్తి అవుతుందని మేము ప్రశ్నిస్తున్నాం. కాంగ్రెసు ఎన్నికల ప్రణాళిక ప్రకారం కార్మికుల కివ్వవలసిన అతి ప్రధాన హక్కులు కొన్ని ఉన్నాయి. కనీసం వాటిని అయినా శాసన బద్ధం చేయడానికి 2 సంవత్సరాల అనుభవం చాలకపోయిందంటే, ఇంకా ఎన్ని సంవత్సరాలు కావాలో! అదీగాక, కార్మికుల కష్ట సుఖాలతోబాటు యజమానుల "కష్టసుఖాలు" కూడా కాంగ్రెసు మంత్రులు ఆలోచిస్తారని ఎన్నికల రోజుల్లో చెప్పియుంటే, యీ విధానానికి కార్మికులు వోటు వేసేవారు కారేమో! కార్మికులకూ—యజమానులకూ మధ్య తగాదా యేర్పడినప్పుడు మొదటలోనే దాన్ని పరిష్కారం చేయడానికి ప్రభుత్వం పూనుకొంటూన్నదని గిరిగారు తెలియజేశారు. ఇదే నిజం అయితే, చీరాల ఫ్యాక్టరీ యజమాని కార్మికులమీద తుపాకులు కాల్పించడానికి ముందు గిరిగారి రాజీ షరతుల్ని తృణీకరిస్తే, ఆ యజమానిని ఏమి చేయ గలిగింది ప్రభుత్వం? చిట్టివలస కార్మిక తగాదాను సంవత్సరం క్రితమే పరిష్కరించి యున్నట్లయితే, ఇప్పుడీ కాల్పులకు అవకాశం ఉండేదే కాదుకదా! "ప్రభుత్వం యొక్క కార్మిక విధానాన్ని మేము పూర్తిగా అంగీకరిస్తున్నాం" అని టవున్ (ప్రభుత్వ ప్రతికూల సభ్యుడు) ఊరికే చెప్పలేదు!

స్టే—యిన్—సమ్మెలంటే అర్థం ఇతరుల స్థలాన్ని, యితరుల యంత్రాలను బలవంతముగా స్వాధీనం చేసుకోవడం కాబట్టి, అవి హింసాయుత పద్ధతులని రాజాజీ సెలవిచ్చాడు. సత్య—అహింసలంటే ఏమీ తెలియని మూర్ఖప్రజలు నిజంగా హింసాయుత పద్ధతులే అవలంబిస్తారనుకొందాం. కాని అహింసా సిద్ధాంతంలో ఆరితేరిన రాజాజీ కూడా తన సేవకుల ద్వారా అమానుషమైన హింసను చేయించడము ఎవరికేనా ఆశ్చర్యము కలిగించకపోదు. గేట్లలో అడ్డుగా పడుకొని పికెటింగు చేస్తే. యజమానియొక్క మోటారు లారీ వచ్చి వారి మీదుగా పోయి హింస చేస్తుంది కాబట్టి, పికెటర్లు తోవలో అడ్డుగా పడుకోకూడదట! అహా ఏమి అహింస! ఏమి మాటల పొదుపు! ఏమి చమత్కృతి! ఇక బ్రిటిషు ప్రభుత్వముతో శాంతియుతమైన పోరాటము మాత్రం ఎందుకండీ?

సాంబమూర్తి— విద్యార్థులు

హిందూ థియొలాజికల్ హైస్కూలు యొక్క 50 వ వార్షికోత్సవ సందర్భములో శ్రీ బులుసు సాంబమూర్తిగారు యీవిధంగా ఉపన్యసించారు :

"విద్యార్థుల సమ్మెలు కార్మిక సమ్మెల వంటివి కావు. విద్యార్థుల కోర్కెలు సాధారణముగా చాలా చిన్నవిగానే ఉంటాయి. ఇండియాలో నేడు నూతన చైతన్యము ఒకటి ప్రజ్వరిల్లుతోందన్న విషయముఉపాధ్యాయులు గ్రహించాలి. విద్యార్థులు దేశ సేవకు, త్యాగానికి తయారు కావలసిందంటూ పిలుపు ఒకటి వారికి వినబడుతూంది. పాఠశాలలలో బోధించబడే పాఠాలకంటె ఉన్నతమైనఆదర్శాలు కొన్ని వారికి ఉత్సాహము యిస్తున్నాయి. ఈ విషయాలన్నీ ఉపాధ్యాయులు గ్రహించవలసి యుంది ...విద్యార్థుల సమ్మెల విషయములో ఉపాధ్యాయులు తగినంత ఆత్మనిగ్రహాన్ని కలిగి యుండాలి. ప్రేమతోను, న్యాయదృష్టితోను, దయతోను వాటిని పరిష్కరించాలి."

విద్యార్థి ఉద్యమాన్ని ఏవగింపుతో చూచే కాంగ్రెస్ నాయకులు సాంబమూర్తిగారి పై వాక్యాలను గురించి ఆలోచించనైనా ఆలోచిస్తే, స్వరాజ్య పోరాటంలో ఒక అడుగు ముందుకివేసిన వాళ్ళవుతారు.

పంజాబ్‌లో రైతు సత్యాగ్రహం

పంజాబ్ ప్రభుత్వంచే విధించబడిన అదనపు పన్ను రద్దు చేయవలసిందని కోరుటకు కొన్ని వేల మంది రైతులు ఊరేగింపుగా బయల్దేరి లాహోరులో శాసన సభా భవనము వద్దకు రా ప్రయత్నింగా ప్రభుత్వం నిషేధాజ్ఞ యిచ్చింది. రైతులు దాన్ని ధిక్కరిస్తున్నారు. దాదాపు 15 రోజులనుంచి సత్యాగ్రహం సాగుతోంది. సుమారు 500 మందిని ఎరస్టు చేశారు. అనేకమందికి శిక్షలు కూడా విధిస్తున్నారు. ఇఫ్తికారుద్దీన్ అనే ఒక శాసన సభ్యుడు యీ సత్యాగ్రహం చూడ్డానికి వెళ్ళితే, ఒక పోలీసు ఉద్యోగి కొట్టాడట. ఈ విషయాన్ని గురించి శాసన సభ్యులు చర్చించడానికి ఒక తీర్మానాన్ని ప్రతిపాదిస్తే, స్పీకరు వీల్లేదని నిరాకరించాడు. వెంటనే 30 మంది కాంగ్రెసు శాసన సభ్యులు బయటికి వచ్చి రైతు సత్యాగ్రహాన్ని నడపడానికి నడుములు కట్టారు. కాని పోలీసులు ఎరస్టు చేయలేదు. సీటితీరువా యివి నాల్గవ భాగానికి తగ్గించవలసిందంటూ ఒకశాసన సభ్యుడు పంజాబు శాసనసభలో ప్రతిపాదించిన తీర్మానము ఓడిపోయినప్పటికీ, 4 గురు మంత్రివర్గ పక్షీయులు ప్రభుత్వానికి వ్యతిరేకముగా వోటు చేసి, డజను మందికి పైగా తటస్థంగా ఉన్నారు. మియాన్‌నూరుల్లా అనే మంత్రివర్గ పక్షీయుడు తాము ప్రజల కిచ్చిన ఎన్నికల వాగ్దానాన్ని గురించి జ్ఞాపకము చేస్తూ వార్నింగ్ యిచ్చాడు.

ఈ ఘటనలన్నీ చూస్తే పంజాబులో రైతు ఉద్యమము యొక్క ఒత్తిడి శాసనసభ్యులమీద ఎంత తీవ్రముగా ఉందో బోధపడుతుంది. "జమీందార్ల ఆదాయాన్ని ఎక్కువ చేయడానికే పంజాబులో కొత్త భూమి శిస్తు విధానము తీసుకొని రాబడిందని" హయత్‌ఖాన్ (ప్రధాని) బహిరంగముగా ప్రకటించిన తరువాతకూడా, రైతులు శాంతముగా ఊరుకోగలరా? వారిచే ఎన్నుకొనబడిన శాసన సభ్యులు (అందరూ కాకపోయినా) ఇట్టి విధానాన్ని అరికట్ట ప్రయత్నించడము కొనియాడవగిన విషయము.

జమీందార్లు —రైతులు

మద్రాసు రాజధానిలో కొందరు జమీందార్లు అడవులు, సాముదాయక భూములు విక్రయిస్తున్నారనీ, రైతులు జమిందార్లకు చెల్లించవలసిన శిస్తులు చెల్లించడము లేదనీ, యీ రెండూ న్యాయ విరుద్ధమే కాబట్టి అట్టి అన్యాయాలు జరుగరాదని హెచ్చరిస్తూ మద్రాసు ప్రచురణ శాఖా మంత్రిగారొక ప్రకటన గావించారు.



మద్రాసు ప్రధాని రాజాజీ

రెండూ కొంతవరకు యదార్థమేనని అంగీకరించాలి. అయితే, శిస్తులు చెల్లించడము మానివేసిన రైతుల్ని జమిందార్లు అనేక రీతుల నిర్బంధించి, ప్రభుత్వోద్యోగులకు లంచాలిచ్చి, వసూలు చేసుకోగలుగుతున్నారు. కాని, చల్లపల్లి, గంపలగూడెము, ముక్త్యాల వగైరా ఎస్టేట్లలో బాహాటముగా అడవులూ, సాముదాయక భూములూ విక్రయించబడుతోంటే, బీద రైతులు యిట్టి అక్రమాలను అరికట్టుటకు సమర్థులా? డబ్బుగలవాడిదే యీ రోజులలో న్యాయం. కాబట్టి, కడుపు మంటతో మలమల మాడే రైతులు శిస్తులు చెల్లించక పోతే వారిమీద ఎస్టేట్ ల్యాండ్ ఆక్టు ప్రకారం చర్య తీసుకొనే ముందు సమస్త ఐశ్వర్యాలతోను తులతూగుచూ ఆక్టుకు విరుద్ధముగా ప్రవర్తించే జమీందారుల మీద చర్య తీసుకోవాలి.

రాజకోట తీర్పు

రాజకోట వ్యవహారములో ఫెడరల్ జడ్జి సర్. మారిస్ గేయర్ ఇరుపక్షాలవారి రికార్డులు పరిశీలించి తన నిర్ణయాన్ని మొన్న సోమవారమునాడు ప్రకటించాడు. ఆ తీర్పులో ఇలా వుంది: మొట్టమొదలు ఠాకూర్ సాహెబ్ రిఫారమ్సు కమిటీలో పటేల్ నిర్ణయించినవారిని ఏర్పరచాడు కాబట్టి ఆ నిర్ణయాలను నిరాకరించే హక్కు తనకేమీ అట్టిపెట్టుకోలేదు. అందుచేత ఇప్పుడు పటేల్ నిర్ణయించినవారిని ఠాకూర్ సాహెబ్ అంగీకరించి తీరాలి. అయితే పటేల్ చేసే ఈ నిర్ణయాలను తగినంత కారణము చూపుతూ విమర్శించవచ్చు. కాని తుది నిర్ణయం పటేల్‌దే అవుతుంది.

పాపం! ఇల్లా అవుతుందని తెలిసే కాబోలు. ఠాకూర్‌సాహెబ్, సంస్థానాధీశుల అత్యాచారాలను సమర్థించడములో మొనగాడైన సర్. సి. పి. రామస్వామి అయ్యర్‌గారిని తన కేసు వాదించమని ప్రతిమాలాడు. చివరికి ఫెడరల్ జడ్జికి రికార్డు అంతా ఒక మాటు ఇవ్వక కాలయాపనకూడా చేశాడు. కాని ఇప్పుడు ఫెడరల్ జడ్జి కూడా ఠాకూర్ సాహెబుకు అనుకూలముగా తీర్పు ఇవ్వలేకపోయాడంటే, సంస్థానాధీశులు తమ వాగ్దానాలను ఎంత చక్కగా నెరవేరుస్తారో బోధపడుతుంది.

యు. పి. ప్రభుత్వం హిందూ ముస్లిం కలహాలు

యు. పి. రాష్ట్రంలో రోజురోజుకీ హెచ్చిపోతూన్న హిందూ-ముస్లిం మత కలహాలను అరికట్టడానికి యు. పి. కాంగ్రెస్ మంత్రివర్గం తీవ్రమైన చర్యలు గైకొనబోతూన్నదని గోవిందవల్లభపంతు ఎసంబ్లీలో తెలియచేశాడు. మతోద్రేకాలను రెచ్చగొట్టే ఉపన్యాసాలకూ. కరపత్రాలకూ వ్యక్తుల్లను కఠినమైన శిక్షలకు గురి చేయడం; మర్యాద కుటుంబీకులనుండి ప్రత్యేక కానిస్టేబుల్సును నియమించడము; శాంతికి భంగం కలిగించే ఘటనలకు ఎట్టి చిహ్నములయినా కనపడితే, ఎరస్టు చేయడం; 107, 144 వ సెక్షన్ల ప్రయోగం; కలహాలు చిరకాలము ఉంటే. ప్యూనిటివ్ పోలీసుల్ని నియమించడం; ప్రజలలో మధ్యవర్తి సంఘాలు, పీస్ కమిటీలు ఏర్పాటు చేయడము; స్థానిక సంస్థలలో సమిష్టి వియోజక వర్గాలు యిత్యాది కార్యది కార్యక్రమం ప్రభుత్వ దృష్టిలో ఉన్నదని పంతుగారు చెప్పారు.

యు. పి. ప్రభుత్వం అవలంబించబోవు యీ విధానాన్ని కలెక్టర్లు, పోలీసు ఉద్యోగులు మనస్ఫూర్తిగా ఆచరణలో పెట్టితే, హిందూ—ముస్లిం కలహాల తీవ్రత కొద్దికాలంలో తగ్గ గలదు. జాతీయతను విరోధించే యిట్టి కలహాలను అణచడంలో కాంగ్రెసు మంత్రివర్గం ఎంత కఠిన చర్యలనైనా అవలంబించవచ్చు. అవలంబించాలి. అయితే, యీ సమస్యకు బ్రిటిషు సామ్రాజ్య వాదమే వేరుపురుగు. అది నశిస్తేగాని, యీ సమస్య పరిష్కారం కాదు.

వారసత్వపు పన్ను

వ్యవసాయేతర ఆస్తులపైన వారసత్వపు పన్ను (Death Duties) విధించడానికి కేంద్ర ప్రభుత్వము తలపెడితే, వేర్వేరు రాష్ట్ర ప్రభుత్వాలు చిత్ర విచిత్రమయిన అభిప్రాయాలిచ్చాయి. పంజాబ్ ప్రభుత్వము పూర్తిగా వ్యతిరేకాభిప్రాయము యిచ్చింది. మన దేశానికి యిది పనికిరాదని బెంగాల్ ప్రభుత్వము చెప్పింది. మద్రాసు ప్రభుత్వము జవాబు చెప్పడానికి యిష్టపడలేదు. కేంద్రములో ప్రజాప్రభుత్వము ఏర్పడితేనే గాని యీ పన్ను విధించకూడదని బొంబాయి ప్రభుత్వము. ఇదేవిధముగా 8 రాష్ట్రప్రభుత్వాలు అభిప్రాయాలిచ్చాయి. అనుకూలాన్ని తెలియ జేస్తూ యే ప్రభుత్వమూ (కాంగ్రెసు రాష్ట్రాలలోకూడా) చెప్పలేదు.

ఈ వైఖరి ఆశ్చర్యాన్ని కలుగజేయక మానదు. ఒక వైపు ఇండియా చట్టము ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎక్కువ ఆదాయంమీద అధికారం యివ్వక పోగా, మరొక వైపు ఈ విధంగా కొత్త పన్నుల యెడ విముఖత తెలియజేయడం రాజకీయ దూరాలోచన కాదు. పన్నుల భారంతో తరతరాలునుంచీ కృశిస్తూన్న పేద ప్రజలమీద పన్నులు ఆ విధంగానే ఉంచి, ధనవంతులమీద పన్నులు విధించడానికి సంకోచము ఎందుకో తెలియదు. కొత్త పన్నులు ఎట్లాగూ విధిస్తున్నారు. వాటికి ధనవంతులు ప్రతికూలాందోళన గావిస్తూనే ఉన్నారు. కేంద్రంలో అధికారం లేదు కదా అని కొత్త పన్నులు మానడంలేదు! వారసత్వపు పన్ను విధించేది కేంద్ర ప్రభుత్వమే అయినప్పటికీ, రాష్ట్రాలు ఆ ఆదాయంలో కొంత భాగాన్ని అయినా కోరియుండవలసింది.

బొంబాయిలో మద్యపాన నిషేధం

బొంబాయి నగరం అంతటా మద్యపాన నిషేధాన్ని ఆచరణలో పెట్టడానికి బొంబాయి కాంగ్రెసు మంత్రివర్గం త్వరలో ఒక చట్టం ప్రవేశ పెట్టబోతోంది. కార్మికులు, ఇతర బీద ప్రజలు యీ చట్టంవల్ల కొంతవరకు సుఖజీవనం గడపవచ్చుననడంలో సందేహం ఏ మాత్రమూ లేదు. బొంబాయి ప్రధాని బి. జి. ఖేర్ ఒక కార్మిక సభలో ఉపన్యసిస్తూ, మద్య నిషేధ చట్టంవల్ల ఏ విధంగా కార్మికులకు ఉపయోగమో తెలియజేశాడు. డాంగే, మొదలైన కమ్యూనిస్టులు కార్మికుల తరపున ఉపన్యసిస్తూ, ప్రభుత్వానికి ఈ విషయంలో పూర్తిగా సహాయపడతాం అని చెప్పారు.



బొంబాయి ప్రధాని బి. జి. ఖేర్

కాని, కల్లు—సారా వ్యాపారము వల్ల లక్షాధికారులయిన పార్శీ వర్తకులు మాత్రము ఎదురు తిరుగుతున్నారు. పెద్ద పెద్ద సభలు—ఊరేగింపులు చేస్తున్నారు. సత్యాగ్రహము కూడా చేస్తారట! ఈవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని "ఎంబరాస్" చేస్తున్న పార్శీల ఆందోళనను నిర్లక్ష్యము చేసి, బొంబాయి మంత్రివర్గము త్వరలో మద్యనిషేధ చట్టాన్ని అమలుపరచాలి.

రాష్ట్ర కాంగ్రెస్ సంఘంవారి తీర్మానం చాలా అన్యాయం

కాళీపట్నం రైతులు చాలా నిదానించారు: మరొకమార్గం లేకనే సత్యాగ్రహం ప్రారంభించారు

సోషలిస్టు రైతు సంఘ నాయకుల ప్రకటన.

కాళీపట్నం సత్యాగ్రహోద్యమాన్ని గురించి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వారు యిటీవల గావించిన తీర్మానం ఆంధ్రదేశ మందలి ఏ స్వాతంత్ర్య పిపాసినైనా కలవరపెట్టక మానదు. ఆ తీర్మానంలో తీసుకొని రాబడిన కొన్ని ప్రధానాంశములను ప్రతి కాంగ్రెసు అభిమాని, జాతీయోద్యమంలో పాల్గొంటూన్న ప్రతివ్యక్తి జాగ్రత్తగా పరిశీలించవలసియుంది. ఈ ప్రధానాంశములను గురించి ప్రస్తావించక పూర్వం కాళీపట్నం వ్యవహారాన్ని గురించి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు వర్కింగ్‌కమిటీ ఇచ్చిన నిర్ణయంయేమో పరిశీలింతము.

కాళీపట్నం సత్యాగ్రహం "చెడు సలహాపైనను, తొందరపాటుతోను." చేయబడిందని వర్కింగుకమిటీ వారంటున్నారు. తొమ్మిది నెలలక్రితమే జిల్లా రైతు సంఘం, జిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, కాళీపట్నం రైతుల కష్టాలనుగూర్చి పనిచేయ పూనుకున్నాయి. నర్సాపురం, భీమవరం, తాలూకా కాంగ్రెస్ కమిటీలు రైతులయెడ తమ సహాయాన్ని-సానుభూతిని ప్రకటించాయి. ప్రభుత్వానికి విజ్ఞప్తులు పంపాయి. రైతుల న్యాయమైన కోర్కెలను తీర్చమనీ, రైతులచే వదులుకోబడ్డ చేపల హక్కుకు బదులుగా కాళీపట్నం జమీందారుగారు వాగ్దానంచేసిన 800 యకరాల భూమిని యిప్పించడానికి కృషిచేయవలసిందిగా జిల్లా, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలకుకూడా విజ్ఞప్తులు పంపుకున్నారు. (పై వాగ్దానాన్ని జమీందారు గారిప్పుడు చెల్లించడం లేదు.)

దరిమిలాను 12 గురు గ్రామస్థులమీద పోలీసులు 107 వ సెక్షన్ (జామీను) ప్రయోగించారు. కోర్టులలో రైతుల పక్షం వహించి మేము పోరాడాము. పొలాలలోకి పోకుండా గ్రామస్థులమీద 144 వ సెక్షన్ కూడా జారీ చేశారు. గ్రామస్థులు తమ నిత్యజీవితం గడుపుకోవడానికి పొలాలగుండా పోవక తప్పదు. మొదట పోలీసులు ఎందువల్లనో రైతుల్ని నిరోధించలేదు. శాంతి భద్రతలకు ఏమాత్రం భంగం కలుగలేదు. శాంతియుతంగానే సమస్త వ్యవహారాలు జరిగేవి.

ఈ సమస్యపై రైతుల తరపున జోక్యం కలిగించుకోడానికిగాని, యదార్థ పరిస్థితుల్ని నిష్పక్షపాత దృష్టితో విచారించడానికిగాని, పూనుకోక డాక్టరు పట్టాభిగారు గాంధీగారికి ఆంధ్ర సోషలిస్టులు, వ్యక్తుల ఆస్తుల్ని దోచుకోడానికి ప్రోత్సాహంచేస్తున్నారంటూ రిపోర్టులు పంపారు. గాంధీజీకూడ ఖండించారు. అ. భా. కాం. కమిటీ సమావేశములోకూడా పట్టాభిగారు సోషలిస్టులపై విరుచుకపడ్డారు. బీదరైతుల్ని సోషలిస్టులు రెచ్చగొట్టుతున్నారని నిందించారు. ఋజువుచేయుమని వెంటనే అక్కడ మాలో సుందరయ్యగారు అయనను అడిగిరి. ఇప్పుడు కూడా అడుగుచున్నాము. తరువాత ఈ కార్య వ్యవహారంలో జిల్లా కాంగ్రెసు కమిటీగాని, రాష్ట్ర కాంగ్రెసు కమిటీగాని ఏవిధంగాను కలుగజేసుకోలేదు. మహాత్ముని వ్యాసంతోను, పట్టాభి వైఖరితోను, జమీందారీయొక్క మొండితనం ఎక్కువయింది. పోలీసులుకూడా రైతులపై తమ దాడిని తిరిగి ప్రారంభించారు. 107 వ సెక్షను క్రింద విచారించబడుతున్న 12 గురు రైతులకు శిక్ష విధింపబడ్డాయి. మరొకసారి మేజస్ట్రేటు 144 వ సెక్షను ప్రకటించారు. కాళీపట్నం భూముల్ని జమీందారుగారు కొలతలు కొలిచి, ఇతర గ్రామస్థులకు అమ్మివేయడం ప్రారంభించారు. రైతులు తమ హక్కుల్ని కాపాడుకోడానికి శాంతియుతంగా సత్యాగ్రహం చేయడం తప్ప మరొకమార్గం కనపడలేదు. అర్జీలతోను, పిటీషన్లతోను 9 నెలలు గడపిన తర్వాత, జిల్లా, రాష్ట్రకాంగ్రెసు కమిటీలుగాని, కాంగ్రెసు మంత్రివర్గంగాని తమ సక్రమమైన హక్కుల్ని రక్షించక పోయిన తర్వాత రైతులు వాటికై ఎన్ని త్యాగాలైనా చేయడానికి సిద్ధంగా వున్నామను కృతనిశ్చయాన్ని లోకానికి తెలియజేయడానికి శాంతియుతంగా సత్యాగ్రహం చేస్తే, ఆంధ్రకాంగ్రెసునాయకుల అభిప్రాయంలో అది "చెడు సలహాపైనను, తొందరపాటుతోను" చేసినపని అయింది. కాని దీని ఫలితంగా జిల్లా కాంగ్రెసు కమిటీకూడ నేడు రైతులపక్షం వహించి పనిచేస్తూంది.

త్రిపురీ కాంగ్రెసు నుండి రాష్ట్రవర్కింగు కమిటీవారు తాము యీ సమస్యను పరిష్కరిస్తాం అనే హామీతో పెరిగ్రాము యిచ్చాక అది చూచుకొని సత్యాగ్రహం ఆపివేశారు. కాని నేటివరకు డాక్టరు పట్టాభిగారు కాళీపట్నం వెళ్ళనైనా వెళ్ళలేదు. తాను కాళీపట్నంవస్తే రైతులకు బలం చేకూరుతుంది కాబట్టి అక్కడికి వెళ్ళలేనని పట్టాభిగారు స్పష్టంగా నర్సాపురం తాలూకా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడైన కామ్రేడ్ ఉద్దంరాజు రామంతో అన్నారు. అక్కడి రైతుల పోరాటం వ్యక్తిగత ఆస్తుల్ని నాశనం గావించే పోరాటంతప్ప మరొకటికాదని తన అభిప్రాయమైనట్లు చెప్పారు. కాళీపట్నం రైతులు గెలిస్తే, వ్యక్తుల ఆస్తులేవీ యిక ముందు నిలువవని కూడా చెప్పారు. ఇట్టి అభిప్రాయాలుగల అధ్యక్షుని సలహామీద రాష్ట్ర వర్కింగుకమిటీ పైతీర్మానాన్ని ప్యాసు చేసింది. తీర్మానంలో ఎక్కడా రైతులహక్కులు న్యాయమైనవని చెప్పలేదు. డిసిప్లినరీ చర్యలకు లోనుకావలసి వస్తుంది జాగ్రత్త! అనే బెదిరింపులు మాత్రం ఉన్నాయి.

తీర్మానంలో యీక్రింది విషయాలు మరీ దారుణంగా ఉన్నాయి:

1. ముందుగా రాష్ట్ర కాంగ్రెసు కమిటీ యొక్క అనుమతిగాని, సలహాగాని, సంప్రతింపుగాని లేకుండా యికముందెప్పుడూ యిట్టి అధికార రహితమైన సత్యాగ్రహాలు చేయకూడదని వార్నింగు యివ్వబడింది.

2. ఈ సత్యాగ్రహంలో పాల్గొన్న బాధ్యతగల కాంగ్రెసువాదు లందరివద్దను సంజాయిషీ తీసుకొనమని రాష్ట్ర కార్యదర్శికి అధికారం యివ్వబడింది.

ఈ రెండు విషయ నిర్ణయాలవల్ల అతి ప్రధానమైన కొన్ని సమస్యలు బయల్దేరుతున్నాయి. ప్రతి కాంగ్రెసువాది వాటిని పరిశీలించవలసియుంది. ఇట్టి సమస్యలో బీహారు రాష్ట్ర కాంగ్రెసు కమిటీ, కాంగ్రెసు సభ్యులెవరూ రైతు సంఘాలలో పనిచేయరాదంటూ ఆంక్ష విధించింది. అందుచే కాంగ్రెసు, రైతుసంఘాల మధ్య అచ్చట స్పర్థ ఏర్పడింది. దీనిమూలంగా ప్రత్యేక రైతుసంఘాలను స్థాపించుకొనేహక్కు రైతులకు హరిపురా కాంగ్రెసు తీర్మానంలో యివ్వబడింది. అంతటితో యీచర్చముగిసింది. ప్రత్యేక సంఘాలు అంటే అర్థం. అవసరమైనచో స్వతంత్ర కార్యాచరణకు కూడ హక్కు ఉంటుంది. ఇట్టి పరిస్థితుల్లో కాంగ్రెసు ప్రచారకుని కర్తవ్యం ఏమిటి?

మేము అఖిలభారత కాంగ్రెస్ కమిటీలో బాధ్యతగల సభ్యులముగను మాలో ఒకరు రాష్ట్ర రైతుసంఘాధ్యక్షుడుగను, రెండవ వ్యక్తి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ కార్యదర్శిగను, యీ ప్రధాన సమస్య కాంగ్రెసువాదులలో చాలమంది (సోషలిస్టు లందరితో సహా) యీ క్రింది విధంగా ఆలోచిస్తున్నారనీ, ఆంధ్ర రాష్ట్ర వర్కింగుకమిటీవారికి విశదపరుస్తున్నాము.

రైతుల న్యాయమైన కోర్కెలను తీర్చడానికి కాంగ్రెసు కమిటీలు, కాంగ్రెసుమంత్రులు పూనుకొనునట్లు ప్రయత్నిస్తాము. కాంగ్రెసు కమిటీలుగాని, మంత్రులుగాని, యీ విషయములో జోక్యం కల్గించుకోనిపక్షాన రైతులు రైతుసంఘాలుచేయు ప్రత్యక్ష పోరాటాలను బలపరుస్తాము. వారి న్యాయమైన కోర్కెలకై జరిగే పోరాటాలకు సహాయం చేయడంవలననే రైతులు కాంగ్రెసు సంస్థలోకి, స్వరాజ్య పోరాటంలోకి. వస్తారని మావంటి కాంగ్రెసువాదుల దృఢ విశ్వాసం. రాష్ట్ర కాంగ్రెసు కమిటీని మేము సంప్రదించి తీరుతాము. సలహాకూడ పుచ్చుకుంటాము. కాని, సత్యాగ్రహం ప్రారంభించడానికి రా. కాం. కమిటీ వారి అనుమతి కావాలనే అనుమతిని మేము అంగీకరించము. రా. కాం. కమిటీవారి అనుమతి లేకుండా ఏ కాంగ్రెసు సంస్థయొక్క యాజమాన్యాన సత్యాగ్రహం చేయబడదని మేముతెలియజేస్తున్నాం. అంతేగాని, వ్యక్తులుగాగాని, మేము పోరాటాలను హరించే హక్కుమాత్రం విడిచిపెట్టజాలము. రైతుకూలీల ఆర్థిక రాజకీయ దాస్య విమోచనము కొరకు పోరాటాలను సాగించగల శక్తి మన జాతీయపోరాటానికి లాభకరం కాంగ్రెసు సంస్థకు బలం అని మేము గట్టిగా నమ్ముతున్నాము.

కాంగ్రెసు కమిటీలేవీ ధనవంతులయొక్కగాని, భూస్వాములయొక్కగాని, స్వాధీనంలో లేకుండా ఉన్నట్లయితే (మన దురదృష్టవశాత్తు, నేటికి అట్టికమిటీలు చాలా ఉన్నాయి). కాంగ్రెసుకీ - రైతు, కార్మికసంఘాలకూ మధ్య ఎట్టి స్పర్థ ఉండదు. స్పర్థ ఏర్పడినట్లయితే, దానికి సంబంధించిన అన్నిసంస్థలూ, బలహీన మవుతాయి. ఇది జరగకుండా చేయాలని మా ఆశ. అందువల్లనే, కార్మికులయొక్కగాని రైతులయొక్కగాని పోరాటాలకు కాంగ్రెసుకమిటీలు సహాయపడి బలపరచాలని మేము కోరుతున్నాము. కాని, కాంగ్రెసు నాయకులు మమ్మల్ని డిసిప్లినరీచర్యలతో బెదిరించినప్పటికీ, పోరాటాన్ని సాగించే రైతుల్నిగాని, కార్మికుల్నిగాని, మేము విడిచి పెట్టజాలము. విడిచిపెట్టము కూడ. ఎందువల్లనంటే, రైతు - కార్మికుల నిత్యపోరాటాలను విడిచిపెట్టడం అంటే అర్థం కాంగ్రెసుసంస్థను బలహీనపరచడం మాత్రమే కాక కాంగ్రెసును భారతస్వాతంత్ర్యముకోసం పోరాడుసంస్థగా కూడా లేకుండ జేయడమని మాదృఢవిశ్వాసం. మేము కాంగ్రెసుసంస్థను ప్రేమిస్తున్నాం కనుక, స్వరాజ్యపోరాటానికే అన్నిటికంటె ఎక్కువ విలువ యిస్తాం కనుక అందు న్యాయం ధర్మం వున్నప్పుడు ప్రజాసామాన్యపోరాటాలతో సంబంధముంచుకోవద్దని కొన్ని కాంగ్రెసుకమిటీలు చెప్పినా వీనిని అనుసరించజాలము. అంతేగాదు యీప్రజాపోరాటాలను కాంగ్రెసుకమిటీ అయినా విడిచి పెట్టడంగాని, వీనివిషయమే తాటస్థ్యాన్ని అవలంబించడంగాని, జరుగనివ్వం.

ఇట్టి దృక్పథం కాంగ్రెసుకి వ్యతిరేకం అని బహుశః రాష్ట్ర వర్కింగు కమిటీవారు భావించవచ్చును. డిసిప్లినరీ చర్యలు కూడా, ఇట్టి దృక్పథం గలవారిపై తీసుకొనడం తప్పుకాదని భావించవచ్చును. అవిధంగా తీసుకొనవచ్చును కూడ. అట్టి పరిస్థితుల్లో దేశమందలి కాంగ్రెసు వాదులందరికీ- ముఖ్యంగా ఆంధ్రరాష్ట్ర మందలి కాంగ్రెసు వాదులకు-మేముచేసే విజ్ఞప్తి: ఆంధ్ర రాష్ట్ర వర్కింగు కమిటీవారు నేడు అవలంబించుచుండు విచ్ఛిన్నకరమగు దృక్పథమును మానుకొనుటకు తగినట్టి పరిస్థితినీ ఆందోళనా కలుగజేయాలి.

కాళీపట్నం వ్యవహారంలోపాల్గొన్న బాధ్యతగల కాంగ్రెసువాదుల్ని గురించి మేము ఏమీ వ్రాయదలచుకొనలేదు. తమమీద చేయబడిన ఆరోపణలకు వారే ప్రత్యుత్తరం యిస్తారు.

కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి,
(ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాధ్యక్షుడు.)

పుచ్చలపల్లి సుందరయ్య,
(రాష్ట్ర కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ కార్యదర్శి)

బెజవాడ, 29-3-39.

నిర్మాణ సమస్యలు

ఫెడరేషన్‌కు వ్యతిరేకంగా పోరాటము సాగించడానికి దేశములో సన్నాహాలు జరుగుతున్న సమయములో నిర్మాణావశ్యకతనుగూర్చి ప్రత్యేకముగా తెలుపనవసరములేదు. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారిచే ప్రకటించబడిన ఈ పుస్తకము, స్వాతంత్ర్య యోధులకు ఈ నిర్మాణ సమస్యను పరిష్కరించడానికి అనేక సూచనలు యిస్తుంది. వెల అణా. వెంటనే నవశక్తి ఆఫీసుకు వ్రాయండి.

కాళీపట్టణ రైతు దినోత్సవం

నెల్లూరు

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘాధ్యక్షుని ఆదేశానుసారం 25-3-39 వ తేదీని నెల్లూరులో సాయంత్రం 6 గంటలకు తిప్పరాజుగారి సత్రంవద్ద కాళీపట్నం రైతుల యెడ సానుభూతిని తెల్పుటకు బహిరంగసభ జరిగెను. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులైన శ్రీ బొమ్మా శేషురెడ్డిగారు అధ్యక్షత వహించిరి. కామ్రేడ్ అన్నాప్రగడ కామేశ్వరరావుగారు, త్వరకవి నారాయణరావుగారు కాళీపట్నం రైతుల సత్యాగ్రహ పోరాటాన్ని గురించి ఉపన్యసించిన తరువాత, యీక్రింది తీర్మానము అధ్యక్షునిచే ప్రతిపాదించబడి ఏకగ్రీవంగా ఆమోదించ బడెను.

"కాళీపట్నంలో రైతులు తమ అనాదిసిద్ధమైన హక్కులను రక్షించుకొనుటకు గావించిన సత్యాగ్రహమును కొనియాడుచు, యీసందర్భమున కృషిచేయుచున్న ప్రచారకులను, ఎరస్టు గావింపబడిన రైతుసోదర - సోదరీమణులను యీ సభవా రభినందించుచున్నారు.

"పోలీసు ఉద్యోగస్థులు సత్యాగ్రహసందర్భమున శాంతియుతముగా ఉన్న రైతులపై తీవ్రమైన లాఠీఛార్జీయు, అమానుషచర్యలు, ఎరస్టులు గావించి నందులకు వారి చర్యలను తీవ్రముగా ఖండించుచూ, అట్టి చర్యలకు బాధ్యులైన పోలీసుల పైనను, ఉద్యోగస్థుల పైనను తగిన చర్యగైకొనవలెనని కాంగ్రెసు మంత్రి వర్గమును కోరుచున్నాము.

"కాళీపట్టణ రైతుల పోరాటము యెడల, వారి కోర్కెల యెడల, సానుభూతిని వెలిబుచ్చుచు, వారికోర్కెలను వెంటనే జమీందారు తీర్చునట్లు: అరెస్టు చేయబడిన వారిపై కేసులు ఎట్టి షరతులేకుండా వెంటనే ఉపసంహరించుకొని విడుదల చేయునట్లు, కాంగ్రెసు మంత్రివర్గమువారిని కోరుచున్నాము"

"ఈ విషయములో-రాష్ట్రకాంగ్రెసు కమిటీ వారు ఒక కమిటీని నియమించి తగు విచారణ జరుపవలసినదిగా కోరడమైనది,

★ ★ ★

బెజవాడ.

మార్చి 25 వ తేదీని బెజవాడలో, నగర కాంగ్రెసు సోషలిస్టుపార్టీ యాజమాన్యాన సాయంత్రం 6 గంటలకు గాంధీపార్కులో కాళీపట్నం రైతులయెడ సానుభూతిని ప్రకటించుటకు బహిరంగసభ జరిగెను. శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు అధ్యక్షత వహించిరి.

కాళీపట్నంలో అనాదిసిద్ధంగా రైతులనుభవిస్తూన్న చేపల హక్కును, ఇప్పుడు కాళీపట్నం జమీందారుగారు ఏ విధంగా అపహరించి, భూముల్ని యితరగ్రామస్థులకు అమ్మ ప్రయత్నిస్తున్నారో సత్యనారాయణమూర్తిగారు విపులంగా తెలియజేశారు. రైతుల హక్కులను కాపాడుట కాంగ్రెసు ప్రభుత్వం యొక్క కనీస ధర్మం కాబట్టి ఆ ప్రకారంగా ఉత్తరువు లివ్వవలసిందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

తరువాత, రాష్ట్ర రైతుసంఘ ఆర్గనైజర్ కామ్రేడ్ శివలింగ ప్రసాద్‌గారు ఉపన్యసిస్తూ, కాళీపట్నం రైతుల తమ హక్కులకై జరిపిన సత్యాగ్రహపోరాటాన్ని వర్ణిస్తూ, సత్యాగ్రహులమీద పోలీసులు జరిపిన అత్యాచారాలు, గర్భిణీ స్త్రీలను, ముసలి రైతులను లాఠీలతో హింసించి సుమారు 100 మంది రైతులను ఎరస్టుచేసి జైళ్ళకు పంపడం, పవిత్రమైన కాంగ్రెసుపతాకాలను అవమాన పరచడం, మొదలైన అమానుష చర్యలకు బాధ్యులైన పోలీసు ఉద్యోగస్థులమీద తక్షణమేచర్యగైకొని కాంగ్రెసు గౌరవాన్ని కాపాడవలసిందిగా మద్రాసు మంత్రివర్గాన్ని కోరారు.

ఆంధ్రరాష్ట్ర ప్రెస్‌వర్కర్సు యూనియన్ కార్యదర్శి కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు యీ క్రింది తీర్మానాన్ని ప్రతిపాదించగా ఆమోదించబడింది.

"కాళీపట్నం రైతుల భూమిని జమీందారు అపహరించడానికి చేయుప్రయత్నాలను నిరోధించడానికి సత్యాగ్రహం చేయుచున్నందులకు రైతులను అభినందించుచు, మన మంత్రులు వెంటనే భూములను రైతులకు స్వాధీనంచేయాలనీ; లాఠీచార్జీ, ఎరస్టులు మొదలయిన నిరంకుశ చర్యలకు కారకులైన పోలీసు ఉద్యోగస్థులమీద చర్య తీసుకోవాలనీ: ఎరస్టుచేయబడిన రైతులపై కేసులు ఉపసంహరించుకోవాలనీ యీ సభవారు కోరుచున్నారు."

★ ★ ★

తెనాలి.

25-3-39 వ తేదీని సాయంకాలం 6 గంటలకు తెనాలి మ్యునిసిపల్ లైబ్రరీయెదుట పట్టణ కాంగ్రెసు సోషలిస్టుపార్టీ, ప్రెస్ వర్కర్సు యూనియన్ యాజమాన్యమున కాళీపట్నం రైతులకు సానుభూతి తెల్పు నిమిత్తం కామ్రేడ్ కాకుమాను సుబ్బారావుగారి అధ్యక్షత క్రింద బహిరంగసభజరుపబడెను. సభలో కామ్రేడ్స్ పోలేపెద్ది నరసింహమూర్తి, ముక్తేవి మాధవాచార్య గారలు ఉపన్యసించాక, కాళీపట్నం రైతులు తమ హక్కులకై జరుపు పోరాట సందర్భములో లాఠీచార్జిలు, తదితర బాధలకు లోనై సత్యాగ్రహం చేయుచున్నవారికి సానుభూతిని తెల్పుతూ, పోలీసులు సల్పిన లాఠీ చార్జీలు, ఎరస్టులు మొదలైన చర్యల విషయముతో నిష్పక్షపాతమైన విచారణ జరిపించవలసినదిగా మద్రాసు ప్రభుత్వాన్ని కోరుచూ తీర్మానించబడెను.

★ ★ ★

విజయనగరం.

మార్చి 25 వ తేదీ సాయంకాలం 6 గంటలకు పట్టణ యువజనసంఘం, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీల యాజమాన్యమున కాళీపట్నం రైతుల విషయంలో ప్రభుత్వోద్యోగుల చర్యలను నిరసించుటకై విజయనగరంలో బహిరంగసభ జరిగెను.

జొన్నలగడ్డ అన్నపూర్ణాదేవిగారు కాళీపట్నం రైతులు ఎందుకు సత్యాగ్రహం చేయుచున్నదీ తెలియజేసి, గర్భిణీస్త్రీల పైనను వృద్ధులపైనను లాఠీచార్జి చేసిన పోలీసు ఉద్యోగస్థులపై రాజాజీ ప్రభుత్వం వెంటనే తగిన చర్య తీసుకోవలసిందిగా హెచ్చరించారు. లక్కరాజు వెంకట్రావుగారు కూడా ఉపన్యసించిన తర్వాత యీక్రింది తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించ బడెను.

"కాళీపట్నం రైతులయెడ ఈసభవారు తమ సానుభూతిని తెలియపరచుచూ, ఎరస్టైన సత్యాగ్రహుల్నందరినీ వెంటనే విడుదలచేసి, రైతులకు పూర్తియైన న్యాయం కలుగజేయవలసిందని కాంగ్రెసు ప్రభుత్వం వారిని కోరుచున్నారు.'

★ ★ ★

గుడివాడ.

కాళీపట్నం రైతులయెడ సానుభూతిని ప్రకటించుటకై గుడివాడ కార్మిక సంఘంవారు రైతాంగ గ్రంథమాలనుండి బయల్దేరి, ఎర్రజండాలతో నగరమంతటా ఊరేగిరి. సాయంకాలం గాంధి చౌకులో శ్రీ శంకర్రావుగారి అధ్యక్షతను జరిగినబహిరంగసభలో కామ్రేడ్స్ శెట్టిపల్లి వెంకటరత్నం, జోస్యుభట్ల సత్యనారాయణగారలు ఉపన్యసించిన తరువాత కాళీపట్నం రైతుల సత్యాగ్రహాన్ని అణచుటకు పోలీసులు జరిపిన దుండగాలను ఖండిస్తూ సభలో తీర్మానించబడెను.

★ ★ ★

పల్లెకోన

25-3-39 వ తేదీని సాయంకాలం పల్లెకోన గ్రామరైతుసంఘంవారు కామ్రేడ్ చదలవాడ పిచ్చయ్యగారి అధ్యక్షతక్రింద సమావేశమై కాళీపట్నం రైతుల సత్యాగ్రహ పోరాటం న్యాయమైనదే అనీ, సదరు పోరాటాన్ని అణచుటకు పోలీసు అధికారులు చేసిన దుండగాలను ఖండిస్తూ, వాటినిగూర్చి మద్రాసుప్రభుత్వం వారు న్యాయమైన విచారణజరిపి, రైతుల హక్కులను కాపాడవలెనని ప్రభుత్వానికి హెచ్చరిస్తూ, తీర్మానం గావించిరి.

★ ★ ★

వాసిలి, ఆత్మకూరు.

వాసిలి గ్రామరైతు సంఘ యాజమాన్యమున మార్చి 25 వ తేదీని జరిగిన బహిరంగ సభకు కామ్రేడ్ జి. సి. కొండయ్యగారు, ఆత్మకూరులో జరిగిన సభకు అల్లారెడ్డి రమణారెడ్డిగారు, అధ్యక్షత వహించగా, సత్యాగ్రహమొనర్చిన కాళీపట్నం రైతులను అభినందిస్తూ వారిపై జరిపిన పోలీసు దుండగాలను ఖండిస్తూ తీర్మానములు ఏకగ్రీవంగా ఆమోదించబడెను. ఆత్మకూరు సభలో 0-8-9 కాళీపట్నం రైతుల సహాయార్థం వసూలు చేయబడెను.

★ ★ ★

కురుమద్దాలి

కురుమద్దాలి గ్రామరైతు సంఘ యాజమాన్యమున 25-3-39 వ తేదీని సాయంత్రం 4 గంటలకు త్రివర్ణపతాకాలతోను, ఎర్రజండాలతోను ఊరేగిన తరువాత 5 గంటలకు శ్రీ కోసరాజు వీరభద్రుడుగారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగెను. శ్రీయుత గుళ్ళపల్లి రామబ్రహ్మంగారు కాళీపట్టణ రైతుల సత్యాగ్రహ పోరాటాన్ని గురించి ఆసందర్భంలో ప్రభుత్వోద్యోగులు అవలంబించిన క్రూర చర్యలను గురించి, ఉపన్యసించాక సత్యాగ్రహ మొనరించిన రైతులను అభినందిస్తూ, పోలీసు ఉద్యోగస్థుల అమానుషచర్యలను ఖండిస్తూ తీర్మానములు ఏకగ్రీవంగా ఆమోదించబడెను.

★ ★ ★

పాములపాడు.

పాములపాడు గ్రామ సోషలిస్టుపార్టీ యాజమాన్యమున మార్చి 25 వ తేదీని జరిగిన బహిరంగసభకు యలమంచిలి బసవయ్యగారు అధ్యక్షత వహించగా, ప్రభుత్వంవారు కాళీపట్టణ రైతుల అనాదిసిద్ధమైన హక్కులను కాపాడవలసిందనీ, దౌర్జన్యాలకు గడంగిన పోలీసు అధికారులపై కఠినమైన చర్యతీసుకొనవలెననీ కోరుచూ తీర్మానించబడెను.

★ ★ ★

జిన్నూరు.

జన్నూరు గ్రామ మహిళా సంఘము 25-3-39 వ తేదీని మధ్యాహ్నం 10 గంటలకు భూపతిరాజు వెంకమ్మగారి యింట్లో ఉద్దరాజు బంగారమ్మగారి అధ్యక్షతక్రింద సమావేశమై, కాళీపట్నం రైతుల సత్యాగ్రహ పోరాటాన్ని గురించి విపులముగా ఉపన్యాసాలు గావించబడిన తరువాత రైతుల పోరాటము యెడల సానుభూతిని ప్రకటిస్తూ వారి హక్కులను స్థిరపరచవలసిందిగా మద్రాసు మంత్రివర్గాన్ని కోరుచూ తీర్మానించబడెను.

★ ★ ★

నవుడూరు.

నవుడూరు గ్రామకాంగ్రెసు కమిటీ యాజమాన్యమున శ్రీ భమిడిపాటి పాపారావుగారి అధ్యక్షత క్రింద 25 వ తేదీని జరిగిన బహిరంగసభలో కాళీపట్నపు విషాదగాథను గురించి ఉపన్యాసములు గావించబడిన పిమ్మట శాంతముతోను, ధైర్యముతోను తమ హక్కులకై పోరాడుచున్న కాళీపట్నం రైతులను అభినందిస్తూ, గ్రామస్థులపై అనేక అత్యాచారములు గావించిన పోలీసు ఉద్యోగస్థులపై తగిన చర్య తీసుకొనవలసిందని కాంగ్రెసు ప్రభుత్వాన్ని కోరుచూ తీర్మానించబడెను.

★ ★ ★

ఇతర గ్రామాలు.

బ్రాహ్మణగూడెం (కొవ్వూరు తాలూకా) లో గ్రామరైతు సంఘయాజమాన్యమున శ్రీ అల్లూరి అమ్మిరాజుగారి అధ్యక్షత క్రిందను; కలవలపల్లి (కొవ్వూరు తాలూకా) లో గ్రామరైతు సంఘయాజమాన్యమున, ఉప్పటూరి వెంకన్నగారి అధ్యక్షత క్రిందను; నాగాయితిప్పలో యువజనసంఘ యాజమాన్యమున కామ్రేడ్ ప్రసాద్‌గారి అధ్యక్షతక్రిందను; కాటూరులో గ్రామకాంగ్రెస్ సోషలిస్టుపార్టీ, రైతుసంఘముల యాజమాన్యమున కామ్రేడ్ కడియాల గోపాలరావుగారి అధ్యక్షత క్రిందను; కాజేనిపాడు గ్రామకాంగ్రెసు కమిటీ తరపున ఆడబాల రామారావుగారి అధ్యక్షత క్రిందను; కొడమంచిలి గ్రామంలో నెక్కంటి సత్యనారాయణ మూర్తిగారి అధ్యక్షతక్రిందను; కారకంబాడు (చంద్రగిరితాలూకా) గ్రామంలో కామ్రేడ్ చంగయ్యగారి అధ్యక్షతక్రిందను; కోరుకొల్లు గ్రామ కాంగ్రెసు కమిటీ యాజమాన్యమున గాదిరాజు వెంకటసోమరాజుగారి అధ్యక్షత క్రిందను; పెద్దాపురం (నందిగామ తాలూకా) గ్రామరైతు సంఘ యాజమాన్యాన కోటేరు ముత్తారెడ్డిగారి అధ్యక్షతక్రిందను జరిగిన బహిరంగసభలలో కూడా కాళీపట్నం రైతుల యెడ సానుభూతిని ప్రకటిస్తూ, పోలీసు దౌర్జన్యాలను ఖండిస్తూ తీర్మానములు ఏకగ్రీవంగా ఆమోదించ బడ్డాయి.

రైతులోకం

మొఖాసాదార్ల, భూస్వాముల దౌర్జన్యాలు

సుమారు ఏడెనిమిది నెలలనుంచి పోలసాని పల్లె (నూజివీడు తాలూకా) మొఖాసాదార్లకు - రైతులకు మధ్య జరుగుతూన్న తగాదాలలో రైతులవద్దకు కూలీలు రాకుండా చేయడానికి మొఖాసాదార్లు అనేక దుష్టమార్గాలు తొక్కుతున్నారు. నలుగురు మాదిగలు మాత్రం సాహసించి రైతులవద్ద పాలేర్లుగా చేరారు. వారిని ఎంత బెదరించినా, కులకట్టుబాట్లు ప్రకారం వారిని సాంఘికంగా బహిష్కరింప చేసినప్పటికీ, ఆమాదిగలు వినలేదు. మొఖాసాదార్లు వీరి పట్టుదలను అణచడానికి, వారి యిండ్లు దోచుకొనమని మిగిలినవారిని ప్రోత్సహించారు. ఒక దొంగ ఒకనాటి రాత్రి పాలేళ్ల యిళ్లలో దొరపడగా, వానిని పట్టుకొని కట్టివేసి, రిపోర్టు చేయడానికి కరణంగారి యింటి వద్దకు వెళ్లారు. కాని, కరణంగారిని మొఖాసాదార్లు యిదివరకే స్వాధీన పరచుకోవడంవల్ల. రిపోర్టు తీసుకోలేదు. మాదిగలు గత్యంతరం లేక దొంగను వదలివేశారు. వెంటనే దొంగ చేత తనను అన్యాయముగా వీదిలో పట్టుకొని కట్టివేసి, కొట్టి హింసించారని పాలేర్లమీద కేసు దాఖలుచేసేటట్లు మొఖాసాదార్లు ప్రోత్సహించారు. మీరు రైతులవద్ద పనిచేయడం మానుకొంటే మీమీద ఉన్న కేసు ఎత్తివేయిస్తామనీ, లేకపోతే శిక్షలు వేయిస్తామనీ, బెదరించి భయపెట్టుతున్నారు. కేసు యింకా జరుగుతోంది.

ఈ విధంగా రైతులవద్దకు కూలీలను రానీయక అనేక యిబ్బందులు పెట్టి నష్టం కలిగిస్తున్నందున, యిచ్చిన శిస్తుకు రసీదు లివ్వకపోవడంవల్ల, మొఖాసాదార్లకు రావలసిన శిస్తు మొత్తాలను ఈ యేడు రైతులు చెల్లించ నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది.

* * *

వెదళ్లచెర్వు గ్రామభూస్వాముల దుండగాలు

రేణిగుంట సమీపములో ఉన్న వెదళ్లచెర్వు గ్రామంలో హరిజన కూలీలకు—భూస్వాములకు మధ్య సుమారు 9 మాసాల నుంచి తగాదా జరుగుతోంది. హరిజనుల కష్టాలు మితిమీరుతున్నాయి. అంగళ్ళలో వారికి ఎట్టి సామానులు యివ్వకూడదని వ్యాపారస్థులమీద ఒత్తిడి తీసుకొచ్చారు. దీన్ని అతిక్రమిస్తే 5 రూపాయలు జుల్మానా విధిస్తున్నారు. హరిజనుల బావిలో భూస్వాములందరు దొమ్మీగాపోయి మోట కట్టారు. అయ్యా, మాకు త్రాగుటకే నీరులేక పైర్లకు సహితం నీరు చాలక ఎండిపోతుంటే, మీకు హక్కులేని యీ దౌర్జన్యం మానుడని ఎన్నిసార్లు చెప్పినా వినకపోతే, మోట విప్పివేశారు. చిరకాలంనుంచీ వంశ పారంపర్యంగా హరిజనుల అనుభవంలో ఉన్న తోటి బందిలీ, పేరుకట్టు మాన్యాలు వదలుకోమని నిర్బంధం చేస్తున్నారు. హరిజను లీ కష్టాలు పడలేక చంద్రగిరి కలెక్టరుగారికి రిజిష్టరు మూలంగా ఒక అర్జీ పెట్టుకున్నారు. తరువాత 17 మైళ్ళదూరంలో ఉన్న చంద్రగిరికి వెళ్ళి స్వయంగా కలెక్టరుగారితో మొరపెట్టుకున్నారు. మార్చి 20 వ తేదీని ఒక పోలీసు కానిస్టేబిల్ వచ్చి, తిరుపతి సర్కిల్ ఇనస్పెక్టరుగారు రమ్మన్నారని కబురు చెప్పితే గ్రామంలో ఉన్న హరిజనులు యావన్మందీ వెళ్ళి చాలాసేపు కూర్చున్నారు. కాని, భూస్వాములు రాలేదు. కాబట్టి తిరిగిఎవరియిళ్ళకు వాళ్ళు వెళ్ళిపొమ్మని ఇనస్పెక్టరు వీరి నందర్నీ పంపివేశాడు. మర్నాడు ఆ కానిస్టేబిల్‌వచ్చి, సర్కిల్ ఇనస్పెక్టరుగారు వస్తారు కాబట్టి ఎక్కడికి వెళ్ళవద్దని చెప్పాడు కాని, సర్కిల్ ఇనస్పెక్టరుగారు రాలేదు. 19, 20 తేదీలలో కొద్దిగా వర్షం కురిసినందున 23 వ తేదీని హరిజనులు తమ మాన్యాలలో మదకలు కట్టుకున్నారు. వెంటనే భూస్వాములు, యితర గ్రామస్థులు సుమారు 100 మంది దొమ్మీవచ్చి మదకలు విప్పివేశారు.

ఈ విధంగా పెదళ్ళచెర్వు భూస్వాములు చేస్తూన్న అక్రమాలను అరికట్టడానికి ప్రభుత్వోద్యోగులు ఎట్టిచర్య తీసుకొన రెందుచేతనో? భూస్వాములు హరిజనుల్ని దౌర్జన్యానికి చెప్పగొట్టేవరకూ చూస్తూకూర్చొని, అప్పుడు హరిజనుల్ని దొమ్మీకేసుల్లో యరికించరుగదా!

* * *

చల్లపల్లి ఎస్టేటులో ఉద్యోగస్థుల దౌర్జన్యాలు.

గాజుల్లంక గ్రామంలో బావిరెడ్డి నరసయ్య అనే రైతు చల్లపల్లి ఎస్టేటువారికి కొద్దిగా బాకీ ఉండగా, నాలుగురోజుల్లో తప్పక యిచ్చివేస్తానని సముద్దారుగారిని ప్రార్థించాడు. కాని సముద్దారుగారు నిరాకరించి, మరునాడు అనగా 27-3-39 వ తేదీని మధ్యాహ్నం 2 గంటలకు 60 మంది చింతర్లంక మాదిగవాళ్ళను తప్ప త్రాగించి, కర్రలిచ్చి తీసుకువచ్చాడు. నరసయ్య తన మొక్కజొన్న చేను కోసుకొని, ప్రోగు వేసు కొంటూంటే మాదిగలు బలవంతంగా తీసుకొనిపోవప్రయత్నించారు. కాని, నరసయ్య అతని భాగస్థులు తీసుకొని వెళ్ళనీయక అడ్డగించారు.

ఈ దృశ్యాన్ని చూడ్డానికి వచ్చిన గ్రామస్థులను చూచి మాదిగలు పారిపోయారు. వారిలో నలుగురిని గ్రామస్థులు పట్టుకొని, వారు-యితరులు తీసుకొనివచ్చిన కర్రలతోసహా చింతర్లంక వెళ్ళి, గ్రామ మునసబుగారిద్వారా చల్లపల్లి పోలీసు స్టేషనులో రిపోర్టు యిచ్చారు జమీందారుగారి మొక్కజొన్న చేనును రైతులు పీకుతోంటే, అడ్డువచ్చిన జమీందారుగారి నౌకర్లను కొట్టించారని సముద్దారుగారు తప్పుడు రిపోర్టు యిచ్చారు.

* * *

తేలప్రోలు ఎస్టేటు ఉద్యోగుల అక్రమాలు

తేలప్రోలు ఎస్టేటులో సింహాద్రిపురం కాపురస్థుడైన తోట వీరప్ప అనే గొల్లవానిని, ఇంకా యితర గ్రామస్థుల్నీ, ఎస్టేటు సముద్దారు, మేనేజరు అనేకరీతుల హింసిస్తున్నారు. అనేక నేరాలు మోపి, మేకల మందలను దొడ్లో పెడతామని నిర్బంధించి, జరిమానాలరూపంగా డబ్బువసూలు చేస్తున్నారు. అడవి పందిని కొట్టినాడనే అసత్య నేరాన్ని మోపి, తోట వీరప్పవద్ద 9 రూపాయలు జరిమానాగావసూలు చేయడమేగాక, యీత బెత్తాలతో కొట్టి హింసించారు. పదిరోజుల క్రింతం తిరిగి మరొక అడవి పందిని కొట్టినాడని మళ్లీ నేరంమోపి, యీతని చేనుతాలూకు కంచెను తగుల పెట్టించారు.

* * *

ఆత్మకూరు తాలూకాలో రైతుప్రచారం

ఆత్మకూరు తాల్యూకా (నెల్లూరుజిల్లా) లో కామ్రేడ్స్ జి.సి. కొండయ్య, గంగా కొండయ్య గారల నిరంతరకృషివల్ల వాసిలి గ్రామరైతుల మీద విధించ బడిన అపరాధపు పన్నులు పూర్తిగా రద్దుచేయ బడ్డాయి. ఈ నెల 1 వ తేదీని అనేకమంది తాలూకా రైతులు జమాబందీ ఆఫీసరు వద్దకు రాయబారం వెళ్లవలసియుండి, వాసిలి వగైరా గ్రామాలలో యీ అపరాధపుపన్ను రద్దుజేయబడిందను వార్త వినగానే రాయబార ప్రయత్నాలు నిలిపి వేయబడ్డాయి. ఈ విషయం, కాళీపట్నం రైతుల సత్యాగ్రహ పోరాటం, మొదలైన అంశాలను గురించి ప్రచారం చేయడానికి కామ్రేడ్ జి. సి. కొండయ్య, గంగా కొండయ్య, బీరం రామనాథం, గారలు మార్చి 26 మొదలు 31 వరకు వాసిలి, ఆత్మకూరు, కుప్పురుపాడు, చిరమన, పెరమన, కొండూరు మొదలైన గ్రామాలలో బహిరంగ సభలు జరిపి, కాళీపట్నం రైతుల సత్యాగ్రహ పోరాటాన్ని కొనియాడుతూ తీర్మానము లంగీకరింప జేశారు.

* * *

గ్రామ మునసబు దుష్ప్రవర్తన

చింతలపూడి తాలూకా, కనుపడి గ్రామ మునసబు రైతులను మామూళ్ళ నివ్వమని బాధిస్తున్నాడు. అరవ 1కి 2-0-0 గాని, లేక వరి గడ్డిగాని, కంద - దేమగాని యివ్వమనీ; అట్లు యివ్వకపోతే వ్యవసాయానికి కావలసిన నాగలి, కాడి, మేడికర్ర వగైరాలకు రిజర్వు అడవికి వెళ్ళకుండా ఆటంక పరుస్తున్నాడు. కాంగ్రెసుమంత్రివర్గం యేర్పడినా, గ్రామోద్యోగులలో లంచగొండి తనం నిర్మూలించ బడనందున రైతులు చాలా విచారిస్తున్నారు.

* * *

చతుర్థ కృష్ణాజిల్లా రైతుమహాసభ

కాజ (దివి తాలూకాలో)

ఏప్రియల్ నెల 15, 16 తేదీలు

దివితాలూకా కాజగ్రామములో ఏప్రియల్ నెల 15, 16 తేదీలలో చతుర్థ కృష్ణాజిల్లా రైతుమహాసభ జరుగును. మహాసభాధ్యక్షులు ఉత్తర విశాఖపట్నంజిల్లా రైతు సంఘాధ్యక్షులు శ్రీ పుల్లెల శ్యామసుందరరావు యం. యల్., ఏ. గారు. సభాప్రారంభకులు ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాధ్యక్షులు శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తిగారు, మహాసభకు తీర్మానములు పంపువారు ది 12-4-39 తేదీలోగా జిల్లా సంఘ కార్యాలయమునకు పంపప్రార్థితులు.

బెజవాడ, 3—4—39. } కామినేని వెంకటప్పయ్య, అధ్యక్షులు. కృష్ణాజిల్లా రైతుసంఘం.

కాళీపట్టణం స్త్రీ ఖైదీలను కొట్టుట

కాళీపట్టణం సత్యాగ్రహంలో శిక్షింపబడిన 28 గురు స్త్రీలు వెల్లూరులో నున్నారు.

నేను 29 వ తేదీని వెల్లూరు జైలులోనున్న కాళీపట్టణం స్త్రీ ఖైదీలతో ఇంటర్వ్యూపెట్టి బొడ్డు గంగమ్మ వగయిరా 6 గురితో మాట్లాడినాను. వారిని నిత్యము కొట్టుచున్నారనియు, అకారణముగా కొట్టుచున్నారనియు, వళలు అంతా పచ్చిపుండుగానున్నదనియు. కండ్లవెంట నీరుకార్చుచు గద్గదస్వరముతో నాతో మొరపెట్టినారు. వివరములు తెలుసుకొనుటకు జైలు అధికారులు నాకు అవకాశము ఈయలేదు. జైలువిషయములు మాట్లాడరాదనియు ఇంటివిషయములు, అప్పీలు విషయములు మాత్రమే మాట్లాడవచ్చుననియు, అడ్డుపెట్టినారు. కాళీపట్టణము ఖైదీలలో ఒకస్త్రీకి గడ్డముపై బలమైన గయముతగిలి రక్తప్రవాహ మైనదనిన్ని అమె స్పృహతప్పి మాటలేకుండా పడిపోయినదని ప్రస్తుతము హాస్పిటలులో నున్నదని వారు నాతో చెప్పినారు. దేనివల్ల అంతదెబ్బ తగిలినదో నాతో చెప్పనీయలేదు. మరునటిదినము విడుదలైన ఒక స్త్రీని దెబ్బతగిలిన స్త్రీ స్థితిని గురించి అడుగగా గడ్డము పెద్దగావాచి ఆహారం లేకుండా హాస్పటలులో పడియున్నదని అమె చెప్పింది. ఈ విషయమును వెంటనే దండు నారాయణరాజుగారు యం. యల్. ఏ. గారికి తెలియ జేసితిని. నారాయణరాజు, నారాయణరావు గార్లు సుబ్బరాయను మంత్రిగారికి యావత్తుచెప్పిన మీదట విచారణ జరిగించి తగు చర్య జరిగించవలసినదిగా కోరిన మీదట మంత్రిగారు డిపార్టుమెంటుద్వారా విచారణ జరిగించుచున్నట్లు తెలియుచున్నది. జైళ్లలో అమాయికపు స్త్రీలపై ఇట్టి అత్యాచారములు, దారుణహింస నేడు రాష్ట్రములో కాంగ్రెసు మంత్రివర్గము ఉండగా జరగడం, చాలా అవమానకరము. అమానుం చర్యలకు అలవాటు పడియున్న జైలు డిపార్టుమెంటులో కించిన్మాత్రము మార్పు లేకపోగా క్రూరత్వము పెచ్చుపెరుగుతోందని దీనివలన తెలియగలదు. డిపార్టుమెంటుద్వారా ఇంక్వైరీ చేసినచో ప్రయోజనము ఎంతమాత్రము ఉండజాలదనియు, నాన్ ఆఫీషియల్ ఇంక్వైరీ వెంటనే చేయించి చర్యతీసుకొనిన తప్ప ప్రయోజనము ఉండ దనియు, మంత్రిగారికి విన్నవించుచున్నాను.

మద్రాసు, 2—4—39. } ఉద్దరాజు రాము, సర్పవరంతాలూకా కాంగ్రెస్ సంఘాధ్యక్షుడు.

పశ్చిమ గోదావరిజిల్లా వ్యవసాయకూలీ మహాసభ

28-3-39 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఖైకరంలో కుసుమ ధర్మన్న కవిగారి అధ్యక్షత క్రింద పశ్చిమ గోదావరిజిల్లా వ్యవసాయ కూలీ మహాసభ జయప్రదంగా జరిగెను.

కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణగారు జాతీయ-ఎర్ర జండాలను ఎగురవేస్తూ రెండు జండాలయొక్క ప్రాముఖ్యతను గూర్చి ఉపన్యసించారు. భారతదేశ ప్రజలందరి తరపున జాతీయ కాంగ్రెసు బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదుర్కొనడానికి సాగిస్తూన్న పోరాటంలో జాతీయ పతాకం యొక్క గౌరవాన్ని కాపాడ్డానికి లక్షలాది ప్రజలు ఏవిధంగా త్యాగాలు చేసారో వివరిస్తూ యిక ముందుకూడా యీ పతాకంక్రింద నిలబడి స్వరాజ్య పోరాటంలో పాల్గొనవలసిన ఆవసరాన్ని తెలియజెప్పారు. యెర్రజెండా విషయం తెలియజేస్తూ, ఒక్క భారత స్వాతంత్ర్యమునేగాక ప్రపంచ కార్మిక—కర్షకుల దాసత్వాన్ని శాశ్వతంగా నిర్మూలించి, వారి ప్రభుత్వాన్ని నెలకొల్పి ప్రపంచానికి శాంతి సౌఖ్యలను యిచ్చే జండా ఎర్రజండాయే అని వివరించారు.

ప్రారంభోపన్యాసం

తరువాత, సభాప్రారంభకులైన కామ్రేడ్ మద్దూరి అన్నపూర్ణయ్యగారు యీ క్రింది విధంగా ఉపన్యసించారు :

పూర్వకాలంలో బానిసవృత్తి బాహాటంగా సాగేది. పశువులను ఒక కామందు మరొక కామందుకు అమ్మివేయునట్లు మనుష్యలను కూడా అమ్మివేసి, శాశ్వత సేవకావృత్తికి పాల్గొనేవారు. అది రాక్షసపద్ధతి అని అన్ని దేశాలలోను ఘోష బయల్దేరింది. అనేక మంది మహాపురుషులు యీ పద్ధతిని ఐక్యకంఠంతో నిరసించారు. కొంతకాలానికి బానిసవృత్తి నిర్మూలించ బడింది. కాని, అది మారురూపాలతో నేడు ప్రపంచమంతటా తనపైశాచికత్వాన్ని సాగిస్తూనే ఉంది. మనదేశపు వ్యవసాయకూలీలస్థితిని చూచినప్పుడు పూర్వపు బానిసవృత్తియే మేలురా అనిపిస్తుంది. ఎందువల్లనంటే, వందలు - వేలు యిచ్చి బానిసలను ఒకరాజు మరొకరాజువద్ద కొంటాడు; వారికి సరియైన దేహదారుఢ్యం ఉంటేగాని చిరకాలం సేవచేయడానికి వీలుండదు. కాబట్టి బానిసకు తగిన తిండి గుడ్డ యివ్వవలసివచ్చేది. కాని నేటి కూలీని అట్టి బాధ్యతతో చూడవలసిన అవసరంలేదు! ఎవడు తక్కువ కూలికివస్తే వానిచేతనే పనిచేయించుకుంటారు. ఆవేళకు ఆ అణాడబ్బులూ పారెయ్యడమేగాని, మర్నాడు కూడా వచ్చి పనిచేయగల దారుఢ్యం వానికి ఉందా, లేదా అని విచారించే వాడులేడు.

కాని, యిట్టి కూలివాడే నేటిసమాజ సౌధానికి పునాదిరాయి. ఆరాయి కొంచెం కదలిందా దివ్యసౌధం కనురెప్పపాటుకాలంలో నేలకూలుతుంది. సౌధాన్నిచూచి ఆనందభైరవి రాగాన్ని ఆలాపించే కవికుమారుడు ముఖారి రాగంలోకి దిగవలసివస్తుంది.

కరాచీ ప్రాథమిక హక్కుల తీర్మానం, కాంగ్రెసు ఎన్నికల ప్రణాళిక, కూలీలలో కాస్త ఆశాజ్యోతిని వెలిగించాయి. ఎనిమిది రాష్ట్రాలలో కాంగ్రెసు గద్దె ఎక్కింది. కార్మికుల కష్టాలు కొంతవరకైనా తొలగిపోతాయని ఆశించారు. కాని, కార్మిక శాసనం నేటివరకు ఒక్కటైనా చేయలేదు. ఋణనివారణ చట్టమొకటి రాజాజీ ప్రసాదించాడు. దానికి "వ్యవసాయకుల" ఋణనివారణ చట్టం అని పేరు పెట్టాడు. భూమిని అమ్ముకొనే హక్కుగలవాడే "వ్యవసాయకుడు" పొమ్మన్నాడు. ఏమి విపరీతమైన నిర్వచనం! వ్యవసాయ వృత్తినే నమ్ముకొని జీవించు భూమిలేని అసంఖ్యాకులైన కూలీలకు రాజాజీ సున్నచుట్టేడు. వేరే శాసనం తెస్తాం అన్నారు కూలీల అప్పులు తగ్గడానికి. కాని యింతవరకూ దాని సూచన కనపడ్డంలేదు.

కూలీల జనసంఖ్య ఏటేట 50 లక్షల చొప్పున పెరుగుతోంది. కూలి పనిలో పోటీ యెక్కువౌతోంది అందుచే కూలిరేటు విపరీతముగా పడిపోతోంది. కూలి పడిపోతే అప్పులు పెరుగుతాయి. అప్పులు పెరిగితే, వెట్టిచాకిరి ఎక్కువౌతుంది. ఈ గుడుగుడు కుంచంలోపడి కొట్టుకొంటున్నాడు, కూలీ.

రైతు - కూలీ సమస్య.

కార్మిక-కర్షక సమ్మేళనం కావాలని సోషలిస్టులు ఎలుగెత్తిచాటుతున్నారు. నేడు రైతు - కూలీ లిద్దరూ అజ్ఞానాంధకారంలో మునిగియున్నారు. కూలీలకు ఎక్కువ కూలినిచ్చుటయే తన దరిద్రానికి కారణం అని రైతు తలచుట పొరబాటు. పన్నుభారం ఋణభారం లంచాల బాధ, వీటిచేతనే నేడు రైతుకూలి పోతున్నాడు. ఈ మూడింటికీ కారకులు సామ్రాజ్యవాది, జమీందారు, షాహుకారు. వీరి నిరంకుశత్వాన్ని నిర్మూలించలేక రైతు మొగునిపై కోపం వచ్చి బిడ్డలను కొట్టిన పెళ్లామువలె, కూలీలమీద విరుచుకుపడుతున్నారు. ఇది ఎంతమాత్రము తగదు. రైతు-కూలీల సమస్యాపరిష్కారానికి గత జూన్ నెలలో ఆంధ్ర సోషలిస్టుపార్టీవారు గావించిన సూచనలు చాలా ముఖ్యమైనవి. రైతులు—కూలీలు అనే రెండు సామ్రాజ్య వ్యతిరేక శక్తులు గుద్దులాడుకొంటూంటే షాహుకారులు, జమీందారులు, సామ్రాజ్యవాదులు ఏ విధంగా విజృంభిస్తారో ప్రచారకులు గ్రామ-గ్రామాన ప్రబోధించాలి.

కార్మిక కర్షక రాజ్యం రావాలంటే, మొదట పరాధీనత నశించాలి. అందుకై కాంగ్రెసు కృషిచేస్తోంది కనుక కూలీలందరు కాంగ్రెసులోచేరి, దాన్ని బలపరచాలి. కాంగ్రెసు ప్రభుత్వంకూడా కూలీలయీక్రింది కనీసపుకోర్కెలను నెరవేరుస్తూ త్వరలో శాసనాలు చేయాలి.

1. కూలీల అప్పులను రద్దుచేయుట.
2. వెట్టిచాకిరి నిషేధించబడుట.
3. అడవులలో కర్ర, కంప ఉచితంగా తెచ్చుకొనే హక్కు.
4. కనీసపు కూలిని నిర్ణయించుట.
5. పిచ్చముంతలను శిథిర్వము చేయుట.

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ తీర్మానాలు

మార్చి ఆఖరువారంలో బెజవాడలో సమావేశమైన ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ సాధారణ సభ శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారి అధ్యక్షత క్రింద సమావేశమై, యీ క్రింది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది.

త్రిపురి

త్రిపురీ కాంగ్రెసు మహాసభలో పంతు తీర్మానంపై అ. భా. కాం. సోషలిస్టుపార్టీ వారవలంబించిన తటస్థవైఖరికి అసమ్మతిని తెలియపరుస్తూ తీర్మానించబడెను.

కాశీపట్టణం

కాళీపట్నంలో రైతులు తమ అనాదిహక్కులను రక్షించుకొనుటకు జరిపిన సత్యాగ్రహ పోరాటాన్ని కొనియాడుచూ; ఆసందర్భంలో అనేక అమానుషచర్యలకు బాధ్యులైన పోలీసు ఉద్యోగస్థులపై రాష్ట్ర మంత్రివర్గం వెంటనే తగినచర్య గైకొనవలెననీ; అరెస్టుకాబడ్డ వారినందరినీ వెంటనే విడుదల చేయవలసిందనీ; రైతులు తమ అనాదిహక్కులను అనుభవించేలాగు ప్రభుత్వం తగిన యేర్పాటులు వెంటనే గావించవలసిందనీ; ఒకవేళ రైతులకు అన్యాయం కలుగుస్థితి యేర్పడే యెడల తిరిగి సత్యాగ్రహ పోరాటం ప్రారంభించవలసి యుంటుందనీ—తీర్మానించబడెను.

మునగాల

మునగాల ఎస్టేటులో రైతులకు—జమీందారుకు మధ్య యేర్పడిన పోరాటంలో రైతుల కొరకు ఆం. రా. రైతు సంఘం తరపున పని చేస్తూన్న కామ్రేడ్ నండూరి ప్రసాదరావు వగైరాలను అభినందిస్తూ, యికముందు పరిస్థితులననుసరించి తగుచర్య గైకొనుటకు కార్యసంఘంవారికి అధికారం యివ్వడమైనది.

టి. చదుము గ్రామంలో కూలీ రైతులు భూస్వాములపై ఆదర్శప్రాయమైన పోరాటాన్ని సాగించి, చివరకు జయముగాంచినందుకు వారి నభినందిస్తూ, తమ భూములను కూలీలకు యిచ్చి సహకార సంఘముద్వారా వ్యవసాయం చేసుకొనుటకు పూనుకొని, అఖిలభారతదేశములో మార్గదర్శకత్వం వహించిన చదుము రైతులను ప్రశంసిస్తూ తీర్మానించబడెను.

వాలంటీరు దళాలు.

రాబోయే స్వాతంత్ర్య పోరాటంలో రైతు వాలంటీరుదళాలు అవసరం కాబట్టి ప్రతిజిల్లాలో అట్టి శిక్షణ గరపుటకు రైతాంగవాలంటీర్ శిబిరాలను స్థాపించవలసినదిగా జిల్లా సంఘాలను కోరడమైనది.

పశ్చిమ కృష్ణా కాంగ్రెసు

పైసంఘాధ్యక్షులైన పేటబాపయ్య, కార్యదర్శి కాకాని వెంకటరత్నం, గారలపై డిసిప్లినరీ చర్యలు, 35000 మంది కాంగ్రెసు సభ్యుల హక్కును రద్దుపరచుట - మొదలైన విషయాలలో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్‌కమిటీ వారవలంబించిన వైఖరికి తీవ్రమైన అసంతృప్తిని తెలియజేస్తూ, వారి వెనుకటి ఉత్తరువులను రద్దు చేసుకోవలసినదిగా కోరుచూ తీర్మానించబడెను.

ల్యాండ్ రివెన్యూ బిల్లు

ప్రకాశం కమిటీనివేదిక ప్రకటించబడిన తరువాత చీమలపాడు, చల్లపల్లి, గంపలగూడెం, ముక్త్యాల వగైరా ఎస్టేట్లలో జమీందార్లు అడవులు ఛేదించడం, సాముదాయిక భూములు అమ్మడం, దొంకలు - పుంతలు అక్రమించడం మొదలైన అక్రమచర్యలకు దిగుచున్నారుగాన అట్టిచర్యలు యిక ముందు జరుగకుండగను. రైతులకు సంక్రమించే హక్కులు త్వరలో అమలులోనికి వచ్చేలాగునను, ఎస్టేట్ ల్యాండ్ రివెన్యూబిల్లు ఏప్రిల్‌లో ప్రత్యేక శాసనసభాసమావేశంలో ప్రవేశపెట్టవలెనని కాంగ్రెసు మంత్రివర్గాన్ని సభవారు సభవారు కోరుచూ తీర్మానించిరి.

రైత్వారీ పన్నులు

ఈసంవత్సరం బడ్జట్ చర్చసందర్భంలో రివెన్యూమంత్రిగారు రైత్వారీ పన్నుల తగ్గింపును గూర్చియు, హరిజనులకు - పేదప్రజలకు బంజరు భూమిలిచ్చుటను గూర్చియు, చేసిన ప్రకటన మిక్కిలి ఆశాభంగము కలిగించుచున్నది గాన త్వరలో రైత్వారీ పన్నుల విధానాన్ని గురించి ప్రభుత్వానికి లోగడ చేసిన సూచనలను ఆధారంగా తీసుకొని ఒకరెవెన్యూ చట్టమును ప్రవేశపెట్టవలెనని కోరుచూ తీర్మానించబడెను.

పోలీసుల చర్యలు.

రాష్ట్రమంతటా రైతులకు జమీందార్ల మధ్య జరుగుచున్న తగాదాల విషయంలోను పోలీసు ఉద్యోగస్థులు కాంగ్రెసు మంత్రివర్గం అధికారంలో ఉన్నదనే విషయాన్ని మరచి ప్రజలపై గావిస్తూన్న దుండగాలను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం అట్టివారిపై తగినచర్య గైకొనకపోవడమేగాక, పోలీసుల చర్యలను సమర్థిస్తూన్న రాజాజీయొక్క దృక్పథానికి చింతిల్లుచూయిటుపైనైనను అట్టిదుండగాలు జరుగకుండా చూడవలసిందని కోరుచూ సభలో తీర్మానించబడెను

వ్యవసాయకూలీలు.

వ్యవసాయకూలీల కనీసపు కోర్కెలను యీడేర్చుటకు మద్రాసు మంత్రివర్గంవారు వెంటనే శాసనము తయారుచేయవలసినదని హెచ్చరించిరి.

సభ్యత్వరుసుము, వగైరా.

జిల్లా రైతు సంఘాలు చెల్లించవలసిన సభ్యత్వ రుసుము ఏప్రిల్ 10 వ తేదీలోగా చెల్లించుటకు అనుమతి యివ్వబడెను. అట్లు చెల్లించని జిల్లా సంఘములమీద తగుచర్య గైకొనుటకు కార్యవర్గమునకు అధికారము యివ్వబడెను.

అన్ని జిల్లా, తాలూకా రైతు సంఘ ఎన్నికలకు ఏప్రిల్ 20 వ తేదీలోగా ఆయా జిల్లా సంఘముల ఏర్పాట్లనుబట్టి అభ్యర్థి దరఖాస్తులను తీసుకోవలెననియు, దరఖాస్తులు తీసుకొన్న పిమ్మట, వారం రోజులకు తక్కువగాని వ్యవధితో ఏప్రిల్ 30 వ తేదీలోగా అన్నిచోట్ల ఎన్నికలు జరిపి, సంఘాధికార్ల పేర్లను చిరునామాలతోసహా రాష్ట్రసంఘానికి మే 1 వ తేదీలోగా తెలియజేయవలెనని తీర్మానించబడెను.

ఛాంబర్లేన్ ప్రభుత్వం పోసిందే

రష్యాపైకి జర్మనీని త్రిప్ప

ఛాంబర్లేను ప్రకటన

జర్మనీ మెమెలును ఆక్రమించిన పిదప, పోలెండువైపు తన దృష్టిని మరల్చింది. డాన్జిగ్ ను తన కివ్వవలెనన్నది. పోలిషు కారిడరుగుండా (జర్మనీకి, తూర్పు ప్రష్యాకు మధ్యనున్న పోలండుయొక్క కొద్ది భూభాగముకో) జర్మనీ ఒక ప్రత్యేక రైల్వేమార్గాన్ని నిర్మించ దానికి హక్కు ఇమ్మనినది. కమ్యూనిస్టు వ్యతిరేక సంపుటంలో చేరవలయునని కోరింది. అంతే పోలెండుయొక్క విదేశాంగనీతి జర్మనీ విదేశాంగనీతి ననుసరించి ఉండాలని కోరింది. తన సైన్యాన్ని ప్రోగుచేసుకొన సాగింది. పోలెండు ఈ కోర్కెలకు, మిలిటరీ బెదరింపు చూపుచున్నందున వెంటనే జవాబు చెప్పలేదు. దానితో జర్మనీ పత్రికలు, పోలిషు కారిడరులోను, ఉన్న జర్మనులపై అత్యాచారాలు, నిర్బంధాలు జరుపుచున్నారని ప్రచారము ఆరంభించాయి. బెక్ పోలెండు విదేశాంగమంత్రి ఈ పరిస్థితులను గూర్చి మాట్లాడడానికి ఏప్రిల్ మూడవతేదీ లండనుకు వెళ్లారు. జర్మనీ పత్రికలు పోలెండుకు వార్నింగు ఇచ్చాయి. ఇంతవరకు అవలంబిస్తూ వచ్చిన జర్మనీ యెడల సానుభూతితో కూడిన తటస్థవిధానాన్ని పోలెండు మానినట్లయితే పోలెండుయొక్క స్వాతంత్ర్యానికే భంగము కలుగుతుంది. పోలెండుయొక్క భౌగోళిక స్థితి ఎలాంటిదో ఆలోచించుకో మన్నాయి. అంతే పోలెండుకు మూడువైపులా జర్మనీ ఉంది. అందుచే అన్నిమూలల నుండి పోలెండుపై దాడిచేయడానికి జాగ్రత్త అని బెదరించాయి. అంతేగాక పోలండులో వివిధ జాతులున్నారను విషయముకూడ మరచిపోవద్దన్నాయి. అంతే ఈ వివిధజాతులయొక్క స్వయం నిర్ణయాధికారము కోసమని తాము దండెత్తుతామని బెదిరించాయి. జర్మనీకి వ్యతిరేకంగా ఏగ్రూపులోను చేరవని పోలెండు జర్మనీకి తెలియజేసింది. కాని తానుకూడ సైనిక సన్నాహాలు చేయ సాగింది. బెక్, తన ప్రయాణాన్ని మానుకోలేదు సరి.

బ్రిటన్ విదేశనీతి

ఈ పరిస్థితుల్లో గత శనివారం ఛాంబర్లేను పోలెండుకు సహాయము చేయవలెన్ని గూర్చి ఒక ప్రకటన గావించారు. ఈ ప్రకటనలో బ్రిటిషు విదేశాంగనీతిలో క్రొత్త విధానము అవలంబించినట్లు పత్రికలన్నీ ఘోషిస్తున్నాయి. ఈ ప్రకటన గావించిన పిమ్మట కామన్సుసభలో ప్రతిపక్షాలు లేబరుపార్టీ సభ్యులుకూడ, ఈ క్రొత్త విధానాన్ని ఆచరణలో పెట్టడానికి ఛాంబర్లేనే తగినవాడని ప్రశంసించారు. కాని మేము మాత్రము బ్రిటిషు విదేశనీతిలో క్రొత్తమార్పు వచ్చిందని అంగీకరించబోము. బ్రిటిషు ప్రభుత్వము 1931 అగష్టునుండి నేటివరకు అవలంబించుచున్న విధానము పాసిస్టు ప్రభుత్వాలను బలపరుస్తూ, వానిని సోవియటు యూనియనుపై దాడి చేయునట్లు ప్రోత్సహించడము. దీనిఫలితమే మంచూరియాను జపాను ఆక్రమించింది. అబిసీనియాను ఇటలీ ఆక్రమించింది. జర్మనీ, ఆస్ట్రియా, జెకోస్లోవేకియా, మెమెలును ఆక్రమించింది. ఇటలీ జర్మనీలు, స్పెయినులో ఫ్రాంకో సేనలతో తమ సేనల నిచ్చి … స్పెయిను ప్రజాస్వామ్యాన్ని నాశనమొనర్చాయి. జర్మనీ ఇటలీ జపానులు ఇంతవరకు తమకు నిరోధకముగా సన్నాహము కల్పుచున్నను ఇంగ్లండు నేడు ఆకస్మికముగా తన దృక్పథాన్నంతా మార్చుకొన్నదంటే నమ్మడము అసంభవము దానికి కారణ మేమున్నాయి.

బ్రిటను సోవియటు రష్యాపై దండెత్తడానికి జర్మని ప్రయత్నాలు చేసింది. జర్మనీని ఇంతవరకు బలపరచింది. కాని జర్మనీ సోవియటు యూనియనుపై దాడిచేయక, కాలనీలు కావలని ఫ్రాంసు బ్రిటనులపైననే కాలు దువ్వడము వలన ఇకముందైనా జాగ్రత్త పడవలయునని ఇప్పటికి జర్మనీకి వ్యతిరేకంగా నిలబడడానికి కాలము దాటిపోలేదని ఈ క్రొత్త విధానము అవలంబించినది కొందరు వాదించవచ్చును.

ఇదే నిజమయితే కాలనీలు కావాలని మ్యూనిక్ ఒడంబడిక చేసుకొన్న వెనువెంటనే గట్టిగా గొంతెత్తి కోరారు హిట్లరు. అప్పటి నుండియే బ్రిటను జాగ్రత్త పడవలసింది. 1939 జనవరి 30 వ తారీఖున హిట్లరు ఇచ్చిన ఉపన్యాసమును బట్టి ప్రపంచమంతా, హిట్లరు సోవియటు యూక్రెయినుపై దాడి మానుకొని ఫ్రాంసు బ్రిటనులవైపు మరలాడని అందరూ అనుకొన్నారు. కనీసము అప్పటినుండియైనా బ్రిటను తన పూర్వపు మార్గాన్ని వదిలివేసి యుండవలసినది అది అలా చేయలేదు.

బోధియను ప్రచురుచెప్పినట్లు జర్మనీ జెకోస్లోవేకియాను పూర్తిగా ఆక్రమించడమువల్ల గతసంవత్సరమంతా బ్రిటను, అమెరికాలకంటే ఉత్పత్తి చేసిన సైనిక పరికరాలకంటె విమానాలకంటె ఎక్కువ పరికరాలను, విమానాలను జర్మనికి వచ్చాయి. అందుచే జర్మనీబలమింత ఎక్కువగుటచే జర్మనీని అణచివేయడానికి మిగిలిన ప్రజాతంత్ర దేశములతో కలవక తప్పదేమోనని కొందరు వాదిస్తున్నారు.

కాని, మ్యూనిక్ ఒడంబడికతోనే జెకోస్లోవేకియా స్వాతంత్ర్యము నామమాత్రమని, దాని సైనిక కట్టడాలన్ని జర్మనీ సైన్యములో ఒక భాగమేనని ప్రతి వ్యక్తికి తెలియను. అందుచే జెకోస్లోవేకియాను జర్మనీ కబళించడము బట్టి జర్మనీ సైనికబలములో బ్రిటిషు ప్రభుత్వము క్రొత్త విధానము అవలంబించ వలసినంత మార్పు లేదు. జర్మనీ రష్యాపై యుద్ధము చేయాలన్నా లేక బ్రిటను, ఫ్రాంసులపై దండెత్తాలన్నా, పోలెండు, రుమేనియాలు కూడ పూర్తిగా తన అధీనములో ఉన్నట్లు చేసుకోవాలి. దానికోసం రుమేనియా పోలెండులను బెదరించడానికి వాని సరిహద్దులకు తాను ముట్టడిచేయ సాగింది చుట్టుముట్ట సాగింది.

జర్మనీ జెకోస్లోవేకియాను ఆక్రమించడంలో ప్రధాన కారణము ఇదియే. కేవలము రష్యాపై యుద్ధము చేయడానికే ఐనలో, బ్రిటను, ఫ్రాంసుల సహాయముతో రుమేనియా, పోలెండులను తనకు సహాయము చేయునట్లు హిట్లరు చేసుకోవచ్చునే. కాని, సోవియటులను హిట్లరు కోరినట్టు సోవియటు యూనియనుపై తప్పనిసరిగా దాడి చేయవలసిన అవసరము లేదు. తన ఇష్టమువచ్చినట్లు తనకెక్కువ లాభకారి అయిన మార్గాన, సోవియటు యూనియనుపై గాని, బ్రిటను ఫ్రాంసులపై గాని యుద్ధము ప్రకటించ దానికి కావలసిన స్వతంత్ర పరిస్థితులను కలుగజేసుకోడానికే హిట్లరు ఈ ఎత్తువేశాడు. హిట్లరుయొక్క ఈ ఎత్తును ఎదుర్కోడానికి సోవియటురష్యా, బ్రిటను, ఫ్రాంసులు మిగిలిన చిన్న రాజ్యాలతో కలసి హిట్లరును అరికట్టాలని సోషలిస్టులందరూ, ప్రజాతంత్ర వాదులందరూ ఆశిస్తారు. కాని ఛాంబర్లేను ఆ పద్దతిని అవలంబించడానికిష్టపడకపోవడమునే చెప్పుకోవాలి.

ఎందుకంటే హిట్లరు జెకోస్లోవేకియాను ఆక్రమించడానికి ఒక నెలరోజులముందు ఈ విషయము ఛాంబర్లేనుకు తెలుసు ఫ్రాంసుకు తెలుసు. కెనడా ప్రధానమంత్రి ఈ విషయాలను సూచిస్తూ, బ్రిటనుకు తాము సాయముచేయడానికి తయారనికూడ ప్రకటించారు. ఇట్టి వార్తలు అమెరికా అధ్యక్షుడు రూజువెల్టుకు తెలియబట్టియే నౌకా సైన్యం పూఫాలను తనిఖీచేయడము మాని రాజధానికి తిరిగి రావడానికి ఆలోచించారు. జర్మనీ ఎత్తులు ఛాంబర్లేనుకు బాగా తెలుసు. స్పెయినును ముస్సోలినికి అధీనము చేస్తే అంతే ఫ్రాంకోకు విజయము కలిగితే, జర్మనీ బలము మరింత ఎక్కువగుతుంది. జెకోస్లోవేకియాను తప్పకుండా మింగుతాడని తెలుసు. అయినా ఫ్రాంకో ప్రభుత్వాన్ని గుర్తించారు. నెగ్రిన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, మియాజా, కసాడో తిరుగుబాటును తీసుకువచ్చారు. స్పెయినులో ఫ్రాంకో విజయాన్ని నిస్సందేహ మొనర్చారు.

జర్మనీ—ఇంగ్లండు

అంతేగాదు రుమేనియా, తనకు సాయము చేయునని గోరినను, అట్టి సహాయము వాగ్దానము చేయుటకుందనే. జర్మనీతో తన ఆర్థిక స్వాతంత్ర్యమును అమ్మివేయునట్టి వర్తకపు ఒడంబడికను చేసుకోవలసి వచ్చింది.

జర్మనీ దాడిని వ్యతిరేకించడానికి రష్యాతో మిలిటరీ ఒడంబడిక చేసుకోడానికి ఛాంబర్లేను నిరాకరించింది గతవారము చూచాము. అంతేగాదు ఈ విషయమును గూర్చి ఆలోచించడానికి … కలసి సమావేశము జరుపడానికికూడ నిరాకరించారు.

లార్డుహైలుఫాక్సు, ప్రభువులసభలో ప్రభుత్వము తరపున మాట్లాడుతూ, గతమాసము 29 వ తారీఖున ఈలా ప్రకటించారు. "వివిధ దేశాలు పూర్తిగా కలిసి పనిచేయడానికి, ఒక విశాలమైన మిలిటరీ ఒడంబడికగా రావడానికి తయారైనచోనే, సమావేశములో అర్థముండేది అవసరమనుకూడ ఉంటుంది. అట్టి సమావేశము ప్రస్తుత పరిస్థితులను తగిన శక్తిని (Driving force) ఇవ్వదు" మిలటరీ ఒడంబడిక చేయడానికి కావలసిన సమావేశమునకు ఉన్నారు. కాని అట్టి సమావేశము తగిన శక్తి ఇవ్వజాలదు అంటే, ఇంకా అట్టి శక్తి ఎక్కడనుండి వచ్చేది? నిజానికి బ్రిటను ఫ్రాంసు, పోలెండులు, రష్యాలో జర్మనీదాడిని ఎదుర్కోడానికి మిలటరీ ఒడంబడిక చేసుకోడానికి ఇంకా తయారుకాలేదని హైలుఫాక్సు ప్రకటనవలన తెలుస్తూవుంది. దానిని కప్పిపెట్టడానికి సమావేశము నిరుపయోగమన్నారు.

ఛాంబర్లేను, అంతకు ముందురోజు 28 వ తేదీన ఇతరదేశాలతో సంప్రదింపులు జరుపుతున్నాడని ఒక ప్రశ్నకు జవాబు చెప్తూ, జర్మనీకి వ్యతిరేకంగా ఏమైన ఆర్థిక ఆంక్షలు వెంటనే ఆరంభిస్తారా అంటే చేయమన్నారు. 29 వ తేదీన తన సంప్రదింపులవల్ల "జర్మనీ దాడి తిరిగి ఆరంభమయితే, మిగిలిన దేశాలు సంప్రదించుకోడానికి మాత్రమే పూనుకోవు. దానికన్న చాలాముందుకు వెళ్లుతాయి." అయితే మిలిటరీ ఒడంబడిక చేసుకోడానికి సంప్రదింపులు సాగుతున్నాయా యంటే చెప్ప నిరాకరించారు.

జెకోస్లోవేకియాను తిరిగి స్వతంత్రదేశముగా నిర్మించడానికి ఏమైన చర్య తీసుకుంటారా అంటే, అది యుద్ధముచేయనిదే సాధ్యము కాదు కాబట్టి అట్టి ఆలోచనయేలేదు అని జవాబిచ్చారు.

30 వ తారీఖున బ్రిటిషు ప్రభుత్వం ఫ్రాంకో సోవియటు పాక్టులో సంతకము చేస్తుందాఅంటే ఛాంబర్లేను చేయదన్నారు. రొమేనియనులతో సంప్రదించి యుద్ధానికి కావలసిన ముడిసరకులను జర్మనీకి పోనివ్వకుండా నిషేధిస్తారాఅంటే చేయనన్నారు ఛాంబర్లేను.

నేటి ప్ర

జర్మనీ దాడిని ఎదుర్కోడానికి కావలసిన ఒక్క ప్రయత్నముకూడ ఛాంబర్లేను చేయడానికి తయారు కావడములేదు. మార్చి 30 వ తేదీ వరకు అట్టి ప్రయత్నాలు చేయనన్నారు. అట్టి ఛాంబర్లేను 31 వ తారీఖున తన ధోరణిని మార్చుకున్నాడను కోవడము ఎంత వెర్రి! ఛాంబర్లేను ప్రకటనమాస్తే కూడ ఈ విషయమే మరింత స్పష్టమగుతుంది.

"మేము సంప్రదింపులు సాగిస్తూవున్న సమయములోనే ఏమైనాదాడి సాగినట్లయితే, ఆదాడి పోలెండుయొక్క స్వాతంత్ర్యాన్ని స్పష్టముగా భగ్నము చేయునట్టిదైయుంటే, అట్టిదాడిని పోలెండు ప్రభుత్వము తమ స్వాతంత్ర్యాన్ని భగ్నము గావించడమేనని భావించి తమ జాతీయ శక్తులతో నెదుర్కోనేపక్షాన, బ్రిటిషు ప్రభుత్వము, అప్పుడు తన శక్తికొలది పోలెండుకు సహాయము చేస్తుంది. బెక్ వచ్చి వెళ్లినమీదట దాడులను ఆపుచేసి, ఫ్రాంసునే మరింత హేతుబద్ధకమైన, సక్రమమైన సంప్రదింపు పద్దతిని ఆరంభించడానికి కావలసిన మరికొన్ని చర్యలను తీసుకుంటాము."

జర్మనీ దర్యటు పోలెండు స్వాతంత్ర్యాన్ని

రష్యాపై యుద్ధం తప్పదు

…టానికి మరొక ప్రయత్నం

వట్టి బూటకము

భగ్నము కావించునట్టిదిగా స్పష్టముగా తమకు కనబడాలట. ఇది మొదటినరతు. జెకోస్లోవేకియామీద జర్మనీ సైన్యము దాడివెడలి ఆక్రమించు చున్నప్పటికీ అది ఆక్రమణమనిగాని, దాడి యనిగాని అనుకోని ఛాంబర్లేనుకు మరెట్టి చర్య స్వాతంత్ర్యాన్ని భగ్నము గావించేదిగా కనబడుతుంది? రెండవ షరతు ప్రకారము పోలెండు తన స్వాతంత్ర్యముకోసం పోరాడక జర్మనీకి లొంగిపోవునట్లు చేయవచ్చు. ఈ సందర్భములో అభిరాపత్రికము ముఖ్యముగా గుర్తించాలి. "దాడులకు బదులు సక్రమమైన మరింత హేతుబద్ధకమైన సంప్రదింపుల పద్దతిని బెక్ వచ్చినపిదప చేపడానికి చర్యలు తీసుకుంటాము" దీని అర్థము బెక్ హిట్లరు కోరికలను అంగీకరించమని ఒత్తిడి తెస్తాడనియేనా, ఒకవేళ హిట్లరు సంప్రదింపులకు ఒప్పుకోక, దాడికి పూనుకొనినచో, అప్పటికి ఛాంబర్లేను తన శక్తికొలది సహాయము చేస్తానన్నాడేగాని, హిట్లరుపై యుద్ధము ప్రకటించి, జర్మనీ తీరాన్ని తన నౌకాసైన్యముతో ముట్టడిస్తానని గాని, తన సైన్యాన్ని యూరపు పంపుతాననిగాని ప్రకటించలేదు. ఇందుచేతనే ముస్సోలిని ఛాంబర్లేను ఉపన్యాసము విన్నపిదప, "మేము తయారుగా ఉన్నాము. మా హక్కులకోసం పోరాడుతాము. మాకు స్థలముకావాలి. స్థలము ఇవ్వనిచో కాగితపు బెదరింపులకు, నిర్బంధ

పంచం

లకు లొంగువారము" అని బెదిరించారు. హిట్లరు ఇలా అన్నారు: "మూడువందల సంవత్సరాలుగా … బ్రిటను ప్రపంచంలోని … ఇతరులకు శ్రీరంగనీతులు చెప్పుతూంది. పాలెస్తైనులో వేలకొలది మందిని ఎందుకు కాల్చుతూ ఉంది. మేము మధ్యయూరపులో ఏ ఒక్కరిని కాల్చలేదు. మేము దేనినైనా శాంతితో గావించాము. మాపై ఏదేశమైనా దండెత్తదలచుకుంటే, దానికి మాబలము రుచి చూపించడానికి వెనుదీయము."

మరొక మ్యూనిక్

ఈ సందర్భములో ఛాంబర్లేను ప్రకటన రాకపూర్వము, అమెరికా అధ్యక్షునికి తెలిసిన మరియొక మ్యూనిక్ నాటకమును ప్రజాతంత్ర రాజ్యాలచేత ఆడించడానికి హిట్లరు ముస్సోలినీలు ప్రయత్నిస్తున్నారన్న సంగతి ముఖ్యంగా గమనించాలి. సెనేటరు బోరాకూడ బ్రిటను నిజంగా హిట్లరుతో దెబ్బలాడుతుందని నమ్మకము లేదు. కాబట్టి యూరపు వ్యవహారాలలో దూరంగా ఉండాలన్నారు. … అని కార్మికపార్టీ సభ్యుడు ఒకరు … విధానం నిజమే అయితే, దీనిని ఛాంబర్లేను … నమ్మకము తన పార్టీకి లేదని ప్రకటించారు.

ఛాంబర్లేను ఇంత ఖచ్చితముగా ఎప్పుడూ చెప్పలేదు. పైగా దలదీరు కూడ ముస్సోలినీ కోరికలను నిరాకరిస్తూ మాట్లాడారు. పైగా సోవియటు యూనియనును దూరముగ ఉంచుతూవచ్చిన ఛాంబర్లేను సోవియటు యూనియనుకు కూడ తన దృక్పథాన్ని తెలియజేయడానికి తయారయ్యారు. ఇంతవరకు భిన్న సిద్ధాంతము (ideology) ల మీద ఏర్పడినది కాన రష్యాతో సహకారము చేయుట నష్టమన్న ఛాంబర్లేను, ఆ భిన్న సిద్ధాంతాలు నేడు అట్టి సహకారానికి అడ్డు రావన్నాడుకదా అని కొందరు అడుగవచ్చును.

గత మ్యూనిక్ ఒడంబడిక సమయాన బ్రిటిషు ప్రభుత్వము తన నౌకాదళాన్ని సన్నద్ధముచేసింది. అయినా మ్యూనిక్ ఒడంబడికను చేసుకొన్నారు. ఈ రోజు గట్టిగా ఖచ్చితంగా మాట్లాడినంత మాత్రాన మరియొక అట్టి ఒడంబడికకు దారి తీయదనుకోవడము వెర్రితనము.

ఫ్రాంసు వైఖరి

ఇక దలదీరు ఉపన్యాసాన్ని పరిశీలిస్తాము "అబిసీనియాను జయించినందున ఇటలీకి క్రొత్త హక్కులు కలిగాయి, అని ముస్సోలినీ వాదిస్తున్నారు. ఆ వాదనను నేను అంగీకరించను. ఎందుకంటే ప్రతి క్రొత్త జయము, … మరికొన్ని క్రొత్త హక్కులను ఇమ్మనడానికే దారితీస్తాయి. ఫ్రాంసు స్వాతంత్ర్యముతోపాటు శాంతి కోరుతుంది. అట్టి స్వాతంత్ర్యాన్ని రక్షించుకోడానికి ఒక్కుమ్మడిగా నిలబడుతుంది."

ఈ ఉపన్యాసము ఇచ్చిన రెండవరోజే ఇటలీ కోర్కెలనుగూర్చి సంప్రదింపులు సాగించడానికి ఫ్రాంసు తయారుగా ఉండవలెనని వార్తలు వస్తున్నాయి. అబిసీనియాపై ఇటలీ దాడిచేసినప్పుడు ఫ్రాంసు ఏమి చేయదని 1935 లో ఒడంబడిక చేసుకొన్న లావల్, అబిసీనియా యుద్ధము సాగుతున్నప్పుడు బ్రిటిషు విదేశాంగ మంత్రి హోరుతో కలసి, అబిసీనియాను ద్రోహముచేసిన లావల్, ఫ్రాంసు తరఫున అనధికారరాయబారేనని అనుకోవడ. ముస్సోలినీతో సంప్రదింపులు ఆరంభించడానికి … వస్తున్నాయి. మ్యూనిక్ ఒడంబడిక సందర్భాన హిట్లరును బలపరచిన ఫ్లాండిను గ్రూపు నేడు కూడ హిట్లరుకు రుమేనియాలోను, పోలెండులోను … వాదిస్తున్నారు. … ఉపన్యాసమువల్ల బూటకమన్నారు. …

రష్యా—బ్రిటన్

ఇక సోవియటు యూనియనుతో కలసి పనిచేయడానికి ఛాంబర్లేను ప్రయత్నించడములో అర్థమేమిటో ఆలోచిస్తాము. ఈరోజు … నిజంగా శాంతికోసం పోరాడేది, పట్టుదలగా ఉన్నది ఒక సోవియటు యూనియను మాత్రమే అని చాలమందికి తెలియను. సోవియటు యూనియను తో సంప్రదింపులు చేయకుంటే, ఛాంబర్లేను మాటలు ఎవరూ నమ్మరు. బ్రిటనులో నిర్బంధసైనికశిక్షణను ఆరంభించాలని టోరీలు (కన్సర్వేటివు పార్టీవారు) చాల పట్టు పట్టుతున్నారు. కాని నిర్బంధ సైనిక శిక్షణ ఆరంభించాలంటే, లేబరు పార్టీ సమ్మతికావాలి. ట్రేడుయూనియనుల సమ్మతికావాలి. బ్రిటిషు లేబరుపార్టీ, ట్రేడు యూనియనులు ఎంతవరకు దేశ రక్షణకు అవలంబించినా, సోవియటు యూనియనుతోటి సహకారము చేయక బ్రిటిషు విదేశాంగనీతిని పూర్తిగా బలపరచడానికి ముందుకు రావడములేదు. అందుచే ఛాంబర్లేను ప్రయత్నము సోవియటు యూనియనుతోకూడ కలసి పనిచేస్తున్నామని ప్రపంచానికి ముఖ్యంగా కష్టజీవుల ప్రపంచానికి తెలియజేయడానికి. ఒకవేళ అట్టి సంప్రదింపుల విషయములో … సోవియటు యూనియను మీదనే ఉన్నదని ప్రచారము సాగించడానికి అవకాశముండును. ఇట్టి ప్రచారము ఎక్కువమందిని మోసగించకపోయినను, కొద్దిమందినైనా, ఛాంబర్లేను తన కార్యక్రమాన్ని అమలులో పెట్టడానికి కావలసినంతమందిని తన పక్షములోనుండి పోగుచేసుకోవచ్చును అవకాశముండింది.

కాని సోవియటుయూనియను కేవలము మాటలతో లొంగదు. నేడు మిలిటరీ ఒడంబడికకేగాని, మిలిటరీ ఒడంబడికను ఆచరణలో పెట్టడానికి తయారుకావలెనో ఆ దేశాలతో ఒడంబడికకు తయారు. … అట్టి ఒడంబడికను తయారుచేయను అని ఛాంబర్లేను ప్రశ్నిస్తూ ఉంది. దానికి జవాబు ఛాంబర్లేను ఏమి ఇచ్చింది మనము చూచాము. పోలెండుకూడ రష్యను సైన్యము తన సరిహద్దులగుండా పోవచ్చుననటానికి ఇష్టపడదు. తన సరిహద్దులను తన స్వాతంత్ర్య సంరక్షణకొరకైనా … అంగీకరించడములేదు. రష్యను సైనిక విమానములు … యూరపు … దేశముతో. మిగిలిన దేశములన్నీ కలిసినా, జర్మనీకి వ్యతిరేకంగా పోరాడలేక ఉండును కోవడము హాస్యాస్పదము.

ఈ సందర్భమున మరియొక విషయమును ముఖ్యంగా గమనించాలి. జర్మనీతో యుద్ధము చేయడానికి మార్గము, లేక సోవియటు యూనియనుతో సహకారము చేయడానికి మార్గము బ్రిటనులోను ఫ్రాంసులోను కార్మికవర్గము హక్కులను అణచివేయడము కాదు. కార్మికపార్టీలను అణచడానికి ప్రయత్నించడము కాదు. … ఫ్రాంసులో ఇవి అన్నీ చేస్తూంది. … కార్మికవర్గానికి వ్యతిరేకంగా నిలుచున్న దలదీరు ప్రభుత్వము నియంతృత్వ అధికారాలను తీసుకుంది. సోషలిస్టులు, కమ్యూనిస్టులు … కమ్యూనిస్టు పత్రికలు నిషేధిస్తున్నారు. ఇట్టి నియంతృత్వపాలకులు, జర్మనీ దాడి ఎదుర్కొడానికి … దాని మాటలు ఎవరు నమ్మరు. ఎందుకంటే, హిట్లరుకు వ్యతిరేకంగా … కార్మికవర్గాన్ని, కమ్యూనిస్టులను నిర్బంధిస్తుంది. బ్రిటిషు ప్రభుత్వము … తమ కాలనీలలో ఎంత నిర్బంధపరిపాలన … తెలుసు మన కేట అనుభవమునుంది.

యుద్ధము తప్పదు.

అయితే ఛాంబర్లేను ప్రకటనకు కారణమేమిటి? మ్యూనిక్ ఒడంబడిక నిజమైన అర్థమును, స్వయంనిర్ణయ సూత్రము చాటున ఇంతవరకు దాచుటకు వీలయింది. హిట్లరు జెకోస్లోవేకియాను పూర్తిగా కబళించడముతో ఈ బూటకపు మాటలకు తావులేకపోయింది. ఛాంబర్లేను తన విధానాన్ని బ్రిటిషు ప్రజాసామాన్యము ముందు గాని, ప్రపంచ ప్రజాసామాన్యము ముందుగాని, సమర్థించుకోలేదు. అందుచే ఈ ప్రజాభిప్రాయాన్ని క్రమేణ మోసగించడానికి ఈ ప్రకటన గావించారు.

ప్రజాభిప్రాయము ఛాంబర్లేను కబుర్లను నమ్మితే తిరిగి మరియొక మ్యూనిక్ ఒడంబడిక లాంటిది ఛాంబర్లేను తయారు చేస్తారు. జర్మనీకి, పోలెండు రుమేనియాలలో పూర్తి స్వాతంత్ర్యం ఇస్తారు. … ఒత్తిడి తెస్తారు. జర్మనీ ఆక్రమణలను ఆధారముచూపుతూ, బ్రిటనులో నిర్బంధ సైనికశిక్షణ అమలు పరుస్తారు. పాసిస్టు నియంతృత్వాలను అవలంబిస్తారు. బ్రిటనులోకూడ ప్రజాతంత్ర హక్కులు లేకుండ జేయడం … ఫ్రాంసులోకూడ అట్టి పరిస్థితులే కల్పుతాయి. బ్రిటను, ఫ్రాంసులలో పాసిస్టు ప్రభుత్వాలు ఏర్పడడముతో, పోలెండు రుమేనియాలను జర్మనీకి అప్పగించడం వల్ల ఇటలీకి ఉత్తరాఫ్రికాలో సౌకర్యాలు కలిగించడమువల్ల బలిష్టపడిన జర్మనీ, ఇటలీలతో … రష్యాపై … సహాయముకూడ చేస్తారు. హిట్లరు బ్రిటిషు సహాయముతో రష్యాపై తయారవుతారు. కాని, జర్మనీ బ్రిటనులపై దుమికి రష్యానుకూడ …

జర్మనీలో ఆర్థికపరిస్థితి చాల తీవ్రంగా ఉందని జర్మనీ ఆక్రమణలు, హిట్లరు ఉపన్యాసాన్ని బట్టి తెలుస్తూ ఉంది. అందుచే యుద్ధము తప్పదు అయితే సమస్య ఈరోజే జర్మనీ, ఇటలీ, … ఫ్రాంసు బ్రిటను రష్యా సాయముతో ఎదుర్కోడానికి సులభమునా గెలువడానికి అవకాశముంటుంది. రుమేనియా, పోలెండును కూడ హిట్లరు కిచ్చి … రష్యాసాయము ఉండినా కష్టతరమవుతుంది అత్యంత నష్టము సంభవిస్తుంది. బ్రిటను, ఫ్రాంసు ప్రభుత్వాలు … రష్యాపై దాడికి … వచ్చాయి; అందువల్ల …

ఛాంబర్లేను ఉన్నంతకాలమూ, దలదీరు ప్రభుత్వమున్నంతకాలము, పాసిస్టు ప్రభుత్వాలకు … అందుచే ఛాంబర్లేను ప్రభుత్వాన్ని … బ్రిటనులోను, మన దేశములోను ప్రజాసామాన్యము పూనుకోవాలి.

ఇంద్రజిత్తు ప్రయోగించిన శక్తివచ్చి హృదయంమీద నాటినప్పుడు లక్ష్మణుని ముఖం తప్పక వికృతినిచెంది ఉండవచ్చును; కాని గురుచరణుని ముఖం—ఉదయం లేవగానే భార్య యిప్పుడే నిర్విఘ్నంగా ఐదవ కుమార్తెను కనినదన్న కబురు విన్నపుడు, అసలు గుర్తించటానికే వీలు లేకుండా పోయింది.

గురుచరణుడు బ్యాంకు గుమస్తా. నెలకు అరవై రూపాయల జీతం. బాడుగబండి తోలే గుర్రం మాదిరిగా అతని దేహం శుష్కించి పోయింది. ముఖంలోనూ కళ్ళలోనూ అలాంటిదే ఒక నిష్కామనిర్వికార నిర్లిప్తభావం గోచరిస్తూ ఉంటుంది. అయినా ఈ భయంకర శుభవార్త వినేవరకు అతని చేతులోని హుక్కా అలానే ఉండి పోయింది. పిత్రదత్తమైన పురాతనపు దిండును ఆనుకొని ప్రతిమవలె కూర్చున్నాడు అతనిలో నిట్టూర్పు విడిచే శక్తికూడా లేకుండా పోయింది.

ఈ శుభవార్త కొనితెచ్చింది అతని మూడువ కుమార్తె అన్నాకాళి. ఇప్పుడు పదో యేడు—"నాన్నా! అమ్మాయిని చూద్దుగాని రా!" అని అడిగింది.

గురుచరణుడు కుమార్తె ముఖంవంక చూస్తూ—"తల్లీ! ఒక గ్లాసు నీరు తీసుకురా! దాహం అవుతున్నది." అన్నాడు.

కుమార్తె నీరు తీసుకురావటానికి పోయింది. పిల్ల వెళ్ళిపోయిన తరువాత అతనికి మొట్టమొదట జ్ఞాపకం వచ్చింది సూతికాగృహపు ఖర్చు. తర్వాత, ప్రయాణికులు ఎక్కువగా ఉన్న రోజున స్టేషనులోకి బండిరాగానే తెరచి ఉన్న తలుపు చూచి మూడవ తరగతి ప్రయాణికులు మూటాముల్లె చేతపట్టి ఉన్మత్త భావంతో ముసలీ ముతకను త్రొక్కివేస్తూ పెట్టెలోకి ఎలా దూకుతారో, అలాగే అనేక దుశ్చింతలు ఒక్కసారిగా అతనిబుర్రలో అట్టహాసం చేస్తూ ప్రవేశింప నారంభించినవి—

గత సంవత్సరం రెండో కుమార్తె శుభ వివాహానికి తండ్రి సంపాదించిపోయిన రెండంతస్తుల మేడా తాకట్టు పెట్టాడు; ఇప్పుడు అసలు [illegible] వడ్డీకూడా తోడయింది. దసరాపండుగ దగ్గరకు [illegible] రెకు సూ[illegible] పంపాలి. రాత్రి ఎనిమిది గంటలదాకా [illegible] జమాఖర్చులు కలవలేదు; ఇవ్వాళ పన్నెండు గంటల [illegible] శాలకు పంపాలి. మురికిగుడ్డలు వేసుకుని ఆఫీ[illegible] జరిమానా వేస్తాడు. ఇటు వారం రోజులనుంచి [illegible] ఈ కుటుంబములోని సగం గుడ్డలకు పైగా తీసు[illegible]రిపోయాడు. ఇలాంటివి యింకా ఎన్నో దుశ్చింతలు [illegible]వేశించినవి. గురుచరణుడు ఇక దిండుకు ఆనుకొనిగూడా [illegible]ర్చోలేకపోయాడు; హుక్కా పైకెత్తి జారబడి భగవంతుని ఉద్దేశించి ఇలా ప్రార్థించాడు—

"భగవంతుడా! కలకత్తాలో రోజుకు ఎంతోమంది బండ్లక్రింద పడి చస్తున్నారు. వారు నాకంటేకూడా నీకు ఎక్కువ అపరాధం చేశారా? దయామయా! నీ దయవల్ల ఒక పెద్ద మోటారుకారు నా గుండెమీదుగా పోకూడదా?"

అన్నాకాళి వచ్చి నీళ్ళగ్లాసు అందిస్తూ "నాన్నా! లే, నీళ్లుతెచ్చాను." అన్నది. గురుచరణుడు లేచి నీరంతా ఒక్క గుక్కను తాగివేసి—"ఆ, ఇక పో తల్లీ! గ్లాసు పట్టుకుపో." అన్నాడు.

పిల్ల వెళ్ళిపోయిన తర్వాత గురుచరణుడు తిరిగి పండుకున్నాడు. లలిత గదిలోకివచ్చి—"మామా! టీ తెచ్చాను, లే!" అని అన్నది.

టీ మాట వినగానే గురుచరణుడు మరల లేచి కూర్చున్నాడు. లలిత ముఖం చూచేసరికి అతని కోపం సగం తగ్గిపోయింది. "రాత్రంతా మేలుకొన్నావు కామాలు తల్లీ, ఇలా రా!" అని పిలిచాడు.

లలిత సలజ్జహాసంతో దగ్గరకువచ్చి—"రాత్రి నే నెక్కువసేపు మేలుకోలేదు, మామా!" అన్నది.

నానావిధ కౌటుంబిక ఉత్సాహలవల్ల అకాలవృద్ధుడైన మాతులుని ప్రచ్ఛన్న హృదయవేదన ఈపిల్లకంటే బాగా గ్రహించినవారు ఈ కుటుంబంలో యింకెవ్వరూలేరు.

"అలాగే గాని దగ్గరకు వచ్చి కూర్చో" అన్నాడు గురుచరణుడు.

లలిత దగ్గరకు వచ్చి కూర్చోగానే గురుచరణుడు ఆ పిల్ల తల నిమురుతూ—"మా యీ తల్లిని మంచి భాగ్యవంతుని చేతిలో పెట్టగలిగితే అప్పుడు నేనొక సత్కార్యం చేశానని అనుకొంటాను!" అని అన్నాడు.

లలిత తల వంచుకొని 'టీ' కప్పులో పోస్తూన్నది.

"ఏం తల్లీ! నువ్వీదరిద్రుని యింట్లో రాత్రిం బగళ్ళు కష్టపడటం లేదూ?"

"కష్టమేముంది మామా! అందరూ పని చేస్తున్నారు నేనూ చేస్తున్నాను" అన్నది కష్టము లేదన్నట్లు తల త్రిప్పుతూ.

ఈ మాటకు గురుచరణుడు నవ్వి "సరే తల్లీ! ఇవాళ వంట ప్రయత్నాలేమైనా ఉన్నాయా?" అని టీ త్రాగుతూ అడిగాడు.

"ఎందుకు లేవు మామా! నేను వండుతానుగా!" అన్నది లలిత మామ వంక జూస్తూ.

"నువ్వు వండుతావా తల్లీ! నీకు వంట తెలుసా?" అని గురుచరణుడు ఆశ్చర్యముతో అడిగాడు.

"తెలుసును మామా! అత్తయ్య దగ్గర అంతా నేర్చుకున్నాను."

"నిజంగా?"

"నిజంగా, అత్తయ్యకు తెలుసునుగా నేను ఎన్నాళ్ళనుంచి వండుతున్నదీ!" అని లలిత తల వంచుకున్నది. ఆమె తల నిమురుతూ గురుచరణుడు మనస్సులోనే ఆశీర్వదించాడు. అతని దుశ్చింత ఒకటితొలగింది.

ఈ యిల్లు గల్లీకి కొంచెము ఎత్తుగా ఉన్నది. గురుచరణుడు టీ త్రాగుతూ కిటికీలోగుండా బయటకు చూసి—"శేఖర్! మాట, మాట!" అని కేక వేశాడు.

ఒడ్డూ పొడుగూ కలిగి బలిష్ఠంగా ఉన్న సుందర యువకు డొకడు గదిలో ప్రవేశించాడు.

"రా నాయనా కూర్చో! ఇవ్వాళ ఉదయం మీ పిన్ని చేసిన ఘన కార్యం విన్నావన్నట్టుగా ఉందే?"

"ఘనకార్య మేముంది కక్కాయి! కుమార్తెను కన్నది. అదేగా?" అన్నాడు శేఖరుడు మందహాసం చేస్తూ.

"నీకేం? అదేగా అని తోసిపారేస్తావు; కాని 'అదేగా' అంటే ఏమిటో నా ఒక్కడికే తెలుసును!" అన్నాడు గురుచరణుడు నిట్టూర్చి.

"అలా అనబోకు కక్కాయి! పిన్నికి తెలిస్తే దుఃఖిస్తుంది. అంతే కాక భగవంతుడు యిచ్చిన తర్వాత వారిని ఆదరించటం, వారితో ఆనందించటం ఉచితం."

గురుచరణుడు ఒక్క క్షణకాలం మాట్లాడలేదు.

"ఆదరించడం, ఆనందించడం ఉచితమని నాకూ తెలుసు. కాని భగవంతుని న్యాయం ఎక్కడున్నది బాబూ? నేను బీదవాణ్ణి గదా! నాకే ఇంతమంది సంతానం ఎందుకు? ఈ యిల్లు ఇదివరకే మీనాన్నకు తాకట్టు పెట్టాను; పెట్టినందుకు నాకేమీ చింతలేదు. ఇదుగో మా లలిత వంక చూడు, శేఖర్! తల్లీ తండ్రీ లేని పుత్తడి బొమ్మ. రాజుల అంతఃపురాలల్లో రాణించవలసిన మాణిక్యం. ఇలాంటి రత్నాన్ని ప్రాణంపోస్తే వాళ్లా వీళ్ళ చేతుల్లో ఎలా పెట్టమంటావో నీవే చెప్పు. నూరు కోహినూర్లు ఒక రాసి పోసినా మా తల్లి విలువ చేయవు. కాని ఆసంగతి ఎవరు చూస్తారు? డబ్బు చేతిలో లేకపోవటంచేత ఇలాంటి రత్నాన్ని కూడా నేను తుక్కుపోగులో పారవెయ్యవలసి వస్తున్నది! నువ్వే చెప్పు, అలాంటప్పుడు నా హృదయం ఎంత పరితపిస్తుందో! లలితకు ఇప్పుడు పదమూడో ఏడు వచ్చింది సంబంధం కుదర్చాలంటే ఇప్పుడు పదమూడు పైసాలు కూడా లేవు." గురుచరణుని కళ్లల్లో నీరు నిండినది. శేఖరుడు మాట్లాడలేదు.

"ఇదిగో, శేఖర్‌నాథ్! నీ బంధుమిత్రుల్లో ఎవరికన్నా ఈ పిల్లను ఇవ్వటానికి వీలుంటుందేమో చూడు. ఇప్పటి కుర్రవాళ్లు చాలామంది కట్నాలూ కానుకల్లూ చూడకుండా పిల్లనుచూసి చేసుకుంటారని విన్నాను. దైవానుగ్రహంచేత అలాంటి కుర్రవాడొకడు దొరికితే, శేఖర్‌నాథ్! నా ఆశీర్వాదంచేత నీవు తప్పక రాజవుతావు! నేనింకా ఏమి చెప్పేది బాబూ! ఈ పేటలో నేను మీఆశ్రయంలోనే ఉంటున్నాను. మీనాన్న నన్ను తమ్ముని మాదిరిగా చూసుకుంటాడు."

"సరే, అలాగే చూస్తాను!" అన్నాడు శేఖరుడు.

పరిణీత

శరశ్చంద్ర చటర్జీ

విరచితం

"మరచిపోకుండా చూడు బాబూ! లలిత ఎనిమిదో యేటనుంచీ నీ దగ్గరే రాతకూతలు నేర్చుకుని మనిషి అయింది. అది ఎలాంటి బుద్ధిమతో, ఎంత ఓర్పు కలదో నీకు బాగా తెలుసును. ఇప్పుడు పనిపాటలు కూడా చేస్తున్నది. ఇవ్వాళనుంచి మాకు అన్నం వండిపెట్టేది లలితే; ఇప్పుడు యింటి బాధ్యత అంతా దాని నెత్తిమీదనే పడింది!"

ఈ సమయంలో లలిత ఒకమాటు తల ఎత్తి చూచి మరల వంచుకున్నది. ఆమె ఓష్ఠాధరాలు కొంచెం ప్రసారిత మయినవి. గురుచరణుడు ఒక నిట్టూర్పు విడిచి మరల ప్రారంభించాడు.

"వాళ్ళ నాన్న గూడా తక్కువ సంపాదించాడా? కాని చనిపోయేటప్పటికి, ఒక్కగాని ఒక్క కూతురు వుండే, ఏమీ మిగల్చకుండా దానం చేసి పోయాడు!"

శేఖరుడు మాట్లాడలేదు. గురుచరణుడు తిరిగి మొదలుపెట్టాడు.

"ఏమీ మిగల్చలేదని మాత్రం ఎట్లా చెపుతాను? ఎంతోమంది దీనులకు సహాయపడి, ఆ ఫలితమంతా మా యీతల్లికి ఇచ్చిపోయాడు. అలా కాకపోతే, ఇంత చిన్న పిల్లకే అన్నపూర్ణలాంటి గుణాలు ఎలా అబ్బుతాయి! నువ్వే చెప్పు, శేఖర్! నిజమంటావా, కాదా?"

శేఖరుడు జవాబివ్వలేదు. నవ్వ నారంభించాడు.

కొంచెముసేపు ఉండి శేఖరుడు పోబోతూ ఉండగా గురుచరణుడు "ఇంత ప్రొద్దున్నే ఎక్కడికి వెళ్ళుతున్నావు?" అని అడిగాడు.

"బారిష్టరుగారింటికి—కేసు ఒకటున్నది" అని అతడు లేచి నిలబడగానే గురుచరణుడు ఇంకోసారి జ్ఞాపకం చేశాడు:

"ఈ మాట కొంచెం మనస్సులో పెట్టుకో బాబూ! కొంచెం నలుపన్నమాటే కాని ఇలాంటి కళ్లూ, ముఖమూ, నవ్వూ దయాదాక్షిణ్యాలూ—ఈ ప్రపంచమంతా గాలించినా దొరకవు!"

"చక్రపాణి"

అనువాదం

శేఖరుడు తలఊపి నవ్వుతూ వెళ్ళిపోయాడు. ఇతనికి ఇరవై ఐదు ఇరవైఆరు ఏళ్ళు ఉంటవి. ఎం. ఏ. ప్యాసై అప్రెంటిస్ చేసి క్రిందటి సంవత్సరమే అటర్నీ అయినాడు. తండ్రిపేరు నవీనరాయ్. ఇతను బెల్లపు వ్యాపారంతో కొన్ని లక్షలు సంపాదించినాడు. కొంతకాలమునుంచి వ్యాపారము మానివేసి ఇంట్లో కూర్చుని డబ్బును వడ్డీకి తిప్పుతున్నాడు. పెద్ద కుమారుడు అవినాశుడు వకీలు. చిన్నకుమారుడు శేఖరనాథుడు. వారి మూడంతస్తుల మేడ ఈ పేటలోకెల్ల తల ఎత్తుకుని ఉన్నది. వీరి మిద్దే గురుచరణుని మిద్దే కలిసియుండటంచేత ఈ ఉభయ పరివారాలకూ ఆత్మీయత కలిగింది. స్త్రీలు ఈ దోవనే ఒకరింటి కొకరు వస్తూ పోతూ వుంటారు.

౨

శ్యామ బజారులోని ఒక భాగ్యవంతుల కుటుంబంతో చాలా కాలం నుంచి, శేఖరుని పెండ్లి మాటలు జరుగుతున్నవి. ఆనాడు పిల్లతరఫువాళ్లు శేఖరుని చూడనికి వచ్చి, వచ్చే మాఘ మాసంలోనే లగ్నం పెట్టుకుందామని అడిగారు, కాని శేఖరున్ని తల్లి ఒప్పుకోలేదు. కుర్రవాడే స్వయంగా చూచి వచ్చి ఇష్టపడితేనే గాని లగ్నం పెట్టడాన్కి వీలుకాదని దాసీదానిచేత కబురు పంపింది.

నవీనరాయ్ దృష్టి అంతా డబ్బుమీదనే. భార్య ఇలా అడ్డుపుడక వేసేవరకు అతనికి కొంచెం కష్టము వేసింది. "అదేమి మాట! పిల్ల నిదివరకే చూశాంగా? ముందు సంబంధం స్థిరం కానివ్వు. తర్వాత ప్రధానం పంపేటప్పుడు ఇంకోమారు చూసి రావచ్చును" అని భార్య దగ్గరకు వచ్చి అన్నాడు.

అయినా భార్య సమ్మతించలేదు. గట్టిమాట ఇవ్వనివ్వలేదు. ఆవాళ నవీనబాబు కోపంతో వేళమిగిలి భోంచేసి, పగటి నిద్ర బయట గదిలోనే పోయాడు.

శేఖరనాథుడు కొంచెం సరదా పురుషుడు. మూడవ అంతస్తులో, చక్కగా అలంకరించిన ఒక గదిలో అతను వుంటాడు. నాలుగయిదు రోజులు గడచిన తర్వాత ఒకనాటి మధ్యాహ్నం గదిలో అద్దం ముందు నిలబడి పిల్లను చూచి రావటానికి తయారవుతున్నాడు. ఇంతలో లలిత వెనకగా వచ్చి ఒక క్షణకాలం నిశ్శబ్దంగా చూసి "పెళ్ళికుమార్తెను చూడబోతున్నావులాగుందే!" అన్నది.

శేఖరుడు తిరిగి చూచి "నీవా! ఏదీ, నన్ను కాస్త అలంకరించు! —ఎలా అలంకరిస్తావో! పెళ్లికూతురు వదలిపెట్టగూడదు" అన్నాడు.

లలిత నవ్వుతూ "ఇప్పుడు నాకు తీరికలేదు శేఖరదా! డబ్బుకోసం వచ్చాను." అని బాలీసుకిందనుంచి తాళపుచెవులగుత్తి తీసుకుని అలమారా తెరచి కొన్ని రూపాయలు ఎంచి చెరగున కట్టుకొని "డబ్బయితే అవసరమయినప్పుడల్లా తీసుకు వెళ్లుతున్నాను. కాని తీర్చేదెలా" అని గొణుగుకున్నది.

శేఖరుడు దువ్వెనతో ముంగురులు పైకెగదువ్వుతూ లలిత వంక తిరిగి "అదే తీరుతుందిలే" అన్నాడు నవ్వుతూ.

లలితకు అర్థం కాలేదు. చూస్తూ ఊరుకున్నది.

"ఏమిటాలోచిస్తున్నావు, అర్థంకాలేదా?" అని శేఖరుడు అడిగాడు.

"ఉహు!" అన్నది తల తిప్పుతూ.

"ఇంకా కొంచెం పెద్దదానివవ్వు, అప్పుడు తెలుస్తుంది!" అని శేఖరుడు బూటు తొడుకుని బయటకు వెళ్ళిపోయాడు.

రాత్రి శేఖరుడు ఒక సోఫామీద కళ్లుమూసుకుని పండుకొనిఉండగా తల్లి గదిలోనికి ప్రవేశించినది. శేఖరుడు చివుక్కునలేచి కూర్చున్నాడు. తల్లి పీటమీద కూర్చుని "పిల్ల ఎలా వున్నదిరా?" అని అడిగింది.

శేఖరుని తల్లిపేరు భువనేశ్వరి. ఈమెకు దాదాపు యాభై సంవత్సరాల వయస్సు ఉంటుంది. కాని, కాయపారు శరీరం కావడంచేత చూపులకు ముప్పైయైదు, ముప్పైయారు సంవత్సరాలకంటే ఎక్కువ ఉన్నట్టు కనిపించదు. ఈమెకు బాహ్య సౌందర్యముతోపాటు ఆంతరంగిక సౌందర్యముకూడా ఉన్నది. ఈమె మాతృ హృదయం అతికోమలమే కాక అత్యంత నవీనమైనది. ఈమె పల్లెటూరిపిల్ల. అక్కడే పుట్టింది. అక్కడే పెరిగింది. ఐనా పట్టణజీవితం కానీ పట్టణవాసులతో కలసిపోవటం కానీ ఈమెకు ఏమీ కష్టమనిపించలేదు. పట్టణంలో ఉండే చాంచల్యమూ, ఉత్సాహమూ ఆచార వ్యవహారాలూ, ఈమె ఎలా స్వేచ్ఛగా స్వీకరించినదో, అలాగే జన్మ భూమిలో ఉన్న మాధుర్యమూ, గాఢని స్తబ్ధతా వదలిపెట్టలేదు. ఈ తల్లినిచూచి శేఖరుడు చాలా గర్వించేవాడు—ఈ సంగతి తల్లికికూడా తెలుసును. పరమేశ్వరుడు శేఖరునికి అనేకము ప్రసాదించాడు, అనేకులకు లభించని స్వాస్థ్యము, బుద్ధి—కాని వీటి అన్నిటికంటే, ఇలాంటి తల్లికి సంతానంగా జన్మింటమే గొప్ప అదృష్టమని శేఖరుడు భావించేవాడు.

"బాగా ఉన్నదని ఊరకున్నావేమిరా?" అని అడిగింది తల్లి.

శేఖరుడు నవ్వుతూ "నువ్వు అడిగిందానికే సమాధానం చెప్పాను" అని తల వంచుకున్నాడు.

తల్లికూడా నవ్వి "చెప్పావు? రంగు ఎలా ఉంటుంది? ఎరుపా? ఎవరిమాదిరిగా ఉంటుంది? మన లలిత మాదిరిగానా?" అని అడిగింది.

"లలిత నల్ల నిదమ్మా, దానికంటె ఎరుపు!" అన్నాడు శేఖరుడు తల ఎత్తి.

"ముక్కు మొహం తీరిగ్గా ఉన్నదా?"

"ఫర్వాలేదు."

"అయితే మీ నాన్నకు చెప్పనా?"

ఈ ప్రశ్నకు శేఖరుడు జవాబివ్వలేదు. తల్లి ఒక క్షణం పుత్రుని ముఖంవంకచూచి "ఏంరా, పిల్ల ఎంతవరకు చదువుకున్నది." అని హఠాత్తుగా ప్రశ్నించినది.

"ఆసంగతి కనుక్కోలేదమ్మా!"

తల్లికి మహాశ్చర్యం కలిగింది. "కనుక్కొరాకపోవటం ఏమిటిరా ఈ కాలంలో మీకు ముఖ్యంగా కావల్సిందే ఇదిగా, ఇదే కనుక్కురాలేదా?" అన్నది తల్లి.

"లేదమ్మా! నే నామాట మరచేపోయాను!" అన్నాడు శేఖరుడు.

కుర్రవాని మాటలు విని విస్మయముతో అతనివంక చూసి "ఐతే నీవీ పెళ్ళి చేసుకొనేలాగా లేవు." అన్నది నవ్వుతూ.

శేఖరుడు ఏదో చెప్పబోతూ, లలిత గదిలోకి రావటంచూసి మానుకున్నాడు. లలిత నెమ్మదిగా భువనేశ్వరి వెనుకకు వచ్చి నిలబడింది. ఆమె ఎడమ చేతితో లలితను తన ముందుకు లాక్కొని "ఏమిటి తల్లీ?" అని అడిగింది.

"ఏమీ లేదమ్మా!" అన్నది లలిత మెల్లగా.

లలిత పూర్వం ఈమెను పిన్నీ అని పిలిచేది. 'నేను నీకు పిన్నిని కాను తల్లిని. అమ్మ అని పిలువు' అని శాసించినప్పటినుంచి భువనేశ్వరిని అమ్మా అనే పిలుస్తున్నది. భువనేశ్వరి లలితను దగ్గరకు లాక్కుని బుజ్జగిస్తూ "ఏమీ లేదా, ఐతే నన్నొకమాటు చూచిపోవటానికి వచ్చావా?" అని అడిగింది.

లలిత మాట్లాడలేదు.

"చూట్టానికి వస్తే వంట ఎప్పుడు చేస్తుంది?" అన్నాడు శేఖరుడు.

"వంటచేయటం ఎందుకు?" అన్నది తల్లి.

"వారికి ఎవరు వండిపెడతారమ్మా, మరి వాళ్ళమామ ఆ నాడు వంట పనులన్నీ లలితే చేస్తున్నదన్నాడే!" అన్నాడు శేఖరుడు ఆశ్చర్యముతో.

తల్లి నవ్వుతూ—"వాళ్ళ మామ పోటికి వచ్చిందేదో చెప్పుతూ వుంటాడు. పెళ్ళికాని పిల్లల చేతి అన్న మెవరయినా తింటారా? మన వంట బ్రాహ్మణ్ణి పంపా[illegible] వండి [illegible]తున్నాడు. ఇప్పుడు నేను కూడా మధ్యాహ్నం అక్కడే భోంచేస్తున్నాను" అన్నది తల్లి.

తల్లి ఈ దుఃఖితపరివార భారాన్ని కొంత వహించినదని గ్రహించి శేఖరుడు తృప్తిగా నిట్టూర్పు విడిచాడు.

ఒక మాసం గడిచింది. ఒకనాటి సాయంత్రం శేఖరుడు సోఫాలో కూర్చుని ఏదో ఇంగ్లీషు నావెలు తన్మయుడై చదువుతున్నాడు. ఇంతలో లలిత గదిలోకి వచ్చి బాలీసుక్రిందనుంచి తాళపుచెవులు తీసుకొని చప్పుడు చేస్తూ అల్మారీ తెరుస్తున్నది. శేఖరుడు పుస్తకంమీదనుంచి దృష్టి మరల్చకుండానే "ఏమిటి?" అని అడిగాడు.

"డబ్బు తీసుకొంటున్నాను" అన్నది లలిత.

శేఖరు "హుఁ" అని మళ్ళీ చదువ నారంభించాడు. లలిత చెరగున డబ్బుకట్టుకొని దగ్గరకు వచ్చి నిలబడింది. ఇవ్వాళ బాగా అలంకరించుకున్నది. శేఖరుని దృష్టి తనమీద పడాలని ఆమె కోరిక. "పది రూపాయలు తీసుకున్నాను శేఖరదా!" అన్నది.

శేఖరుడు "సరే" నన్నాడు. కాని ఆమె వంక చూడలేదు. అందుచేత ఆమె అటూ ఇటూ తిరుగుతూ అనవసరంగా ఆలస్యంచేయ నారంభించింది. కాని యెంత సేపున్నా లాభమేమీ లేకపోయేవరకు కొంత దూరం వెళ్ళి ఏమో ఆలోచించుకొని మళ్ళీ తిరిగి వచ్చి వాకటిదగ్గర నిలబడింది. ఇవ్వాళ థియేటరు చూడటానికి పోతున్నది.

శేఖరుని ఆజ్ఞలేనిది తాను ఎక్కడికీ పోజాలనని ఆమెకు తెలుసును. ఈ సంగతి ఆమెకు ఎవ్వరూ చెప్పలేదు. "ఎందుకు వెళ్ళకూడదూ? వెళ్ళితే ఏమి?" అనే ప్రశ్నలు ఆమె మనస్సులో ఎప్పుడూ ఉదయించలేదు. ప్రాణిమాత్రులకు సహజంగా ఉండే సామాన్య బుద్ధే ఆమెకు నేర్పింది. ఇతరులు తాము తలుచుకున్నది చేయగలరు. తమ ఇష్టంవచ్చిన చోటికి పోగలరు. కాని ఆమె పోజాలదు. ఆమె స్వాధీనంకాదు. ఒక్క అత్తమామల అనుజ్ఞ ఆమె పక్షంలో చాలదు.

"మేము నాటకం చూడటానికి పోతున్నాం!" అని ఆమె తలుపు చాటున ఉండే మెల్లగా అన్నది.

నా "వింత జబ్బు"

సుభాషచంద్రబోస్

ఆది 1939 వ సంవత్సరం, ఫిబ్రవరి 15 వ తారీఖు. షీగాన్‌లో నేను మహాత్ముని కలుసుకొని, ఆయనతో దీర్ఘంగా మాట్లాడి, సాయంత్రం 6 గంటలు ఆయేసరికి వార్ధాకు తిరిగి వచ్చాను. రాత్రి మిత్రులు కొందరు నన్ను చూడ్డానికి వచ్చారు. జరూరైన ముఖ్యవిషయాలేవీ అప్పుడులేవు. అందువల్ల అందరమూ బాతాఖానీకి దిగాము. కాని, నావొంట్లో సుస్తీ తిరిగి ప్రారంభించింది కనుక వారి సమక్షంలోనే టెంపరేచర్ చూచుకొన్నాను. 99.4 డిగ్రీలు ఉంది. కాని నేనేమీ కంగారు పడలేదు.

మరునాడు ఉదయం, అంటే ఫిబ్రవరి 16 వ తారీఖున, నేను వార్ధాలో బయల్దేరి కలకత్తా వెళ్లవలసి ఉంది. ఉదయం పూట ఎంతో ఉత్సాహంగా ఉండడానికి మారు నీరసం పట్టుకుంది. ఆక్రితం రాత్రి నిద్ర సరిగా పట్టకపోవడమే దీనికి కారణం అనుకొని ఊరుకున్నాను. వార్ధా, నాగపూర్ స్టేషన్లలో చాలామంది మిత్రులు నన్ను చూడ్డానికివచ్చారు. నావిషయం గురించి ఆలోచించడానికే వ్యవధిలేక పోయింది నాగపూర్ స్టేషన్ విడిచిపెట్టి రైలు కదిలిన తరువాతనే నాకు విపరీతమైన జబ్బుచేసిందని కనుక్కొన్నాను. ఈసారి టెంపరేచర్ చూచుకుంటే, 101 డిగ్రీలు ఉంది. వెంటనే పరుపు మీద వాలేను.

ఒక ఆంగ్లో—ఇండియన్ పెద్దమనిషి.

సుమారు రెండు గంటలు గడచాక ఒక ఆంగ్లో-ఇండియన్ పెద్దమనిషి నా పెట్టెలో ఎక్కాడు. నేనూ, నా జ్వరంతప్ప మరొకరెవరూ నాతో ఉండడం యిష్టం లేకపోయింది. అదేగాక, అతడు కలకత్తా వరకూ కూడా ప్రయాణం చేస్తాడని విన్నాను. ఇందువల్ల అతడు ఉండడం నాకంత రుచించలేదు, కాని ఆపెట్టెలో నాకెంత హక్కు ఉన్నదో అతనికీ అంతేహక్కు ఉంది. కొంతసేపైన తరువాత అతడు తదేకదృష్టితో నావైపు దయగాచూచి, "అట్లా ఉన్నారేమండీ పూర్తిగా నలిగిపోయినట్లు కనపడుతున్నారే ఏడు" అన్నాడు. నాకు వంట్లో బాగులేదనీ, టెంపరేచర్ వస్తూందనీ, జవాబు చెప్పాను. "అయ్యో, చెమటకూడా పోస్తోందండీ! ఇన్‌ఫ్లూయంజా కాదుకదా?" అని అతడు మళ్ళీ అన్నాడు.

ఆవగయా, ఆరాత్రి నా పెట్టెమీదనే చెమటతో పడుకున్నాను, "పూర్తిగా నలిగిపోయినట్లు కనపడుతున్నారే, మీరు!" అని అతడన్న మాటల్ని గురించి పదేపదే ఆలోచించడము మొదలెట్టాను. ఎందువల్ల నేనింత నలిగిపోయినట్లు కనపడుతున్నానో? చాలా రోజులు జబ్బు చేసిన తరువాతకూడా నేను చూపులకి బాగానే కనపడతాను. నాముఖంలో సహజంగా ఉండే లక్షణం యిది. అదీకాక, ఒక్కరోజు జ్వరముతో నేనింత నలిగిపోయినట్లు కనపడ్డానికి కారణం ఏమైఉంటుందో: నాకేమీ తోచలేదు.

మరునాడు ఉదయం ఉత్సాహంగా కనపడాలని నిశ్చయించుకున్నాను. స్నానపు గదిలోకి వెళ్లాను. శుభ్రంగా ముఖం కడుక్కొని, గడ్డం గీసుకొని, యీవలికి వచ్చాను. తొలినాటికంటె సంతోషంగా కనపడుతూ, "ఎట్లా వుంద"ని నా సహచరుడు సానుభూతితో ప్రశ్నించాడు. కొంచెం సుళువుగానే ఉన్నదని నేను జవాబిచ్చాను. "ఆఁ, చూశారా! యీ ఉదయం మీరు నిన్నటికంటె బాగున్నారు. నిన్నమాత్రము పూర్తిగా నలిగిపోయినట్లే కనుపించారు." అని అతడు మళ్లీఅన్నాడు.

కలకత్తాలో

17 వ తేదీని కలకత్తా చేరుకున్నాను. స్టేషన్‌నుంచి యింటికి వెళ్ళేసరికి పూర్వపు మిత్రులే నాకొరకు ఎదురు చూస్తున్నారు. కొంతసేపు వారితో సంభాషణ సలిపాక బడలిక మళ్ళీ రావడంవల్ల పరుపుమీద పడుకున్నాను.

డాక్టరు వచ్చాడు లోపలికి. సాంతం పరీక్ష చేశాడు, జబ్బు ప్రమాదకరమైనదంటూ తల యిటూ అటూ ఊపాడు. అప్పుడు రక్తపరిశోధన నిపుణునికి కబురు పంపారు. అతడూ వచ్చాడు. పరీక్షచేయడానికి రక్తం తీసుకొని వెళ్ళిపోయాడు. తరువాత యితర డాక్టర్లుకూడా వచ్చారు. కలకత్తా మెడికల్ కాలేజిలో మొదటి ఫిజీషియన్‌గా ఉన్న సర్. నీలరత్న సర్కార్ కూడ వచ్చాడు.

వార్ధాలో జరుగబోయే వర్కింగుకమిటీ సమావేశానికి సన్నాహాలు ప్రారంభించాను. కాని వార్ధా వెళ్ళడం అసాధ్యమని డాక్టర్లు వార్నింగులు యిచ్చారు. వర్కింగు కమిటీకి వెళ్ళడం మానివేసి. ఆరోగ్యం సంపాదించడం మీదనే మనస్సు లగ్నం చేస్తే త్రిపురీకి వెళ్ళవచ్చునన్నారు. లేకపోతే, త్రిపురీ వెళ్ళడంకూడ అసాధ్యం అవుతుందన్నారు. కాని, యీ వార్నింగులన్నీ చెవిటివాని యెదుట డప్పులు వాయించడం వంటివి. వైద్యుల సలహాను [illegible] వర్కింగు కమిటీ సన్నాహాలు చేస్తున్నాను. దయతో నా మిత్రులు కొందరు ఏరోప్లేన్ యిస్తామన్నారు. ఫిబ్రవరి 22 వ తేదీని ఏరోప్లేన్‌లో నన్ను నాగపూరువరకూ తీసుకువేళ్ళడానికి అంగీకరించారు.

వర్కింగ్ కమిటీ సమావేశం

ఫిబ్రవరి 21 వ తేదీ వచ్చింది. డాక్టర్ల సలహాయే మంచిదని అప్పుడు తట్టింది నాకు రైల్లోగాని, విమానంలోగాని వార్ధాకు వెళ్ళడం సాధ్యం కానిపని అని గ్రహించాను. ఆవిధంగా నేను గాంధిమహాత్మునికీ సర్దార్ పటేల్‌కీ టెలిగ్రాములద్వారా తెలియజేశాను త్రిపురీకాంగ్రెసు వరకూ వర్కింగు కమిటీ సమావేశాన్ని ఆపియుంచవలసిందని కోరాను. (12 గురు లేక 13 గురు) వర్కింగు కమిటీ సభ్యులు వెంటనే రాజీనామా యిస్తారనుసంగతి అప్పుడు నాకేమాత్రం తెలియలేదు.

పై రెండుటెలిగ్రాములనుగురించి కొందరు సంకుచిత మనస్కులు కొండంతలుగా చేశారు. వర్కింగ్ కమిటీ నిర్వర్తించవలసిన సాధారణ కార్యక్రమానికి కూడా నేను అనుమతించనట్లు కొందరు అర్థంతీశారు అట్టి అర్థానికి ఆధారం ఏమాత్రమూలేదు. మొదటివిషయం: వర్కింగ్ కమిటీ సాధారణ కార్యక్రమాన్ని నిర్వర్తించకూడదని పై టెలిగ్రాములలో నేను సూచించియుండలేదు, కాంగ్రెసు మహాసభలో ప్రతిపాదించవలసిన చిత్తుతీర్మానాలను గురించే ఆలోచన. సాధారణంగా, కాంగ్రెసు సమావేశానికి కొన్నాళ్లముందు వర్కింగ్‌కమిటీ సమావేశమై, అట్టి తీర్మానాలను తయారు చేస్తుంది. రెండోవిషయం: సర్దార్ పటేల్‌కు నేనిచ్చిన టెలిగ్రామంలో వాయిదా వేయడంసంగతి తెలియజేసి, ఇతర వర్కింగ్ కమిటీసభ్యుల అభిప్రాయం ఏమో తెలుసుకొని నాకు టెలిగ్రాం యివ్వాలలసిందని కోరాను. నా టెలిగ్రాముకు జవాబు 12 గురు సభ్యుల రాజీనామాలు. వీరే చిత్తుతీర్మానాలు తయారు చేయదలచుకొంటే. నేనేమాత్రం అభ్యంతరం పెట్టేవాణ్ణికాను. ఇక సాధారణ కార్యక్రమం విషయం: వాయిదా వేయడం విషయంలో యితర సభ్యులు నాతో ఏకీభవించకపోయి యున్నట్లయితే, లేదా నా అసలు ఉద్దేశాలను గురించి వారికి సందేహం కలిగి యున్నట్లయితే, ట్రంకుఫోన్‌లో వారు నాతో మాట్లాడ్డమో, లేక మళ్లీ టెలిగ్రాం యివ్వడమో చేసి యుండవలసింది. నా ఆలోచన ఒక్కటే, వర్కింగ్ కమిటీ సభ్యులందరి చేతను అంగీకరించ బడిన తీర్మానాలే తయారు చేసి, కాంగ్రెసు సమావేశంలో ప్రతిపాదించాలని మొదటినుంచీ నా అభిప్రాయం.

ఆవిధంగా జరగకపోతే విషయ నిర్ణయ సభలో "అఫీషియల్" తీర్మానాలమీద వేర్వేరు వర్కింగ్‌కమిటీ మెంబర్లు వేర్వేరు మాదిరి దృక్పథాలను కలిగియుండే ప్రమాదం తటస్థించవచ్చు. వర్కింగ్ కమిటీలో చిత్తుతీర్మానాలను తయారు చేసేటప్పుడు యిట్టి ఏకగ్రీవాభిప్రాయానికి రావాలంటే నేనుకూడా అక్కడ ఉండడం అవసరం. కనుకనే వర్కింగ్ కమిటీ సమావేశాన్ని త్రిపురీవరకూ వాయిదా వేయవలసిందని నేను కోరాను. 12 గురు (లేక 13 గురు) సభ్యులు రాజీనామాలిచ్చి యీవిధంగా బాంబు విసరకపోయి ఉన్నట్లయితే, నా సూచన ఎంతో చక్కగా ఆచరణలో పెట్టబడియుండేది.

స్టేట్‌మెంట్లమీద స్టేట్‌మెంట్లు.

ఏలాగైనా నేను త్రిపురీ కాంగ్రెసుకు వెళ్ళడానికి తగిన దారుఢ్యం కలుగజేయడానికి డాక్టర్లు కృషిసల్పుతున్నారు. నీలరత్నసర్కార్ మాత్రం త్రిపురీ కాంగ్రెసుకు వెళ్లకూడదని పట్టుపట్టాడు. నేను డాక్టర్లతో వాదించాను. చివరకి, నాలో ప్రాణం ఉండగా త్రిపురీకి వెళ్ళడం మాననని స్పష్టంగా చెప్పివేశాను. దేశం యొక్క యీ క్లిష్టదశలో వెళ్ళితీరాలి అని పట్టుపట్టాను. పాపం డాక్టర్లుకూడా నన్ను కాంగ్రెసుకు వెళ్లేటట్లు చేయడంలో శక్తివంచన లేకుండా పని చేశారు. వారందుకి నేను కృతజ్ఞుణ్ణి.

అతిక్లిష్ట పరిస్థితుల్లో వచ్చింది నాకు జబ్బు. శారీకంగాను, మానసికంగాను, విశ్రాంతి తీసుకోవడం అసాధ్యమైంది. వర్కింగు కమిటీ మెంబర్ల రాజీనామాలు క్లిష్టతను మరింత ఎక్కువ చేశాయి. నన్నెదుర్కొంటూ స్టేట్‌మెంట్లమీద స్టేట్‌మెంట్లు ప్రకటించబడుతున్నాయి, అన్నింటికంటే ఘోరం యేమంటే, నేను అనుకోని వ్యక్తినుంచే అట్టి స్టేట్‌మెంటు వచ్చింది.

దొంగ జబ్బు

.... నా చిక్కులు ఏ విధంగా తీవ్ర రూపాన్ని దాల్చాయో చెప్పుతాను. ఫిబ్రవరి 17 న వార్ధానుండి కలకత్తాకు జ్వరంతో తిరిగి వచ్చాక, నాజబ్బు దొంగ జబ్బులనీ, వర్కింగ్ కమిటీకి వెళ్ళకుండా ఉండడానికి యీ 'రాజకీయపు జ్వరాన్ని' నేను కొనితెచ్చుకున్నాననీ కొందరు ప్రచారం ప్రారంభించారు. అనేక రాష్ట్రాల నుంచి మిత్రులు కొందరు యీవిషయాన్ని గురించి నాకు వ్రాశారు. అట్టి ప్రచారం వట్టి అబద్ధం అని నేను నమ్మలేను. నీలరత్న సర్కార్ ప్రకటించిన బుల్లెటిన్‌కూడా అట్టి ప్రచారాన్ని ఆపలేక పోయిందంటే, స్వార్థపరులు ఎంత బుద్ధిపూర్వకంగాను, కుటిల బుద్ధితోను యీ దుష్ప్రచారం గావించారో బోధపడుతోంది జబ్బల్‌పూర్‌లోను, త్రిపురీలోనూకూడా యిట్టిప్రచారమే సాగింది. మార్చి 6 వ తేదీ సాయంకాలం 4 గంటలకు నేను జబ్బల్‌పూర్ వచ్చేసరికి నా టెంపరేచర్ 101 డిగ్రీలు త్రిపురీలోదిగి, అంబ్యులెన్సు కార్లో ప్రయాణంచేసి, నాక్యాంపు జేరుకొనేసరికి 103 డిగ్రీలకు హెచ్చింది జ్వరం. త్రిపురీకి వెళ్లగానే, సన్మాన సంఘంవారిచే నియమించబడిన డాక్టర్లు నాకు చికిత్స ప్రరంభించారు.

ఒక డాక్టరు నన్ను పరీక్షచేసి, రెండవ డాక్టరువైపు చూచాడు అర్థసహితమైన కళ్ళతో. వెంటనే యీదృశ్యం నాకు కొత్తగాకనపడింది. రెండురోజుల తర్వాత కథ అంతా తెలుసుకున్నాను. నిజంగా నాకు జబ్బులేదని త్రిపురీలో ప్రతివానికి చెప్పివేశారు. ఈప్రచారం డాక్టర్లలో కూడా చేయబడింది. నేను త్రిపురీకి వెళ్ళగానే వారు నన్ను పరీక్షచేసి, నాజబ్బు నిజంగా తీవ్రస్వభావాన్నే కలిగియుండడం కనిపెట్టారు. వెంటనే వారికి ఆశ్చర్యం కలిగింది, విషపూరితమైన ప్రచారం గావించబడటం చూచి వారు కోపోద్దీపితులయారు, నా జ్వరాన్ని గురించి వారు ప్రకటించే బుల్లెటన్లు కూడా అబద్ధమేనని ప్రచారం సాగుతోంటే, వారికోపం మరింత ఎక్కువయింది. ఒక చిన్న ఉదాహరణ: వర్కింగు కమిటీలో ఒక ప్రధాన సభ్యుడు ఒకరోజున ఒక సన్మానసంఘపు డాక్టరును పిలిచి, నిజంగా నాకు 102 డిగ్రీల జ్వరం ఉన్నదా అని ప్రశ్నించాడట. "స్వయంగానే టెంపరేచర్ తీసుకున్నావా" అని మళ్లీ ప్రశ్నించాడట. నాజ్వరం నిజమైన జ్వరమేనని హేమాహేమీలుకూడా విశ్వసించడంలేనట్లు నిష్పాక్షికమైన రిపోర్టులు అనేకం వచ్చేవి నావద్దకు. సన్మాన సంఘపు డాక్టర్లు యిక కోపం ఆపుకోలేకపోయారు. సంయుక్త పరగణాల సివిల్ ఆసుపత్రులకు అధికారి అయిన ఇన్‌స్పెక్టరు జనరల్, సంయుక్త పరగణాలకు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్తు, జబ్బల్పూరు సివిల్‌సర్జన్, వీరితోకూడిన మెడికల్‌బోర్డుకు యీడాక్టర్లు కబురుచేశారు.

వీరి సంయుక్తస్టేట్‌మెంటు ప్రకటించబడ్డాక, వాతావరణంలో కొంత మార్పు కనపడింది. కాని, యీ ఉన్నతోద్యోగుల్ని రప్పించడం వల్ల వచ్చిన ఫలితం ఏమంటే, నేను కాంగ్రెసు యొక్క బహిరంగ సమావేశానికి హాజరు కాకుండా చేయబడ్డాను, ఏదో విధంగా సన్మాన సంఘపు డాక్టర్లకు నచ్చజెప్పి సమావేశానికి వెళ్లగలిగియుండేవాణ్ణి. కాని, ఆ అధికారులవద్ద యిది సాధ్యం అయిందికాదు. వారు తమ రిపోర్టు యిచ్చేముందు వారి అభిప్రాయాన్ని నేను విశ్వసించి, వారి సలహాను పాటించేదీ, లేనిదీ తెలియజేయమన్నారు. వారు మంచి యుక్తివంతులు. సహజంగానేను 'సరే' నని జవాబివ్వవలసి వచ్చింది. కాంగ్రెసుయొక్క బహిరంగ సమావేశానికి వెళ్లకూడదని అప్పుడువారు నన్ను బంధించవేశారు. నాకొరకు సన్మాన సంఘంవారు (మిగతా 20 పేజీలో

42 దినాలనుండి ఉప్పుమాల్ కూలీల సమ్మె

కాకినాడ

పీచు కూలీల సమ్మె 26 దినములు

రోజు రోజు క్రొత్త మార్పులతో సమ్మెలు రెండూ శాంతియుతంగా సాగుచున్నవి. సాల్టు ఫ్యాక్టరీ యజమానులు, పీచు వర్తకులు చతుర్విధోపాయములచేతను సమ్మెలు చెడగొట్టుటకై చేయుచున్న విశ్వ ప్రయత్నాలను, సోషలిస్టులు సక్రమపద్ధతితో ఎదుర్కొనుచున్నారు. ఊరేగింపుల వెంబడి 8 గురు పోలీసులు, ప్రతి కొట్టు దగ్గర యిద్దరిద్దరు పోలీసులు కాపలా యుంటున్నారు.

యజమానులు కూలీలను మాయచేసి త్రాగించి తీసుకు వెళ్ళి పనిచేయ బూనిరి. అట్లు వెళ్ళినవారు నిషావదలగనే ఈవలకువచ్చి తాము చేసిన తప్పు సంఘమునకు వ్రాత మూలముగ యిచ్చి సమ్మెలో చేరిరి.

పీచు కూలీల సంఘమునుండి 44 గురు స్త్రీలు, 40 మంది పురుషులు గల వాలంటీరు దళము ఏర్పాటు చేయబడెను. పగలు స్త్రీ వాలంటీర్లు, రాత్రులు పురుష వాలంటీర్లు పీచుకొట్లువద్ద "సెంట్రీ" యిస్తున్నారు.

పీచు వర్తకులు రౌడీలను త్రాగించి కాపలాయున్న వాలంటీర్లను, సోషలిస్టులను కొట్టించుటకు అనేకప్రయత్నములను చేయుచున్నారు.

విశాఖపట్నంజిల్లా, ఎలమంచిలి, అనకాపల్లి మొదలయిన గ్రామాలలో పీచుపని చేయుటకై యజమానులు ప్రయత్నిస్తూంటే కొందరు సోషలిస్టులను అచటికి పంపి అచ్చట బ్రహ్మాండమయిన ప్రచారాన్ని కూలీలలో మొదలెట్టారు. అచ్చటకూడ కూలీలు సమ్మె జేస్తారని వార్తలు వస్తున్నాయి. ఈ విషయము తెలసికొన్న అచ్చటి పీచువర్తకులలో కలవరం బయలుదేరింది.

ఉప్పుమాల్ కూలీలు గూడా చాల పట్టుదలతో నున్నారు. యజమానులు పనివారలలో చీలికలు కలిగించాలని ప్రయత్నించి విఫలులయ్యారు. సమ్మె తీవ్రంగా సాగుతూనే ఉన్నది.

కార్మికులు మాత్రం చాల గట్టిగా నిలబడ్డారు. ప్రతిరోజూ బ్రహ్మాండమయిన ఊరేగింపులు సభలు సాగుతున్నాయి.

తెనాలి

తెనాలి లక్ష్మీప్రెస్ సమ్మె 20 రోజులనుంచి సాగుచున్నది. ముగ్గురు నలుగురు పనివారలు మాత్రమే పని చేసి మానినన్నట్లు తెలియుచున్నది. 26—3—39 వ తేదీన స్థానిక సోషలిస్టు పార్టీ, ప్రెస్‌వర్కర్సు యూనియనుల ఆధిపత్యము క్రింద గొప్ప ఊరేగింపు, బహిరంగ సభ జరిగినది. ఈఊరేగింపులో సంఘద్రోహి (Black leg) బొమ్మ తయారుచేసి వీధులందు ప్రదర్శించిరి.

విజ్ఞప్తి

తెనాలి లక్ష్మీప్రెస్ లాక్—అవుట్ మార్చి 11 వ తేదీ నుంచి నేటివరకు సాగుతున్నది. ఈ లాకౌట్ మూలముగా 40 మంది పనివారు అమాంతంగా పూర్తిగా నిరుద్యోగులయిరి. పనివారలు ధైర్యముతో నిరుత్సాహము చెందక పట్టుదలతో వారి కనీస కోర్కెలను నిలబెట్టుకొనుటకు పోరాడుతున్నారు.

40 మందిని నిరుద్యోగానికి గురిచేసిన ఈలాకౌట్ కు కారణాలేమిటో చూడవలసి ఉంటుంది. లక్ష్మీప్రెస్ యజమానులు మార్చి 11 వ తేదీన 11 షరతులతో కూడిన అచ్చుపత్రాలను హఠాత్తుగా పనివారి ముందర పెట్టి వాటిమీద సంతకాలు పెట్టమన్నారు. వారి యూనియన్‌లో వాటినిగురించి ఆలోచించుకొని ఒక నిర్ణయానికి వచ్చుటకు కూడ వ్యవధి యేమి యియ్యలేదు ఈ కొత్త షరతులు తమను మరింత కష్టాలపాలు గావిస్తవని గ్రహించి ప్నవారు వాటిక్రింద సంతకాలు పెట్ట నిరాకరించారు. దానిఫలితంగా ఉన్న ప్నవారినందర్నీ మా కవసరం లేదని పనిలోనుంచి వెళ్ళగొట్టారు.

యజమానులు పెట్టిన యీ 11 షరతులు, కొద్దిపాటివి మినహా మొత్తముమీద ప్నవారలకు పూర్తిగా హానికరము. పనివారు అదివరకు యేవయినా కొద్దిపాటి అవకాశము అనుభవిస్తుంటె వాటిని కూడా నాశనము చేస్తవి. పనివారలకు సర్వీసు గ్యారంటి, తగిన సెలవుల యేర్పాటు, ప్రమోషన్లు, సరియైన జీతాల విషయము తలపెట్టకుండా యీ కటినమైన, హానికరమయినషర్తులను పనివారలపై రుద్దాలనుకోటం పూర్తిగా అక్రమం.

స్వాతంత్ర్యమునకు పోరాడు కాంగ్రెసు మొదలగు ప్రజా సంఘాలన్ని వారి పోరాటాన్ని ప్రోత్సహించాలి. వారికి సానుభూతిగా రాష్ట్రం అంతటా ఆందోళన సభలు జరపాలి. పూర్తి ఆర్థిక సహాయము చెయ్యాలి. ముఖ్యంగా జిల్లా కాంగ్రెసు కమిటీ, స్థానిక పట్టణ కాంగ్రెసు కమిటీ తెనాలి పనివారల పోరాటాన్ని జయప్రద మొనర్చి వారి హక్కులు నెరవేరేటట్టు చూచి యజమానుల దౌష్ట్యము అణగిపోయేట్టు చూడవలెను.

తెనాలి,
31-3-39.

(Sd) పులుపుల శివయ్య, కార్యదర్శి.
గుంటూరుజిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ.
పి. నరసింహమూర్తి, సభ్యుడు,
ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టుపార్టీ
కార్యనిర్వాహక వర్గం.

కార్మిక సమస్యలు

ఆంధ్రరాష్ట్ర కార్మిక మహాసభ

పి. వేంకట్రావు యీ సభ ఆహ్వాన సంఘం కార్యదర్శిగారు యిట్లు వ్రాయుచున్నారు.

ఆంధ్ర రాష్ట్ర కార్మిక మహాసభ ఏప్రెల్ 8, 9 తేదీలలో నెల్లిమర్లలో జరుగును. గౌరవనీయులు వి. వి. గిరిగారు సభా ప్రారంభోత్సవము జరుపుదురు. శ్రీ వి. ఆర్. కాలప్ప, మధ్య రాష్ట్ర కార్మిక శాసన సభ్యులు అధ్యక్షత వహించెదరు. ఇతర ప్రముఖ కార్మిక నాయకులుకూడా ఆహ్వానింపబడిరి. ఆంధ్రరాష్ట్ర కార్మికులందరు యీ మహాసభ జయప్రదమగుటకు తోడ్పడ గోరెదను. సంఘములన్నియు 50 మంది సభ్యులకు ఒక ప్రతినిధి చొప్పున ఎన్నుకొని మహాసభకు పంపవలెను. ప్రతినిధుల పేర్లు, ప్రతినిధులు మహాసభలో పెట్టదలచు కొన్న తీర్మానములు ఏప్రిలు ఆరవ తేదీ సరికి ఆహ్వాన సంఘ కార్యాలయమునకు పంపకోరెదను.

ప్రెస్‌వర్కర్ల తీర్మానాలు

ఆంధ్రరాష్ట్ర ప్రెస్ వర్కర్సు యూనియన్ కార్యనిర్వాహకవర్గ సమావేశము కామ్రేడ్ యం. కోటయ్యగారి అధ్యక్షతను తెనాలి ప్రెస్‌వర్కర్సు యూనియన్ ఆఫీసులో సమావేశమై ఈ క్రింది తీర్మానములు గావించినది.

జమాఖర్చులు పరిశీలించిన తరువాత ఆమోదింపబడినవి. స్థానిక సంఘములు రిపోర్టు, జమా ఖర్చు ప్రతినెలా పంపుతూ వుండాలని హెచ్చరించిరి. మే డే జయప్రదముగా జరుపుటకు కనీసము వారము రోజుల నుంచి కరపత్రములు బహిరంగసభల ద్వారా ప్రచారం గావించాలని మేడేరోజున ఊరేగింపు—బహిరంగసభలు జరపాలని తీర్మానించిరి.

తెనాలి లక్ష్మీప్రెస్ కార్మికులు యజమానుల దాడిని ఎదుర్కొనుచున్నందుకు అభినందించుచూ ప్రతి పట్టణములోని స్థానికసంఘములు పనివారల నెవ్వరిని తెనాలి లక్ష్మీప్రెస్‌కు వెళ్ళకుండునట్లు చెయ్యాలని వారమునకొక బహిరంగసభ జరపాలని స్థానిక సంఘములు కనీసము రు. 5—0—0 లు విరాళములు తెనాలి ప్రెస్ వర్కర్సు యూనియన్ కార్యదర్శి కె. నారాయణస్వామి, ఓరియంటల్ ప్రెస్‌కు పంపాలని కోరుచున్నాము.

కాశీపట్టణ రైతులు జమీందారునుండి తమ భూమి హక్కును కాపాడుకొనుటకు సత్యాగ్రహము చేసినందులకు యభినందించుచూ మద్రాసు మంత్రివర్గము భూమి హక్కు రైతులకు నిలబడేటట్లు చెయ్యాలని కోరుచూ రాష్ట్ర ప్రెస్‌వర్కర్సు యూనియన్ తరపున కాశీపట్టణ రైతుల సహాయార్థము రు. 10—0—0 లు విరాళము పంపాలని అందుకు ప్రతి కార్యనిర్వాహక సభ్యుడు కనీసము ఒక రూపాయి ఈ నెలాఖరులోగా బెజవాడ ఆఫీసుకు పంపాలని కోరుచున్నాను.

చిట్టివలస కార్మికులపై తుపాకులు కాల్చిన పోలీసు వుద్యోగస్తుల చర్యను ఖండించుచూ ప్రభుత్వము ఆ పోలీసుల చర్యను సమర్థించినందులకు నిరశించుచూ, చనిపోయిన కార్మికుని కుటుంబమునకు నష్టపరిహారం యిప్పించవలెనని కోరుచున్నాము.

ధైర్యోత్సాహములతో కాకినాడ పీచు వుప్పుమాల్ కార్మికులు సమ్మె చేసినందులకు వారిని యభినందించుచూ, ప్రభుత్వము యజమానులమీద ఒత్తిడి కలిగించి కార్మికుల కోర్కెలు అంగీకరించునట్టు చెయ్యాలని కోరుచున్నాము.

మద్రాసు రాష్ట్రములోని మధుర, కోయంబత్తూరు, మద్రాసు టెక్స్‌టయిలు కేంద్రములందు కార్మికులు సమ్మె చేయుచున్నందులకు అభినందించుచూ, ప్రస్తుతము మంత్రివర్గము కార్మిక సంఘర్షణాలపట్ల అవలంభించుచున్న విధానము ముఖ్యంగా కార్మిలను అరెస్టు చేయటము, వూరేగింపులకు లైసెన్సు పొందాలనటము కార్మికులకు నష్టము కలిగించి పెట్టుబడిదారులకు సహాయ పడుచున్నది. కాన ఆ విధానమును మార్చుకొనవలెనని మంత్రివర్గమును కోరుచున్నాము.

నెల్లిమర్లలో జరుగనున్న ఆంధ్రరాష్ట్ర లేబరు కాన్ఫరెన్సుయందు పాల్గొనుటకు తీర్మానించున్నాము.

ఇట్లు,
యం. మల్లిఖార్జునరెడ్డి,
సహాయ కార్యదర్శి

గుంటూరు జిల్లా సోషలిస్టు పార్టీ మహాసభ

(29—3—39)

గుంటూరుజిల్లా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ మహాసభ గుంటూరు టౌనుహాలులో కామ్రేడ్ వావిలాల గోపాలకృష్ణయ్యగారి అధ్యక్షత క్రింద జరిగింది.

కార్యదర్శి వార్షిక నివేదికను ఇచ్చినమీదట ఫెడరేషన్ ప్రతికూల ప్రచారమును, త్రిపురీ కాంగ్రెసు జాతీయ వాంఛాతీర్మానమును అమలు జరుపు విషయమై రాష్ట్రీకాంగ్రెసు సోషలిస్టు పార్టీవారు ఇచ్చిన కార్యక్రమమును నిర్వర్తించుటకుగాను జిల్లాలోని తాలూకా పార్టీలన్నీ ఏర్పాటుచేసి ఏప్రిలు 7 వ తారీకునుంచి ప్రచారం చేయాలని మేనెలలో వేసంగి పాఠశాలలు 4 రివిన్యూ డివిజనులకు నాలుగింటిని నడుపవలెనని తీర్మానింపబడినది.

తరువాత ఈ క్రింది తీర్మానాలామోదింపబడ్డవి.

1. కామ్రేడ్ కృపాస్కయా (లెనిన్ సతి) తన జీవితాంతంవరకు విశ్వసేవకోసరమే పాటుపడి, లెనిన్ జీవితమంతా సహచారికిగా ఉండి. అతనిని ప్రోత్సహిస్తు కార్మిక కర్షక కళ్యాణానికి జీవితం ధారపోసి ఈమధ్యనే మరణించినందుకు ఈసభవారు సంతాపపడు తున్నారు.

2. కాశీపట్నానికి రివిన్యూమంత్రి ప్రకాశంగారువెళ్లి అచ్చటి రైతుల కష్టములను విచారించి వారికి తగిన సహాయంచేస్తానని చెప్పినప్పటికీ, "తప్పుడు సలహాతో, తొందరపాటుతో సాగించబడిన కాశీపట్నం రైతు సత్యాగ్రహాన్ని నిరసించుతున్నామని, ఆసత్యాగ్రహంలోపాల్గొనిన కాంగ్రెసు వర్కర్ల దగ్గరనుంచి సంజాయిషీ తీసుకొనుటకు రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శిని నియమించామని" చేయబడిన రాష్ట్ర కాంగ్రెసు వర్కింగు కమిటీవారి తీర్మానం, పురాతనం నుండి రామనుభవిస్తున్న కనీసపు కోర్కెలకొరకు పోరాడుతూ ప్రభుత్వపు క్రూర నిర్బంధవిధానాన్ని. జమీందారుయొక్క అన్యాయపు దోపిడిని నిరుత్సాహపరచి కాంగ్రెసు నుంచి రైతు ప్రజాసామాన్యాన్ని. రైతు ఉద్యమాన్ని వేరుచేసి, కాంగ్రెసు నడుపుతున్న స్వాతంత్ర్య పోరాటాన్ని బలహీనపరుచును. అంతేకాకుండ రాష్ట్రంవారి ఈతీర్మానం రైతు సంఘాలను గుర్తిస్తూ చేయబడ్డ ఫెయిజాపూరు హరిపుర కాంగ్రెసు తీర్మానాలకు పూర్తి భిన్నముగానున్నది. కనుక ఈతీర్మానమును కావించిన రాష్ట్ర కాంగ్రెసు కమిటీవారి వైఖరిపట్ల పూర్తి అసంతృప్తిని ఈ సభవారు వెలిబుచ్చుచు కాశీపట్నం రైతుల సత్యాగ్రహానికి పూర్తిప్రోత్సాహం యివ్వవలెనని కోరుచున్నారు. కాంగ్రెసు వర్కర్లకు ఏవిధమైన అడ్డంకులు, నిరుత్సాహము, క్రమశిక్షణచర్యల భయము కలుగకుండా రాష్ట్ర కాంగ్రెసు కమిటీవారు, రైతు ఉద్యమంలో పాల్గొనటం ద్వారా రాష్ట్రంలోని రైతు ఉద్యమానికి కాంగ్రెసుకు సన్నిహితమైన సామరస్యపు సంబంధాలను పెంపు చేసుకోటం స్వాతంత్ర్య ఉద్యమానికి అత్యవసరం. కాబట్టి కాశీపట్నం రైతు సత్యాగ్రహంలో పాల్గొనిన కాంగ్రెసు వర్కర్లనుంచి సంజాయిషీ తీసుకోవాలనే యత్నం మానుకొని వారికి తగిన సహాయం చేయవలెనని రాష్ట్రకాంగ్రెసు వారిని కోరుచున్నారు.

రైతులపై లాఠీచార్జీలు, అరెస్టు, శిక్షల ప్రయోగించిన పశ్చిమగోదావరి జిల్లాకలెక్టరునే అచ్చటి (కాశీపట్నం) రైతు జమీందారుమధ్య వచ్చిన తగాదాను ఎంక్వైరీచేయుటకు కాంగ్రెసు మంత్రివర్గం నియమించటం ఘోరంగా ఉన్నదనీ అభిప్రాయపడుచు, ఒక నిష్పాక్షిక కమిటీ ద్వారా ఎంక్వైరీ నడపవలసినదని మంత్రివర్గమును కోరుచున్నారు.

3. చిట్టివలసకార్మికులు:—చిట్టివలస జనపనారమిల్లులలో సమ్మెజేస్తున్న (Stay-in-Strike) కార్మికులను అర్ధరాత్రివేళ. దీపాలార్పి, గేట్లుమూసి, తుపాకులతో కాల్చి, లాఠీలతో కొట్టిన పోలీసు అధికారుల చర్యలను ఖండించుచున్నాము.

కార్మికుల కష్టాలను, యజమానుల దుండగాలను, సమ్మెకుగల ఇతరకారణాలను గమనింపక, కాంగ్రెసు మంత్రివర్గము, సమ్మెను ఖండిస్తూ పోలీసు కాల్పులను సమర్థించుచు ఇచ్చిన కమ్యునిక్కు. ప్రజలతరపున ఉండవలసిన కాంగ్రెసు మంత్రివర్గానికి తగదని అభిప్రాయపడుచున్నాము.

సమ్మెలో పాల్గొని. ధైర్యముగా పోరాడి లెక్కలేని త్యాగంచేసిన కార్మికులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాము

4. పనివారిని మరింత నష్టపరచు క్రూర నిబంధనలకు సమ్మతింపలేదను మిషమీద తెనాలి లక్ష్మీప్రెస్ యజమానులు లాకవుట్ ప్రారంభించి 40 మంది పనివారిని 12 వ తేదీ నుంచి నిరుద్యోగులనుగా చేసినందుకు వారి చర్యను తీవ్రముగా ఈసభవారు ఖండించుచు

అన్నిబాధలను లోనగుతూకూడ ప్రెస్సుయజమానుల అన్యాయాలను తీవ్రంగా ప్రతిఘటిస్తున్న వర్కర్లను అభినందిస్తూ, వారల ఆర్థిక సహాయానికి, జిల్లాపార్టీశాఖలు డబ్బువసూలు చేసి వారికి అనుకూలముగా ఆందోళన సభలు జరుపవలెను.

6 మంగళగిరి క్రిష్ణా సిమెంటు వర్క్సు కూలీలపైనున్న క్రిమినల్ కేసులను వెంటనే ఉపసంహరించుకొనమని గవర్నమెంటువారిని కోరుచున్నాము.

7. తోగడ జిల్లా పార్టి కార్యనిర్వాహక వర్గం యిచ్చిన జిల్లాబోర్డు కార్యక్రమమును జిల్లాపార్టి శాఖలు. పార్టి సభ్యులు అందరు అన్నిప్రాంతాల ప్రచారముచేస్తూ ఆ ప్రచారములో స్థానిక కాంగ్రెసు కమిటీలు, జిల్లాబోర్డు ప్రతినిధులు పాల్గొంటూ ఉండేటట్లు చూడవలెను

జిల్లాబోర్డు సభ్యులుగానున్న పార్టిసభ్యులు ఆ కార్యక్రమమును, తమయొక్క నియోజకవర్గాల్లో ప్రచారముగావిస్తూ జిల్లాబోర్డు కాంగ్రెసు పార్టిలో, జిల్లాబోర్డులో నెగ్గేందుకు ప్రయత్నిస్తుండవలెను.

ఇంతవరకు రాష్ట్రకాంగ్రెసు కమిటీవారు ఒక నిర్ణీతమైన జిల్లాబోర్డు మొదలగు స్థానిక సంస్థలకు నిర్ణీతమైన కార్యక్రమమును ఇవ్వవలసిన అవసరమును గుర్తించనందుకు ఆశ్చర్యపడుతూ, ప్రజాహితమైన ఒక కార్యక్రమమును సత్వరంగా యివ్వవలసినదని ఈ సభవారు కోరుచున్నారు.

8. 1936 ఎస్టేట్ల ఎమెండుడు చట్టప్రకారం అగ్రహారం రైతులకు అగ్రహారపు భూములలో కుడివరం హక్కు యిచ్చినది. ఆ హక్కుల అనుభవం కొరకు ఇంతవరకు అగ్రహారందార్లతో రైతులు పోరాడుచున్నారు. కొంతమంది అగ్రహారందార్లతో రైతులు పోరాడుచున్నారు. కొంతమంది అగ్రహారందార్లు లొంగి 1936 చట్టప్రకారం తగాదా పరిష్కారం చేసుకొనినారు. కొంతమంది అగ్రహారీకులు రైతులకు హక్కులివ్వనందున రైతులు దావాలువేసికొనినారు.

ఇంతలోకే జమీందారీ విచారణ సంఘము రిపోర్టు వెనుక అగ్రహారం రైతు లిచ్చిన హక్కులు తీసివేయ సూచించింది. ఈరిపోర్టు చూచి అగ్రహారందారులు స్థానిక అధికారుల బలముతో రైతులను పొలములనుండి తరుమగొట్టుచున్నారు. భూములను బీళ్లపెట్టుచున్నారు.

రివిన్యూ మంత్రిగారు తమ సంచారములో ఎవరిహక్కులు వారికే ఉండునని చెప్పినారేగాని అగ్రహారం రైతులకు ఫలాన హక్కులిస్తామని చెప్పలేదు. కాబట్టి మంత్రివర్గం తమ బిల్లు ప్యాసు చేసేదాకా పాత ఆక్టుప్రకారం స్థానిక అలవాటుల ననుసరించి రైతులు ఎట్టి దావాలు వేయకుండానే కుడివరం హక్కును ఇప్పవలెను.

స్థానిక అధికారుల చర్యలపైన రిపోర్టులు రాగానే కాంగ్రెసు, కాంగ్రెసు సోషలిస్టు, రైతుసంఘ ప్రతినిధుల సహాయంతో జిల్లా అధికారుల విచారణ సలిపి, స్థానిక అధికారులపైన తగు చర్య తీసుకొనవలెనని ఈ సభవారు తీర్మానించుచున్నారు.

9. నూతన సంవత్సరమునకు ఈ క్రింది కార్యనిర్వాహకవర్గమును ఎన్నుకోవడమైనది.

1. కామ్రేడ్ పి. వి. శివయ్య, (ప్రధాన కార్యదర్శి)
2. „ వావిలాల గోపాలక్రిష్ణయ్య, (సహాయ కార్యదర్శి)
3. „ శ్రీ గిరిరాజు సత్యనారాయణ
4. „ ముత్తేవి మాధవాచారి
5. „ మాదల వీరభద్రరావు
6. „ లావు అంకమ్మ
7. „ కొడాలి అంజనేయులు
8. „ బాచిన సుబ్బారావు
9. „ యస్. వి. యల్. నరశింహం
10. „ చదలవాడ పిచ్చయ్య

★ ★ ★

ఆర్థిక రాజకీయ వేసంగి పాఠశాల

మే 1 నుండి జూను 1 వరకు

ఇచ్ఛాపురము.

స్వాతంత్ర్య పోరాటములో పాల్గొనుటకును జాతీయ, అంతర్జాతీయ సమస్యలను బాగుగా బోధచేసుకుని దేశములోని ప్రజాసామాన్యమునందు పనిచేయుటకు, విద్యావంతులును, సుశిక్షితులునైన యువజనులు వేనకువేలు తయారుకావలసియున్నది. కేవలము మానసికాభివృద్ధియేగాక దానితోబాటు శారీరికముగాకూడ శిక్షణ పొందుట చాలా అవసరం. ఇట్టి వారలను తయారు చేయుటకొరకే మేనెలలో, ఇచ్ఛాపురంలో ఆర్థిక రాజకీయ పాఠశాలను, వాలంటీరు శిక్షశిబిరమును నెలకొల్పబడుచున్నది. అఖిల భారత కిసాన్ సంఘాధ్యక్షులును, సుప్రసిద్ధ దేశనాయకులునైన స్వామి సహజానంద సరస్వతిగారు పాఠశాల ప్రారంభోత్సవము జరుప నంగీకరించినారు. దేశాభిమానులును, ఉదారవంతులగు ప్రజలంతా ధనరూపంగా, వస్తురూపంగా అన్నివిధములా యీ పాఠశాలకు తోడ్పడ ప్రార్థితులు. యువజనులంతా ఈ పాఠశాలలో శిక్షణపొందగోరుచున్నాము. ఈక్రింది ప్రధాన విషయములలో శిక్షణ యీయబడును. బొంబాయి, కలకత్తానుండి సుప్రసిద్ధనాయకులు ఉపన్యాసకులుగా పిలువబడ్డారు.

విషయములు

1. వివిధ రాజకీయ సిద్ధాంతాలు.
2. రాజ్యాంగ నిర్మాణాలు.
3. స్వాతంత్ర్యపోరాటముయొక్కచరిత్రలు.
4. కిసాను, కార్మిక సమస్యలు.
5. వాలంటీరు డ్రిల్లు.
6. వుపన్యాసము లిచ్చుట, చర్చలుచేయుట. వ్యాసరచన.

షరా : విద్యార్థులుగా చేరకోరువారు తమ ఖాసులలను రు. 10-0-0 రుసుముతో సహా ఏప్రెల్ 15 వ తేదీలోగా ఈక్రింది ఆడ్రసుకు పంపవలెను.

సి. సూర్యనారాయణ,
కూరెళ్లవారివీధి. విజయనగరం.
జి. కోటేశ్వరరావు.

ఇట్లు
సెక్రటరీ, ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్
ఆర్గనైజరు.
ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘము
జిల్లా కిసాన్ సంఘము
జిల్లా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ

★

మేనెల 1 వ తేదీనుండి జూన్ 1 వరకు విశాఖపట్నంజిల్లా ఇచ్ఛాపురంలో ఆంధ్రరాష్ట్ర విద్యార్థిఫెడరేషన్, విశాఖపట్నం జిల్లారైతు సంఘం, జిల్లా సోషలిస్టుపార్టీ యాజమాన్యమున ఆర్థికరాజకీయ వేసంగిపాఠశాల నడపబడును. స్వామి సహజానందసరస్వతి, అఖిల భారత కిసాన్ నాయకులు ప్రారంభోత్సవం చేస్తారు. మాలతీదేవి చౌదరి పతాకోత్సవం జరుపుతారు. ఈక్రింది నాయకులు ఉపన్యాసకులుగా వస్తారు, ఆచార్య రంగా, డాంగే (బొంబాయి) సోమనాథ్లాహరి (కలకత్తా) ప్రొఫెసర్ ముఖర్జీ (కలకత్తా), భారతీదేవి. (నిడుబ్రోలు) శనివారం సుబ్బారావు(కొవ్వూరు) గోపరాజు రామచంద్రరావు (బందరు) విజయకుమార్‌సిన్హా (కాన్పూరు) బటుకేశ్వరదత్తు, ఇంకా ప్రముఖులు. విద్యార్థిరుసుము రు 10-0-0 స్త్రీలకు, కుటుంబాలకు ప్రత్యేక వసతిగృహాలు. మిలిటరీడ్రిల్లు, మిలిటరీబాండు శిక్షణ ఇవ్వబడును.

ఇట్లు
జె రామలింగయ్య.

★ ★ ★

జిల్లా కాంగ్రెసుసంఘము, నెల్లూరు.

1939 సంవత్సరం ఏప్రిల్ నెల 6 వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కాంగ్రెస్ సామాన్య సంఘ సమావేశము నెల్లూరు టవున్‌లో పురమందిరమున జరుగును. అధ్యక్ష కార్యదర్శుల, కార్యనిర్వాహక వర్గపు. యెన్నికలు జరుగును. జిల్లాకాంగ్రెస్ సభ్యత్వపు రుసుము అర్ధరూపాయి చెల్లించవలెను.

నెల్లూరు, 26—3—39 } బొమ్మా శేషురెడ్డి, ప్రెసిడెంటు.

కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించాలి!

పత్రికాభిప్రాయాలు

కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించాలని ప్రారంభించే ఏఉద్యమానికైనా నేను నా సానుభూతి ప్రకటించుతున్నాను. నిషేధం అసమర్థనీయమైనది. వాక్సభా స్వాతంత్ర్యంపైన నిర్బంధం న్యాయమైనది కాదు.

ఎస్. ఎ. బ్రెల్వి
బొంబాయి క్రానికల్ సంపాదకుడు.

★

ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, బొంబాయి రివెన్యూమంత్రి "కమ్యూనిస్టు పార్టిపై నిషేధం తొలగించమని, ఇండియా ప్రభుత్వాన్ని. బొంబాయి ప్రభుత్వం రెకమెండ్ చేయడం, ప్రజాక్షేమానికి మంచిదికాదు." అని సమాధానమిచ్చారు.... ఈమాటలు పూర్వపు నిరంకుశ ప్రభుత్వం నోటినుండి వస్తే మేము ఆలోచించేవాళ్ళమేగాదు. కమ్యూనిస్టు పార్టి బహిరంగంగా హింసను ప్రేరేపించనంత కాలం. ప్రభుత్వం—ముఖ్యంగా ప్రజాప్రభుత్వం-కమ్యూనిస్టు పార్టిని నిషేధం క్రింద అట్టిపెట్టడానికి ఎట్టిహక్కూలేదు. నిషేధం ఉంచడం అంటే, భావస్వాతంత్ర్యాన్ని అరికట్టడమే అవుతుంది.

— బీహార్ హెరాల్డు

★

కమ్యూనిస్టుపార్టిపై నిషేధం, ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం, చాలా అక్రమం. పౌరస్వత్వ హక్కులను మనస్సులో పెట్టుకొని, స్వాతంత్ర ప్రియులందరకు, నేగావించే విజ్ఞప్తి ఏమిటంటే, ఈ విషయంలో ప్రభుత్వంపైన తగిన ఒత్తిడి తీసుకురావాలని ప్రార్థిస్తున్నాను.

— మొహమ్మద్ అషాన్
అల్హిలాల్ సంపాదకుడు

★

ఏకక్షవారుకాని, వారి అభిప్రాయముల నిరాఘాటముగ వెల్లడించుటకు, బ్రిటిషుఅధికారులు ఆటంకములు గల్పించుచున్నారని దేశమంతటా ప్రచారం గావించిన కాంగ్రెస్ కక్ష, పదవుల స్వీకరించగానే, అన్నికక్షలవారి చిక్కుల వదలించుట విధి....కమ్యూనిస్టులకు వాక్స్వాతంత్ర్యము గల్గించినంత మాత్రాన, అందరును కమ్యూనిస్టులుగ మారుదురని బొంబాయి మంత్రి మురార్జీ భావింపవచ్చునుగాని ఇతరు లెవరును ఇట్లు భావింపరు.

— త్రిలింగ

★

ప్రముఖుల అభిప్రాయాలు

ఎత్తుగడలు సంబంధించినంతవరకు కమ్యూనిస్టులతో ఏకీభవించక పోయినా, న్యాయతః కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగించవలెనని తీవ్రంగా కోరుచున్నాము.

—ఆలిబహద్దురుఖాన్, ఎం. ఎల్. ఎ.

కమ్యూనిస్టు పార్టీయు, దాని కమిటీలు, శాఖలు ఇండియా ప్రభుత్వంచేత 1934 లో లా అండ్ ఆర్డర్‌కు భంగకరంగా ప్రవర్తించుచున్నవని నిషేధింపబడినాయి. 1930—34 మధ్య, అనేకసంఘాలు (అందులో కాంగ్రెస్ కమిటీలు కూడా ఉన్నాయి.) అదే వంకమీద నిషేధింపబడినదియు, 1937 ఎన్నికల అనంతరం, మంత్రివర్గా లేర్పడిన అనంతరం, అనేక సంఘాలపైన నిషేధం తొలగింపబడినయి. కాంగ్రెసు మంత్రులు, ఇనీషియేటివ్ తీసుకొని నిషేధం తొలగించుటవలన ఇతర మంత్రివర్గాలుకూడ కొన్ని సంఘాలపై నిషేధం తొలగించవలసివచ్చింది.

కాని దురదృష్టవశాత్తు, కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగించే ప్రయత్నమేమీ చేయలేదు. ఏ ప్రజాస్వామ్య ప్రభుత్వము క్రిందనైనా, ప్రతిసంఘమూ, తన ఆశయాలను బహిరంగంగా చాటుకొనే హక్కులలో సంఘ స్వాతంత్ర్యం ముఖ్యమని భావిస్తాం. అందుచేత కమ్యూనిస్టు పార్టీ తన అభిప్రాయాలు బహిరంగంగా ప్రచారమొనర్చుకొనే హక్కు, అవకాశముండాలి.

అందుచే పౌరస్వత్వ హక్కులను సమర్థించే ప్రతివారినీ మేం కోరేదేమిటంటే కమ్యూనిస్టు పార్టిపై నిషేధం తొలగించాలను ఆందోళనకు తగిన సహాయం చేయమని.

ఇట్లు

దక్షిణ రంజనగుప్తా. యం. ఏ., బి. యల్. యం. యల్. ఏ.
కరుణా సింధురాయ్. యం. యల్. ఎ.
(ప్రెసిడెంటు, సునాంగంజ్ సబ్‌డివిజనల్ కాంగ్రెసు కమిటీ)
బినోదీ విహారి చక్రవర్తి (ఎడిటర్, జనశక్తి)
నీరేంద్రనాధదేవ్ బి. యల్.
హరేంద్ర నారాయనచౌదరీ యం. యల్. ఏ.
(అస్సాం అసెంబ్లీ కాంగ్రెస్‌పార్టి విప్)
జనేంద్రనాధ దార్
వుపేంద్రచంద్ర భద్రా
బిరేషచంద్రమిశ్రా
(ఎ ఐ. సి. సి. మెంబరు, సిల్హైట్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి)
సుబోధచంద్ర దత్తా
(చహార్ జిల్లా కాంగ్రెస్‌కమిటీ కార్యదర్శి)
లాలా శరదిందు దే
(ఎ. ఐ. సి. సి. మెంబరు)
చిత్తరంజనదాస్
(సుర్మావాలీ రాష్ట్ర సోషలిస్టు పార్టి సంయుక్త కార్యదర్శి)
సురేషచంద్రదేవ్ (ఏ. ఐ. సి. సి. మెంబరు)
ప్రబోధానందకార్
(సిల్హైట్‌జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు)
సత్యవ్రత దత్తా,
(సుర్మాలీ స్టూడెంట్సు ఫెడరేషన్ అధ్యక్షుడు)
సరలబాలదేవి
(సిల్హైట్ మహిళాసంఘ కార్యదర్శిని)
అబలాకాంత గుప్త
డాక్టర్ బి. భట్టాచార్య
(దాక్‌చార్ డిస్ట్రిక్టు సోషలిస్టు పార్టి)
చంద్ర బినోదదాస్ యం ఎ బి యల్.
(సెక్రటరీ, సునాంగంజి సబ్‌డివిజనల్ కాంగ్రెస్ కమిటీ)
సురేషచంద్ర బిశ్వాస్
(హబ్రిగంజ్ సబ్‌డివిజనల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు)
జోతిర్మ్మయనంది
(నయాదునియా సంపాదకులు)
నగీంద్ర చంద్రశ్యామ్ బి. యల్.
(సుర్మా సంపాదకులు)
సుబోధ కుమార రాయ్
(పల్లిజానీ సంపాదకులు. సుర్మావాల్లీ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోషియేషన్ కార్యదర్శి)
శాంతకుమార్‌దాస్
బరీన్ దత్త్
(సిల్హైట్ కాదర్ చాబాబగన్ మజదూర్ యూనియన్ కార్యదర్శి)
దగెన్‌దాస్ గుప్తా
దినేష చౌదరీ
(ఆలిండియా స్టూడెంట్సు ఫెడరేషన్ వర్కింగుకమిటీ మెంబరు)
సుజాత్‌పాల్ చౌదరీ
(సుర్మావాల్లీ యువజనసంఘ సహాయ కార్యదర్శి)
అచింత్య భట్టాచార్య
(సిల్చార్ సబ్‌డివిజనల్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి)
కాశీప్రసన్నదాస్
(బాలక సంపాదకులు)
మహితోష్ పూర్‌కాయస్థ
(సుర్మావాల్లీ స్టూడెంట్సు ఫెడరేషన్ జనరల్ కార్యదర్శి)
[వీరందరూ అస్సాం వాస్తవ్యులు]

ఆంధ్రదేశంలో సభలు

నంద్యాల

కామ్రేడ్ డి. కె. నాగరాజారావు ఎం. ఏ. బి. యల్., గారి అధ్యక్షతను సభ జరిగింది. కమ్యూనిస్టు పార్టిపై నిషేధం తొలగించాలని కోరుతూ తీర్మానం చేయబడింది.

రాజమండ్రి

సిటీసోషలిస్టుపార్టీ యాజమాన్యాన శ్రద్ధానందఘాట్‌లో బహిరంగసభ జరిగింది. కాట్నా సీతారామయ్యగారధ్యక్షత వహించారు. పెన్మెత్స సూర్యనారాయణ రాజుగారు, మామిడి అప్పారావుగారు, కమ్యూనిస్టుపార్టీని గురించి విశదీకరించారు. పార్టీపై నిషేధం తొలగించాలని కోరుతూ తీర్మానం ప్యాసయింది.

కొడమంచిలి

నెక్కంటి సత్యనారాయణమూర్తిగారి అధ్యక్షతక్రింద జరిగిన బహిరంగసభలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధంతొలగించాలని కోరుతూ తీర్మానం గావించబడింది.

గుడివాడ

పెండ్యాల భవానీ శంకరరావుగారి అధ్యక్షత క్రింద జరిగిన బహిరంగసభలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించవలెనని కోరుతూ తీర్మానం గావించబడింది.

ఇందుపూరు

ఇందుపూరు గ్రామరైతు. కూలి, కాంగ్రెసు సంఘాల యాజమాన్యాన జరిగిన బహిరంగ సభలో కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగించాలని కోరుతూ తీర్మానం గావించబడింది.

గుంటూరు

జిల్లాసోషలిస్టుపార్టి కాన్ఫరెన్సులో ఈక్రింది తీర్మానం గావించబడింది.

"ప్రస్తుత అంతర్జాతీయ విషమ పరిస్థితులలో ప్రజాస్వామ్యాని కండయై నాజీ ఫేసిస్టుల దురాక్రమణ పద్ధతి నరికట్టి శాంతిని కాపాడుటకై వివిధదేశాలలోని కమ్యూనిస్టు పార్టీలు అగ్రస్థానం వహించి పనిచేస్తున్న యీ సమయాన, భారతస్వాతంత్ర్య పోరాటానికి కుడిభుజంగా నిలబడి పనిచేయు ఇండియన్ కమ్యూనిస్టుపార్టీపై నిషేధాన్ని తొలగించుకొనకపోవటం మన పోరాటాన్ని మనమే బలహీనపరచుకోటం అని యీ సభవారభిప్రాయపడుచు కమ్యూనిస్టుపార్టీపై నిషేధాన్ని తొలగించడమంటే పౌరసత్వ హక్కులను కాపాడడమనియు, కరాచీ, కాంగ్రెసు తీర్మానానుసారం అట్టి పౌరసత్వహక్కుల రక్షణ బాధ్యత కాంగ్రెసు సంస్థ యందున్నదిగాన, కనీసం కాంగ్రెసు పరిపాలనలోనున్న రాష్ట్రాలలోనైననూ ఆయా శాసన సభలలో కమ్యూనిస్టు పార్టిపై నిషేధాన్ని తొలగింపవలెనని తీర్మానాన్ని ప్యాసుచేసి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావలెనని కాంగ్రెసు ప్రభుత్వములను ఈసభవారు కోరుచున్నారు."

బెంగాల్, పంజాబ్, రైతులకు కొన్ని సౌకర్యాలు

కామ్రేడ్ 'వాసు

బెంగాల్ రాష్ట్రమంతటా జమీందారీ పద్ధతే అమలులో వుంది. 1793 వ పర్మనెంటు రెగ్యులేషనుద్వారా ఈపద్ధతి స్థిరపరచబడినది. మన రాష్ట్రములో జమీందారీ పద్ధతి వలన రైతులు ఎంత కృశించిపోవుచున్నారో అంతకన్న హెచ్చుగానే అచ్చటి రైతులు జమీందార్లచే పీడింపబడుచున్నారు. అచ్చట కాంగ్రెసు మంత్రివర్గము లేకపోయినప్పటికి ఫజ్లుల్‌హక్, ముస్లింలీగ్ మంత్రివర్గం రైతులయొక్క దీనావస్థను కొంతవరకైనను తొలగించుటకు పూనుకొనక తప్పినదికాదు. అందుకై ఒక టెనెన్సీ చట్టము ప్యాసుచేయబడినది ఈ చట్టము పర్మనెంటు సెటల్‌మెంటును చెక్కు చెదరకపోయినప్పటికిని, జమీందార్లకంత హాని కలుగజేయకపోయినప్పటికిని, రైతులకు కొన్ని హక్కులు కలుగజేసినది. చట్టముయొక్క ముఖ్యోద్దేశము లివి:

1. రైతులు పొలములుమార్చుకొనే టప్పుడు ఇదివరలో, కొంత "ట్రాన్స్‌ఫర్‌ఫీజు" అనబడే నజరానాను జమీందార్లు రైతులవద్దనుండి వసూలుచేసేవారు. ఇప్పుడది రద్దుచేయబడినది. (3) పదిసంవత్సరములవరకు శిస్తు రేట్లను పెంచరాదు. (3) పైబడియున్న శిస్తు బకాయీలపై వడ్డీరేటు నూటికి సంవత్సరమునకు రు. 12-8-0 నుండి రు. 6-4-0 వరకుతగ్గించవలెను, ఇక ముందుకూడ అప్లే వసూలు చేయవలెను. (4) జమీందార్లు శిస్తువసూలు చేసుకొనుటకు సమ్మెరీసూట్లు వేసుకోవలెను. ఇవి ముఖ్యమైన మార్పులు. కొంత కాలముపరకు గవర్నరు జనరల్ ఈచట్టమునకు అంగీకారము ఇవ్వలేదు. కాని బెంగాల్ రాష్ట్రములోని రైతు సంఘములు కాంగ్రెసు సంఘములు తీవ్రమైన ఆందోళనచేసిన మీదట ఈచట్టమును అంగీకరించుచు ప్రకటన చేసెను.

ఈ కొద్దిపాటి టెనెన్సీమార్పులతో రైతులేమాత్రమును తృప్తిచెందలేదు. రైతుసంఘాలు తీవ్రమైన ఆందోళన సాగించినవి దీనిఫలితముగా, 1793 వ సం॥ నాటికి పర్మనెంటు సెటిల్‌మెంటును పూర్తిగా పరిశీలించి ప్రభుత్వమునకు నివేదించుటకుగాను ఒక కమిటీని బెంగాల్ ప్రభుత్వము నియమించినది. ఈకమిటీకి ఫ్లౌడ్ కమిషన్ అని పేరు.

భూమి శిస్తు విధానమును పరిశీలించుటకు కూడ ఒక కమీషన్ ఏర్పాటుచేశారు. ఈ కమీషన్ మన రాష్ట్రమునకుకూడ వచ్చి. మద్రాసు మద్రాసు జిల్లాలలో పర్యటనముచేసి ఇచ్చటి రెవిన్యూ విధానమును గూర్చి తెలుసుకొని పోయిరి.

పంజాబ్

పంజాబురాష్ట్రములో చాలభాగము రైతువారీ పద్ధతి అమలులో వుంది. రైతులకు అప్పులు చాల మెండు. రాష్ట్రం మొత్తంమీద రైతులకు అప్పు రు 200 కోట్లు. ఏటేటా ఈ మొత్తముపై రైతులు షాహుకార్లకు 20 కోట్ల రూపాయలు వడ్డీ చెల్లించుతున్నారు. దాదాపు రాష్ట్రి షాహుకార్లంతా హిందువులు.

బ్రిటిష్ ప్రభుత్వము ఈరాష్ట్రములోని రైతుల నైన్యములో హెచ్చుగా చేర్చుకుంటుంది. అందువలన రైతులలో ముఖ్యంగా ముస్లిం రైతులలో ఏ విధమైన అసంతృప్తి లేకుండ చూచుకోవాలి. అదే సమయమున ప్రభుత్వమున కండగా వుండే పెద్దపెద్ద షాహుకార్లకు, జమీందారులకు హాని కలుగకుండావుండాలి. ఈ దృష్టితో పంజాబు మంత్రివర్గము గత సంవత్సరము పంజాబ్ శాసనసభద్వారా రైతుచట్టములను చేసింది. ఈచట్టములవలన రైతులుగా వుండి వడ్డీ వ్యాపారము చేసే షాహుకార్లకు ఎక్కువ హాని కలుగకుండా రైతులుకానట్టి "హిందూ" షాహుకార్లకే నష్టము వచ్చేటట్లు మంత్రివర్గము జాగ్రత్త పడింది. ఇందువలన రైతులతో అసంతృప్తి లేకుండాను ప్రభుత్వమున కనుకూలురైన పెద్దపెద్ద జమీందార్లకు, ముస్లిం షాహుకార్లకు హానికలుగకుండా ప్రభుత్వము చూడగల్గింది. పంజాబ్ ప్రభుత్వము ప్యాసుచేసిన రైతుచట్టముల ఉద్దేశ్యములు:

1. తాకట్టు భూముల చట్టము ఈ చట్టమువలన 1901 వ సంవత్సరమునకు పూర్వము వ్యవసాయకులు పెట్టిన తాకట్టు భూములన్ని కొంతమొత్తము షాహుకార్లకు చెల్లించినప్పుడు తాకట్టునుండి విడుదల చేయబడవలెను. షాహుకార్లకు చెల్లించవలసిన మొత్తమెంతో ఋణ పరిష్కారచట్టములు నిర్ణయించును.

2. మార్కెటింగ్ బోర్డులు. వీటిని ఏర్పరచుటవలన రైతులకు పంటసరకులకు తగిన ధరలు రాగలవు.

3. వడ్డీ వ్యాపారమునుగూర్చి తప్పనిసరిగా ప్రతి వ్యాపారస్థుడు లైసెన్సు పొందవలెను. అక్కౌంటులన్నిటిని రిజిస్టర్డు ఆడిటరుచేత ఆడిట్ చేయించవలెను.

4. లాండు అదియనేషన్ చట్టము: ఈ చట్టము 1902 వ సం॥ లో చేయబడింది. రైతుల భూములనుఅప్పులక్రింద షాహుకార్లకు పోనీయకుండా చేయుటకు ఉద్దేశింపబడినది. ఇప్పుడుచేసిన సవరణలవలన ఇంకను హెచ్చుమంది రైతులకు వర్తించులాగున చేయబడింది. ఈ బిల్లులవలన రైతుల ఋణభారము పూర్తిగా తొలగింపబడకపోయినను కొంతవరకు రైతులకు అప్పులబాధ తొలగినది.

ఈ చట్టములు కౌలుదార్లకు గాని, పేద రైతులకుగాని ఏవిధముగాను మేలు కలుగజేయలేదు. మధ్యతరగతి రైతులకును, పెద్ద రైతులకును అప్పులబాధ కొంతవరకు తొలగించబడినది.

అసంపూర్ణ రామాయణం: ఆంధ్రాస్పిరిట్

(వ్యంగ్య నాటికలు)

రచయిత: మల్లాది అవధాని. 48 పేజీలు: వెల నాల్గణాలు. పుస్తకాలకు, మల్లాది అవధాని నాట్యభారతి, విజయనగరం, అని వ్రాయాలి.

★

అసంపూర్ణ రామాయణం ఆంధ్రులందరికీ పరిచయమైనదే. ఇది రచించి 9 ఏండ్లయింది. ఈతొమ్మిదేండ్లలోనూ, అనేకచోట్ల ప్రదర్శింపబడింది. బ్రాడ్‌కాస్టు చేయబడింది. ఇదేచాలు ఈనాటిక ప్రాశస్త్యాన్ని తెల్పడానికి.

ఆంధ్రులలో ఉత్తమ నటకులున్నారు. ఉత్తమ కవులూ లేకపోలేదు. కాని ఒక్క నాటకమైనా "భేష్" అనిపించుకోదగ్గది వెలువడలేదు. ఒక్క నాటకప్రదర్శనమైనా 'మంచి' సరుకులలో చెల కట్టడానికి వీలులేకపోయింది. దేనిలోఉన్నదీ లోపం. నేటి నాటక రచనా విధానంలో–నేటి నాటక ప్రదర్శనా విధానంలో. కంట్రాక్టు పద్ధతులవల్ల నాటక ప్రదర్శనం మరీ అధోగతికి పోయింది.

ఇలాంటి కంట్రాక్టు పద్ధతిమీదనే ఈవ్యంగ్య నాటికదెబ్బ. ఈరచనతో అవధానిగారు ఆంధ్ర నాటకరంగానికి ఒక ఉపకారం చేశారని చెప్పవచ్చు. ఇదిరచించి 9 ఏండ్లయినా, నాటకక్షేత్రములో ఏమీ మార్పు రాలేదంటే, ఇలాంటి వ్యంగరచన ఇంకా అవసరమని తోస్తుంది.

★

ఆంధ్రాస్పిరిట్‌లో, గ్రంధకర్త ప్రస్తావనలో చెప్పుకొన్నట్టుల విమర్శించింది. "సారస్వతానికి తోకచుక్కలుగాఉన్న కథకులనూ, ప్రేమ విరహావ్రుల్నూ, విమర్శకులనూ; ప్రబోధించింది పాఠకులను."

ప్రపంచం ఎంత వేగంతో ముందుకు పోతున్నదో, అంత వేగంతో మన సారస్వత్వం పరుగిడుటలేదు. ఛాందసులు తమ ప్రబంధ విరహాలను మరిచిపోవుటలేదు. కొంతముందుకు వచ్చిన భావకవులకు ప్రపంచమూ సంఘమూ కన్పించదు, "ప్రేయసీ విరహానలం" తప్ప. సంఘంలోని యదార్థాన్ని తెలియపఱచే వాస్తవిక ఘటనలను చిత్రించినపుడే సారస్వత ఆశయం సఫలీకృత మౌతుంది.

ఆంధ్రాస్పిరిట్ నేటి సారస్వతంలోని లోట్లను సూచించింది. సారస్వతాన్ని అభివృద్ధికి ఎలా లాగాలో పాఠకులే నిర్ణయించుకోవాలి.

అసంపూర్ణ రామాయణం, ఆంధ్రాస్పిరిట్ విమర్శనా విధానంలో నూతన పంథాతొక్కి– నాట్యరంగానికీ, సారస్వతానికీ మేలుకూర్చాయి, అందరూ చదివి ఆనందించదగిన గ్రంధమిది.

గ్రంథావలోకనం

ప్రభుత్వం

(బూర్జువా ప్రజాస్వామికం–శ్రామిక నియంతృత్వం.)

రచయిత: లెనిన్; అనువాదకులు: పి. వి. శివయ్య, బి. యస్. సి. 45 పేజీలు: వెల రెండణాలు. పుస్తకాలకు అతివాద గ్రంధమండలి, గుంటూరు. అని వ్రాయాలి.

తాత్కాలింగా రష్యా శ్రామిక నియంతృత్వం (ప్రొలిటేరియన్ డిక్టేటర్ షిప్పు) వహించింది. స్టాలిన్ ప్రసాదించిన నూతన రాజ్యాంగ శాసనంతో, నిజమగు ప్రజాస్వామ్యం రష్యాలో యేర్పడింది. అయితే ఈ ప్రజాస్వామ్య పద్ధతిని ఇతర దేశాలలోని ధనిక ప్రజాస్వామికాన్ని (బూర్జువా డెమాక్రసీ) ఒకటేఅని పోల్చరాదు. అలాగే రష్యాలోని తాత్కాలిక శ్రామిక నియంతృత్వాన్ని, హిట్లర్, ముస్సోలినీల ఫేసిస్టు నియంతృత్వాన్ని ఒకటేఅని పోల్చరాదు. కాని చాలమంది మహానుభావులు చేసిన–చేస్తున్న–పనే అది. ఆవిధంగా గాడిదనూ గుర్రాన్నీ కల్పి, సోషలిజానికీ, సోవియట్ యూనియనుకు చాలమంది బుద్ధిపూర్వకంగానో – కాకనో – ద్రోహం చేస్తున్నారు. ఈ గ్రంధంవలన ఆగందరగోళం పోతుంది.

లెనిన్ స్వేర్డలాఫ్ విశ్వవిద్యాలయంలో ఇచ్చిన ఉపన్యాసం (ఈగ్రంధం)లో బూర్జువా ప్రజాస్వామికంలోని బూటకత్వాన్ని, శ్రామిక నియంతృత్వ అవసరాన్ని తెలియచేస్తాడు. నిజమైన ప్రజాస్వామ్యం దేనిలో ఉంటుందో తెల్పాడు. బోల్షివిక్‌లను అపోహచేసికొన్నవారి వాదనలను – అపహసించినవారి వాదనలను – ఖండించాడు.

అనువాదం సరళంగాఉంది, కాని అనేక విదేశపదాలు (తప్పనిసరియే) దొర్లినవి. కారణం విషయమటువంటిది. ఇంకా సులభం చేయడానికి కఠిన పదాలకు చివర ఒక వివరణ వ్రాయాల్సింది ఇంకో ముఖ్యమైన విషయం. రష్యన్ సోషల్ డెమాక్రటిక్‌పార్టీ ఒకప్పుడు విప్లవపార్టీ. దానిలో చీలికలుగల్గి బోల్షివిక్‌పార్టీ ఏర్పడ్డ తర్వాత సోషల్‌డెమాక్రటిక్ పార్టి మితవాద పార్టిగా మారింది. ఈ భేదం తెలియని వారికి లెనిన్‌వాడిన ఈ పదాలలో "పరస్పర విరుద్ధత" కన్పించుతుంది కాబట్టి ఈ విషయాన్ని పీఠికగా వ్రాసియుండాలిసింది. రెండవ ముద్రణలో ఈ పనిచేస్తారని ఆశిస్తాం.

రాజకీయాలలో ఆసక్తిగల ప్రతివాడూ చదువదగిన గ్రంధం ఇది.

స్వీకారం

1. హిట్లర్ దురంతాలు–
2. నీటి బుగ్గలు–
3. చీనా-జపాను, జకోస్లొవేకియా-జర్మని-
4. వెలుగురవలు–
5. సోవియట్ రష్యా–
6. సంస్థానాలు–
7. జాతీయ అంతర్జాతీయ నాటికలు–
8. పాపం–
9. మాతృస్తవం–
10. 1938 సంవత్సర కార్యకలాపము–
11. ఫెడరేషన్, నిజస్వరూపం–
12. భూగోళ వృత్తాంతం (2 వ భాగం)
13. నానావిషయ కవి రచనములు–
14. విభూతి (మాసపత్రిక)

మద్రాసు ప్రభుత్వ కార్మిక విధానం సంతృప్తిగా లేదు

కార్మిక చట్టం ప్రవేశపెట్టేముందు ప్రభుత్వ మాలోచింపదగిన కొన్ని విషయాలు

కాంగ్రెసు మంత్రి పదవులు స్వీకరించడములో కార్మికవర్గమందు కూడ తమకోర్కెలు నెరవేర్చుకొనుటకు కాంగ్రెస్ మంత్రులు సహాయపడెదరను ధైర్యము కల్గింది. పారిశ్రామికముగా వెనుకబడిన రాష్ట్రమయిననూ, నిర్మాణముగా వెనుకపడియున్న కార్మికులుకూడ తమ కోర్కెలు నెరవేర్చుకొనుటకు ప్రత్యక్ష సంఘర్షణలు జరుపుట ప్రారంభించారు. యజమానులు కార్మికుల ప్రతిఘటనాశక్తిని, నిర్వీర్యమొనర్చుడానికి లాకౌట్సు చేయటం ప్రారంభించారు. ఈ పరిస్థితులలో మంత్రివర్గము తాము యజమానుల పక్షముగాని, కార్మికుల పక్షముగాని వహించమనియు, నిష్పాక్షికముగా వుంటామని తెలియచేయుచూ 1937 అక్టోబరు 22 వ తేదీన తమ కార్మిక విధానమును ప్రకటించింది. కార్మికులు తమ కష్టాలను పోగొట్టుకొనుటకై కడసారి యత్నముగా సంప్రతింపులు విఫలమైనప్పుడు సమ్మె చేయవలెనని సూచించారు. ఇందుకు భిన్నముగా జరుగు సమ్మెలపట్ల తాము విముఖులనియు, వాటికి తమ సానుభూతి వుండదనియు, ప్రకటించింది. హఠాత్తుగా జరుగు సమ్మెలను నిషేధించాలను భావము ప్రకటనలో కనపడుచున్నది.

కాని, కార్మికుల ప్రాథమిక హక్కులు, ముఖ్యముగా రికగ్నిషన్, (యెట్టి షరతులు లేకుండా) కనీసపువేతనము. (minimum wage) సర్వీసు గ్యారంటీ,విచారణ లేకుండా పనివారలను శిక్షించుట మానడము, లాకౌట్సు నిషేధించడము, ఆదిగాగలవి, కాపాడిననేగాని హఠాత్తుగా జరుగు సమ్మెలు వుపశమించుటకు అవకాశముండదు. కార్మికుల హక్కులమాట తలపెట్టక, యీ విధమైన ప్రకటనలు చేయడము కార్మికవర్గమునకు నష్టదాయకము. చాలా చోట్ల కార్మికులు కాంగ్రెసుమంత్రుల సలహాను పాటించిరి. కాని, యజమాను లీయవకాశమును వినియోగించుకొని, కార్మికులలో చీలికలు కలుగజేస్తున్నారు. సంప్రదింపులతో కార్మికుల కోర్కెలు నెరవేరకపోవుటయేగాక, కార్మికమంత్రియే జోక్యము కలుగజేసుకొన్నను, యజమానులుమూర్ఖత వహించడముకూడజరిగినది. కార్మికులకు ప్రాథమికహక్కులు కూడ లేని మన దేశములో యజమానులు కార్మిక ప్రతినిధులతో సంప్రదించుటకు అంగీకరించరు. అంగీకరించలేదు. మన మంత్రివర్గపు ప్రకటన కార్మికులు స్టే-యిన్-సమ్మెలు మొదలైనవి చేసినప్పుడు ప్రజాసామాన్యమునుండి కార్మికులను వేరువేరుచేయుటకు యజమానులకు సహాయపడుచున్నది. అందువలన మన మంత్రివర్గము సూచించినవిధానము విఫలమయినదనే చెప్పాలి. హఠాత్తుగా జరుగు సమ్మెలను వుపశమింపజేయడానికి కార్మికుల ప్రాథమిక హక్కులను కాపాడుచూ శాసనములు చెయ్యాలి. ఈ శాసనము చేసినయడల ప్రజోపకరమగు పరిశ్రమలలో హఠాత్తుగా జరుగు సమ్మెలను కేంద్ర ప్రభుత్వము నిషేధించడము వలన కలిగిన నష్టమును పోగొట్టుటకు కేంద్ర ప్రభుత్వముమీద ఒత్తిడి చేయుటకు అవకాశముండును. హఠాత్తుగా జరుగు సమ్మెలను నిషేధించడమువల్ల ధనిక వర్గమునకు ప్రాపుగానిలచిన తెల్లదొరల పంథానే మన మంత్రివర్గం అవలంబించినవారవుతారు.

కార్మిక సంఘర్షణల పరిష్కారమునకై మన మంత్రివర్గము అవలంబించిన విధానము కూడ తృప్తికరముగా లేదు.

కార్మికులు సమ్మె చేయుచున్నప్పుడు, 144 సెక్షను వారిపై అమలు జరుగకుండునట్లు కూడ చేయలేక పోయింది. అంతేగాక, విచారణ కమిటీని నియమించటానికి, ముందు కార్మికుల చేత సమ్మె అపివేయించటము ప్రధానముగా భావించింది.

సమ్మెచేయటానికి కార్మికుల కోర్కెలు సమంజస మైనవయిననూ, కార్మికుల కోర్కెలలో కొంతవరకైననూ నెరవేర్చకుండా కార్మికులచేత బలవంతముగా సమ్మెలు అపుచేయించింది. విచారణ కమిటీలద్వారా కాలయాపనము జరుగుచున్నది. ఈలోపుగా యజమానులు పనివారిని విక్టిమైజ్ చేసిననూ కార్మికులకు రక్షణలేదు. కార్మికులచేత, సమ్మె అపుచేయించుటకు పూర్వము వెంటనే పరిష్కరింపబడుటకు యవకాశమున్న విషయములు పరిష్కరించాలి. తరువాత విచారణకమిటీని నియమించాలి. ఈ కమిటి కాలయాపనము చేయరాదు. ఈలోపుగా పనివారిని శిక్షించకుండునట్లుచూడాలి.

ఈ కమిటీ సూచనలు కార్మికులకు అనుకూలముగా నున్నయెడల, అవి యజమానులు సొంతముగా అమలు జరుపుటలేదు తాత్కాలికముగా యజమానులు అంగీకరించిననూ, ఆచరణలో వుల్లంఘించుచున్నారు. ఈతీర్పును అమలు జరుపుటకు యజమానులమీద ప్రభుత్వపు ఒత్తిడిలేదు. ఈ తీర్పును అమలు జరపాలని కార్మికులు సమ్మెచేసిననూ వీరికి పోలీసు బాధ తప్పుటలేదు.

విచారణకర్త కార్మికులపట్ల విముఖులుగా నుండియో, పెట్టుబడిదారుల ప్రాపుగల్గి వుండటము వల్లనో, విచారణ కార్మికులకు సంపూర్ణమైన అనర్థదాయకమగు ఫలితములు కల్గించినప్పుడు కార్మికులు సమ్మెచేసినయడల మన మంత్రివర్గము కార్మికులను అభిశంసిస్తున్నది. (ఉదా: చూళై-మిల్లు సమ్మె).

విచారణ సల్పుటకు సర్వసాధారణముగా ప్రభుత్వ ఉద్యోగియులను నియమించటము మన మంత్రివర్గమునకు ఆచారమైనది. ప్రభుత్వమునకు అండగానున్న కోటీశ్వరులైన మిల్లు యజమానులకు యీ ప్రభుత్వపు వుద్యోగస్థుల ప్రాపుగల్గి వుంటారు, అందువలన కూడా విచారణ కాలయాపనమై కార్మికులకు మేలు జరుగుటలేదు. ఈ విచారణ అనధికార కమిటీచే జరిపించి వుండాలిసింది. విచారణ కమిటీ నియమించుటకు కూడ కార్మికుల కోర్కెలు అత్యవసరమైనవైననూ పరిష్కరించకుండా, సమ్మె అపుచేయించరాదు.

యజమానులకు, కార్మికులకు మధ్యగల వివాద పరిష్కారమునకై ఒక పెర్మనెంటు బోర్డును నియమించాలని కొంతమంది కార్మిక శాసన సభ్యులు ప్రధాని రాజాజీతో సంప్రతించినపుడు సూచించారు. దీనివలన కార్మికులకు న్యాయము జరుగుటకు యవకాశములు తక్కువగా నున్నవి. అందువలన వీరు యిచ్చిన తీర్పు కార్మికులపై నిర్బంధము చేయరాదు. కాన్పూరు జనరల్ స్ట్రయికు సమయమందు కార్మికులను శిక్షించుటకుగాని, తీసివేయుటకు గాని, జీతములు తగ్గించుటకుగాని, యజమానులు కార్మికుల సమానసంఖ్యగల ప్రతినిధుల కమిటీ యేర్పాటు చెయ్యాలని, దానికి, గవర్నమెంటు వుద్యోగి అధ్యక్షుడుగా నుండాలని యు. పి. ప్రభుత్వము సూచించింది. సర్వసాధారణముగా సామ్రాజ్య ప్రభుత్వము క్రింద నలిగిన వుద్యోగి కార్మికులకష్టాలను గుర్తించజాలడు. అందువలన, యజమానుల, కార్మికుల సమాన ప్రాతినిధ్యముగల కమిటీకి ఒక శాసన సభాసభ్యుని అధ్యక్షునిగా చేసినయడల న్యాయము జరుగుటకు యవకాశముండును. ఈ కమిటీని ప్రత్యేకముగా పర్మెనెంట్‌చేయుట మంచిదికాదు.

కార్మికుల పికెటింగుపట్లకూడ మన మంత్రివర్గముధోరణి అసంతృప్తి కలిగించి కొన్ని సమయములందు కాంగ్రెసు కార్మిక విధానమునకే వ్యతిరేకముగా పోవుచున్నది. 1938 నవంబరులో మధుర మహాలక్ష్మి మిల్లుసందర్భమున ఆ జిల్లా కలెక్టరు పికెటింగు చేయుటకు యీ క్రింది నియమములను చేశాడు. వాటిపట్ల 'గిరిగారు'కూడ మిన్నకున్నందున ఆమోదించారనే తలచవచ్చును. అవి పికెటింగుచేయుటకు రోడ్డుమీద నిలబడకుండ, మార్జినులో నిలబడాలని మిల్లుకు 50 గజముల దూరముగా నుండాలని, పికెటింగు చేయువారిమధ్య 5 గజాలు యెడము వుండాలని రోడ్డుకు అడ్డముగా పరుండరాదని. ఈ నియమములు పికెటింగును వ్యర్థపరచును కనుక, యే పరిస్థితులందు పికెటింగుకు అడ్డంకులు కల్గించరాదు. అంతేకాకుండా పికెట్ చేయుచున్నప్పుడు ట్రాఫిక్‌కు భంగము కల్గించారని పోలీసుకేసులు పెట్టకుండా మన కాంగ్రెస్ మంత్రివర్గము శాసించాలి.

అంబా సముద్రం కార్మికవివాద పరిష్కారమందు యజమానులకు 144 సెక్షను యిచ్చి మన మంత్రివర్గం రాజీకి వచ్చునట్లు చేసింది ఇది ప్రశంసించవలసిన విషయము.

స్టేయిన్ సమ్మెలపట్ల మంత్రివర్గ దృక్పథము విషాద విభ్రమాశ్చర్యములు కలిగించుచున్నది. ఇవి దౌర్జన్యముతో కూడుకొన్నవని, కార్మికులకు నష్టమని రెండు వింతవాదములు మంత్రివర్గము సల్పుచున్నది. అంతేగాక, ఆస్తిని అక్రమించుట అనికూడ దీనిని నిరసించుచున్నాడు ప్రధాని. కాని స్టేయిన్‌సమ్మెలోపై ఆరోపణలు చేయుటకు తావులేదని కార్మికులు తమ కోర్కెలను యజమానులు అంగీకరించుటకు ఒత్తిడి కలుగచేయు సాధనోపాయములలో యిదిఒకటి. అంతేగాని, తమకోర్కెలు నెరవేర్చుకొనుటకు యవలంబించిన విధానమును ఆస్తులను అపహరించుటకు అనుట పొరపాటు. స్టేయిన్ సమ్మెలు అక్రమము అని ప్రకటించరాదు.

1938 ఏప్రిల్ 22 నందు కార్మికశాఖామంత్రి యజమానుల, కార్మికుల ప్రతినిధులను కార్మిక శాసనమును గూర్చి ముఖ్యముగా నిరుద్యోగ సహాయమును గూర్చి కార్మిక వివాదాలను గూర్చి సంవత్సరమంతను 10 మంది పైగా పనిచేయు యంత్రశాలల జమాఖర్చులు, ఉద్యోగులు, నిరుద్యోగులు యెంతమందో తెలియచేయుచూ ప్రభుత్వమునకు రిపోర్టు పంపాలని సూచించారు. సంఖ్య 10 మందినుంచి 5 గురికి మారిస్తే దాదాపు కార్మికవర్గమున కంతకును వర్తిస్తుంది. అందువలన 5 గురు అని మార్చాలి. యజమాని, తనవద్ద పనిచేయు కార్మికుల సంఖ్య ననుసరించి రోజుకి రూపాయికి 0-0-3 చొప్పున కొంతమొత్తమును కార్మికుని జీతములో నుంచి తీసి కొంత నిధిని యేర్పరచాలని, ప్రభుత్వం యిష్టపడితే ఆ మొత్తమునకు కొంత కలపవచ్చునని సూచించింది. 20 రూ లోపు జీతములు కలవారివద్దనుంచి మినహాయించకూడదు. యజమానివద్దనుంచి 0-0-3 ప్రభుత్వము 0-0-6 కలిపి నిధినియేర్పరచితే నిరుద్యోగులకు, సహాయముచేయవచ్చును. కార్మికుడు పనికల్పించిన పుడుపనిచేయుటకు నిరాకరించినయడల అతనికి నిరుద్యోగభృతి యివ్వబడదని సూచనకూడ వుంది. కాని, సమ్మె సమయము అందు మాత్రము యీ నియమము వర్తింపకుండునట్లు చెయ్యాలి.

ప్రభుత్వపు సూచనలలో ప్రభుత్వము, పరిష్కార కమిటీని (Arbitration Board) యేర్పరచుటకు మాత్రమేగాక, యీ పరిష్కారమును వుభయ పార్టీలమీద, బైండింగ్‌గా చేయుటకు ప్రభుత్వమునకు అధికారము వుండాలనికూడ సూచించబడింది. కాని పరిష్కారవిధానము నిర్బంధము చేయరాదు.

9 మంది పనిచేయు కర్మగారము లన్నియు ఫ్యాక్టరీ ఆక్టుక్రిందకు తెచ్చుటకు అవకాశమున్ననూ, మనమంత్రివర్గము యేమిచేయలేదు. అంతేగాక బొంబాయిలో చేనేత పరిశ్రమకు కూడ ఫ్యాక్టరీ అక్టువర్తించునని ఆప్రభుత్వము ప్రకటించింది. ఫ్యాక్టరీఆక్టుకూడ యజమానులు సరిగా అమలు జరుపుటలేదు. అమలుజరుగుటకు ఫ్యాక్టరీ ఆక్టును యీక్రింది సూచనల ప్రకారము సవరించాలి.

1. 5 గురికి మించి పనిచేయు ఆవరణ ఫ్యాక్టరీ అక్టుక్రిందకు వచ్చునట్లు చెయ్యాలి.

2. ఫ్యాక్టరీలు వారమునకు 48 గం॥లకు మించకుండా పనిచెయ్యాలి, సీజన్‌లో 52 గం॥లకు మించకుండా పనిచెయ్యాలి.

3. ఫ్యాక్టరీ ఆక్టు అమలు జరిపించుటకు మ్యునిసిపాలిటీలకు, జిల్లాబోర్డులకు కొంత బాధ్యత కల్గించాలి.

శాసనసభ ఆగస్టు సమావేశములో కార్మిక చట్టము ప్రవేశపెట్టబడునట్లు తెలియుచున్నది. మన మంత్రులు యిప్పటివరకు అవలంబించిన పద్ధావదలి, యేపరిస్థితు లందును సమ్మెలు నిషేధించుట, పికెటింగుకు అడ్డంకులు కలిగించుట జరుగకుండా చూడాలి. అంతేగాక బొంబాయి లేబరుబిల్లులోని కుట్రను ప్రవేశపెట్టకూడదు. నిరుద్యోగ భృతికూడా కల్పించాలి.

ఇప్పటివరకును మద్రాసు ప్రభుత్వ కార్మిక విధానమువల్ల కల్గిన నష్టమును తెలియచేశాము. అది సూచించిన విధానమును భగ్నముగుటకు కారణము యజమానులేయని కూడ నిష్పక్షపాతముగ విచారించిన తేలును. కాన, కార్యాచరణయందు ఆవిధానములోని పై సూచించిన లోట్లను సవరించి, చట్టమును ప్రవేశపెట్టెదరని యాశించుచున్నాము.

నా వింత జబ్బు

(14 వ పేజీ తరువాయి) చేసిన యేర్పాట్లన్నీ సంతృప్తి కరంగా ఉన్నాయి. శారీరకంగా నాకెట్టి బొల్లు కలుగలేదు. కాని, పైన చెప్పిన కారణాలవల్లను, ఇతర కారణాలవల్లను, త్రిపురీ యొక్క నైతిక వాతావరణం నాకు కలిగించిన బాధ ఇంతా అంతా కాదు. ఏకాంగ్రెస్ సమావేశంలోను నేనింతవరకు అట్టి అనుభవాన్ని పొందలేదు.

మందులు - తాయెత్తులు

ఫిబ్రవరీ 17 వ తేదీ లగాయతు నాకు వస్తున్న ఉత్తరాలు, టెలిగ్రాంలు, మొదలైనవి చదువుతూవుంటే నాకు సరదా పుట్టుతోంది ఇవన్నీ కలిసి ఒక పెద్ద ఉద్గ్రంథం అవుతుంది. ప్రతిరోజు యివి వస్తున్నాయి. జాబులు, టెలిగ్రాంలేకాదు; రకరకాలైన మందులు - తాయెత్తులతో పార్సెలు, ప్యాకెట్లుకూడా వస్తున్నాయి. ప్రతిమతానికి సంబంధించినవారు వీటిని పంపుతున్నారు. ప్రతి వైద్యపు పద్ధతికి చెందినవారు వీటిలో ఉన్నారు. స్త్రీలు, పురుషులతో సహా, హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, పార్శీలు, హోమియోపతీ వైద్యులు, అల్లోపతీ వైద్యులు, హకీంలు, ప్రకృతి వైద్యులు, జ్యోతిశ్శాస్త్రజ్ఞులు, అందరూ నాకువ్రాస్తున్నారు, సలహాలిస్తున్నారు, సమానా ప్యాకెట్లు పంపుతున్నారు. తాయెత్తులుకూడా పాడమంటున్నారు. వారందరూ నామీద చూపుతూన్న దయకు నేను కృతజ్ఞత తెలియజేయడం అంత సులభసాధ్యంకాదు. నాదగ్గరనుంచి జవాబులు రాకపోతే, మళ్లీ మళ్లీ జ్ఞాపకం చేస్తూన్నారు. ఈమందు లన్నింటినీ ఏమిచేయాలి నేను? డాక్టర్లే వాటిని యిచ్చేవాణ్ణే. వాటిని డాక్టర్లు ఉపయోగించి చెప్పరు. అది వారిక్రూరత్వమా, కాదా?

ఈమందులకీ, మాకులకీ, తాయెత్తులకీ ప్రత్యక్షమైన విలువ యేమీ లేకపోవడం నిజమే. కాని, వాటివెనుక సానుభూతి, ప్రేమ, దయ, ఎంతోఉంది. నాకు వాటివిలువ అపారం, వాటి ప్రాధాన్యత అనంతం. ఈ సద్భావాలు నాకు ఆరోగ్యాన్ని కలుగజేస్తా యనుకోవడంలో సందేహం లేదు. భౌతిక వైద్యులు, జ్యోతిష్కుల తాయత్తులు, చేయలేని చికిత్సలు యీమంచి భావాలు తప్పకుండా చేస్తాయి.

హిమాలయ పర్వతాల పిలుపు.

త్రిపురీ వాతావరణం నైతికంగా నాకు కలిగించిన బాధవల్ల నాకక్కడ ఉండబుద్ధికాలేదు. రాజకీయాలంటే అసహ్యం, రోత పుట్టింది. గత 19 సంవత్సరాలలో నాకట్టి భావాలు కలుగలేదు. జామదోబాలో నేను నాపరుపుమీద దొర్లుతూంటే, ఒకేప్రశ్న నామనస్సుని కలచివేసేది. గొప్పవారిలో కూడా ఇంత కస, ఇంత చిలిపి గుణం, ఉంటే మన రాజకీయ జీవితం ఏమి కావలసింది? అనే ప్రశ్న నన్ను రాత్రింబగళ్ళు మాటిమాటికి, వేధించేది. నాజీవితంలో మొట్టమొదటనుంచీ నేను ప్రేమించే హిమాలయ పర్వతాలవైపు సహజంగా నా ఆలోచనలు బయల్దేరాయి. హిమాలయ పర్వతాల పిలుపు నన్ను పూర్తిగా ఆకర్షించివేసింది. రాజకీయాల పర్యవసానం యిదే అయితే, "భగవత్సన్నిధానం" అని అరవిందఘోష్ వర్ణించిన జీవితం విడిచిపెట్టి యీ తప్పుమార్గాన్ని ఎందుకు నడిచానా అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. మాయ అనే యీతెరను చింపుకొని, మళ్ళీ ఆప్రేమ ప్రపంచంలో లీనం అవుదామా అనిపించింది. ఈవిధంగా నేను నైతిక సందేహాలతో అనేక రాత్రింబగళ్ళు గడిపాను. ఒక్కొక్కప్పుడు హిమాలయ పర్వతాల పిలుపే వినాలనుకునేవాణ్ణి. చీకట్లతో నిండిన నామనస్సులో వెలుతురుకొరకు ప్రార్థించాను. అప్పుడు నెమ్మదిగా ఒక కొత్తదృశ్యం నాకు కనపడింది. దోలాయమానమైన నా మనస్సుని కుదుటపరచుకొన్నాను. మానవుని యెడల, నాదేశీయుల యెడల, విశ్వాసం తిరిగి నాలో యేర్పడింది. త్రిపురీఅంటే ఇండియాకాదని అప్పుడు గ్రహించాను. ఈజాబులలోను, మందులలోను, మూలికలలోను, తాయెత్తులలోను, పువ్వులలోను యిమిడిఉన్న మరొక ఇండియా ఉన్నదని తెలుసుకోగలిగాను. ఈ ఇండియాఅంటే నాకు అయిష్టందేనికి? అంతేకాక, త్రిపురీ జరిగిన ఘటనలన్నీ చూచి నప్పటికీ, మనుష్యునియెడల నాకు ఉండవలసిన ప్రధానమైన విశ్వాసమే పోగొట్టుకొంటే యేలాగు? మనుష్యుని యందు నమ్మకం ఉంచకపోవడం అంటే అర్థం, మనుష్యునిలోఉన్న దైవాంశను నమ్మకపోవడం అన్నమాట, అంటే, మానవుని జీవితంలోనే విశ్వాసం లేకపోవడం అన్నమాట, కాబట్టి, క్రమక్రమంగా నా అనుమానాలన్నీ తీరిపోయాయి. నా పూర్వపు ఆత్మవిశ్వాసాన్ని తిరిగి సంపాదించుకో గలిగాను, నేను చేసిన యీ ప్రయత్నానికి యీమందులు, యీ మూలికలు యీ తాయెత్తులు ఇంకో విధంగా ఎంతో సహాయపడ్డాయి....

.... త్రిపురీకి నేను ప్రయాణంఅయి వెళ్ళడానికి కొద్దిరోజులు పూర్వం కొందరు మిత్రులు నావద్దకువచ్చి తాయెత్తులు ధరించవలసినదని నన్ను బలవంతపెట్టారు, మొదట యీసూచన నా హేతువాదాన్ని కలవరపెట్టింది. కాని మనోదౌర్బల్యంవల్ల అంగీకరించాను. రెండు ఉంగరాలు, నాలుగు తాయెత్తులు తీసుకొన్నాను. నాకు పరిచయంగావున్న వారివద్దనే అవి తీసుకొన్నాను. లాభాలకోసం జీవించేవారివద్ద కాదు. నాకు పరిచయం లేనివారివాద్ద తాయెత్తులు తీసుకోలేదు. అట్టివారెంత మందో ఉన్నారు. అవి అన్నీ కట్టుకుంటే నేనొక తాయెత్తు ప్రదర్శనంగా మారిపోయేవాణ్ణి. త్రిపురీ కాంగ్రెసులో నేను ఆరోగ్యంతో ఉండాలన్నకోరిక నాలో ప్రధానంగా ఉండేది. తాయెత్తులువాడితే కొద్దిమాత్రమైనా గుణం కనిపిస్తే ఎందుకు వాటిని నిరాకరించాలి అనుకునేవాణ్ణి. కాబట్టి, నాహేతువాదంతో కొంత రాజీ చేసుకోవలని వచ్చింది. త్రిపురీ పూర్తికాగానే ఆ రెండు ఉంగరాలు నాలుగు తాయెత్తులు తీసివేశాను. ఇప్పుడు నాహేతువాద్నాకి ఎట్టి లోటులేదు. ప్రకృతి మీదనే పూర్తిగా యిప్పుడు ఆధారపడి యున్నాను. ఎంత అదృష్టం?....

....గత 5 వారాలనుంచి చాలా వరకు బయటి ప్రపంచంతో సంబంధంలేదు - ఇంకోవిధంగా సంబంధం ఏర్పడింది. రాజకీయాలతో సంబంధం లేని ప్రజలు - నేనసలు ఎరుగనే ఎరుగని ప్రజలు - దేశంలో మూల మూలల ప్రజలు - చివరకు సనాతన పండితులుకూడ నాజబ్బుకు అటువంటి సానుభూతి, దయ ప్రకటిస్తారని నేను ఊహించలేక పోయాను. నేను నాలో ప్రశ్నించుకునేవాణ్ణి - మాకెట్టి బంధనంఉన్నది? వారెందుకు నాకోసం బాధపడతారు? వారిదయకు పాత్రమయేపనులు నేనేంచేశాను?" ఈప్రశ్నకు జవాబు వారే చెప్పాలి.

ఒక విషయం నాకు తెలుసు, ఒకడు శ్రమపడటం, బాధ పడటం ఇలాంటి హిందూదేశం కోసమేనన్ని, ఇలాంటి హిందూదేశానికే, ఒకడు తన ప్రాణాన్నైనా ఈయవచ్చు. త్రిపురి ఏమి చెప్పినా, ఏది చేసినా, అమరవిశ్వాసం ఉంచదగిన అసలుహిందూదేశం ఇదే."

— మాడరన్ రివ్యూనుండి.

వినోద పోటీ నెం. 3 రు

రు 500 లు బహూమతులు

ఈ క్రింద వుదహరించిన సమస్యలను పూర్తిచేసి అందుద్వారా గొప్ప గొప్ప బహుమతులను మీ రేల పొందరాదు? ఇంత సులభమైన సమస్యలను ఆంధ్రంలో ఇంతవరకు యితరులెవరు ప్రకటించి వుండలేదు ఆంధ్రులైన మీరందరు యీఆంధ్ర సమస్యలను ఆదరించితే మేము మరుచటి పోటీకి యింకా గొప్ప బహుమతులను పంచుతాము. ఈపోటీలలో పాల్గొనమని మీ స్నేహితులనుకూడ ఉత్సాహపరచ ప్రార్ధన. వేసవి సెలవులలో మా సమస్యలు మీకు వినోదంగా పొద్దుపుచ్చును.

1 వ బహూమతి రు 250 లు. 2 వ బహూమతి రు 150 లు. 3 వ బహూమతి రు 100 లు.

6 ఎంట్రీలు పైబడి పంపే ప్రతివారికీ కన్సోలేషను యినాములు. మాకు ఎంట్రీలు చేరవలసిన ఆఖరు తేది 25—4—39.

	సాధన వాక్యములు.	జవాబులు.
1	ఇది సంఘములో కఠినముగా వుండరాదు (శిక్ష—కక్ష)	
2	దీని నిమిత్తం దేశములో ఎంతో ధనము నిర్లక్ష్యముగా ఖర్చు కాబడుచున్నది (పానము—గానము—దానము)	
3	పూర్వీకులకు దీనియందు బాగా నమ్మిక వుండెడిది (శాపము—పాపము)	
4	దీనిని వాడుచుండిన దేహారోగ్యమునకు మంచిది (వేము—వాము)	
5	ఇదియంటే కొంతమందికి ప్రాణ సంకటము (అత్యాచారము—అనాచారము)	
6	ఇది పెక్కు పాఠశాలలకు సెలవు దినము (శనివారము—అదివారము)	
7	ఏమాత్రము పొత్తిడినైనను గ్రహించును (త్రాసు—త్రాము)	
8	దీనినిబట్టి ఒకరియొక్క ఆరోగ్య అనారోగ్యములను తెలుసుకొనవచ్చును (ఆహారము—ఆకారము)	
9	ఇది మితిమీరినపుడు యితరులకు అసహ్యము పుట్టించును (త్రాగుడు—వాగుడు)	
10	ఇతరులయొక్క ఇవి త్వరిగా కనిపించును (తప్పులు—ఒప్పులు—అప్పులు)	

మీరు పూర్తిచేయవలసిన విధానము:—పైపటములో 10 సాధనవాక్యములున్నా-ఆయా వాక్యములకు ప్రక్కనే రెండు లేక మూడేసి చొప్పున మాటలువ్రాసి వున్నవి. సదరు వాక్యములను మీరు బాగుగా అర్ధంచేసుకుని, ఆప్రక్కనవ్రాసివున్న మాటలలోనుంచి ఏదయినా ఒక్క సరియైన మాటనుమాత్రం ఎత్తుతూ, ఆప్రక్కనే "జవాబులు" అని వ్రాసిన కాలంలోపూర్తిచేయవలెను. యిలా 10 మాటలను పూర్తిచేసిన ఒక ఎంట్రీయగును. అట్టి ఒక ఎంట్రీకి ప్రవేశ రుసుము 0-4-0 లేక మూడు ఎంట్రీలు పంపిన ఎడల 0-8-0 మాత్రమే.

ముఖ్యమైన కొన్ని నిబంధనలు:—పైన వ్రాసిన ప్రకారం ప్రవేశ రుసుములతో ఒక్కొకరు ఎన్ని ఎంట్రీలయిననూ తెల్లకాగితములమీద వ్రాసి పంపవచ్చును. మీరువ్రాయు ఎంట్రీలలో సాధన వాక్యములను పదేపదే తిర్గి వ్రాయవలసిన పనిలేదు. ప్రవేశ రుసుము పోస్టు స్టాంపులద్వారాగాని, లేక మనియార్డర్లద్వారాగాని మాత్రమే పంపవలయును. మావద్ద శీలుచేసి వుంచబడిన సమాధానమే సరియైనది. బహూమతులు మాకు రాబడిన ఎంట్రీలనుబట్టి హెచ్చుతగ్గులు చేయబడును. ఫలితముల నిమిత్తం ఒక అణాస్టాంపు అధికముగా పంపవలెను. ఫలితములు 2-5-39 ప్రకటించబడును బహూమతుల పంపిణీవిషయములోను ఈ కాంపిటీషనుకు సంబంధించిన యితర విషయములలోను మేనేజరుగారి తీర్పే ఖాయము. మిగతారూల్సు తదితరఫజుల్సువలెనే.

అడ్రసు:—మేనేజరు : గుడ్ లక్ అండ్ కంపెనీ, బెజవాడ.

Published by M. Chandrasekhara Rao
Printed by Tummala Venkata Ramiah } at Navasakti Press, Governorpet, Bezwada.

ఏప్రిల్ నెలలో విడుదల!


బెజవాడ రామగోపాల్ పిక్చర్సు వారి మహోత్తర పౌరాణిక చిత్రము

"పాశుపతాస్త్రము" (తెలుగు)

★

[illegible]

★



గానము:
గోపాల్ సింగ్

దర్శకుడు:
[illegible]

సరస్వతీ టాకీసు లిమిటెడ్, బెజ[illegible]

END OF ISSUE